


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

వేలాది ఫోన్లు ట్యాప్ చేశారు : ఎంపి చామల

చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం : మంత్రి పొన్నం

08

సంపుటి 09, సంచిక: 187 | ఆదివారం | 07-06-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ భారీ నిరసన



**విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకై డిమాండ్**

మంత్రిపై చర్యలకు బదులుగా తమ ఖాతాలను హ్యాక్ చేయడం సిగ్గుచేటని మండిపాటు

మా పోస్టులను తొలగించగలరేమో కానీ, మమ్మల్ని ఈ వేదిక నుండి చెరిపివేయలేరు : అభిజీత్ దీప్కే



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది యువత, విద్యార్థులు ఆందోళనలో పాల్గొన్నారు. దేశ విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెంచాలని, పరీక్షలు, నియామక ప్రక్రియల్లో జరుగుతున్న అక్రమాలకు బాధ్యత వహించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న పలువురు యువకులు బొద్దింకల మాస్కులు ధరించి, చేతుల్లో పూలతో నిరసన వ్యక్తం చేశారు. కొంతమంది పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యాశాఖ మంత్రి రాజీనామాను డిమాండ్ చేయడంతో పాటు, అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి) హిందూ–ముస్లిం రాజకీయాలకు పాల్పడటం మానుకోవాలని నిరసనకారులు నినాదాలు చేశారు. 'భారత్ మాతా కీ జై' అంటూ మాతృభూమికి జై కొట్టారు. భారీ భద్రత మధ్య ప్రణాళిక ప్రకారం జరిగిన ప్రదర్శనలో ఆన్‌లైన్ ఉద్యమం 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పాల్గొన్నారు. అనంతరం వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా ఆయనతో కలిశారు. ఈ నిరసనలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సిపిఐకి చెందిన అన్నీ రాజా, వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. కాగా, కేంద్ర సర్కార్‌పై అభిజీత్ దీప్కే విరుచుకుపడ్డారు. పరీక్షలు, నియామక పరీక్షలలో జరిగిన అవకతవకల తరువాయి 8లో

**ఎఐఎస్ఎఫ్, మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్ కార్యకర్తలపై**

# ఆర్ఎస్ఎస్ దాడి





**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా కోరుతూ ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సిజెపి ధర్నాకు సంఘీభావం హాజరైన ఎఐఎస్ఎఫ్, మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు), ఎఐవైఎఫ్ కార్యకర్తలపై ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దాడికి దిగారు. సిపిఐ జాతీయకార్యదర్శి నినాదాలు చేస్తూ, దూషిస్తూ మహిళలని చూడకుండా మీదకు దూసుకుపోయారు. తోపులాటలో మహిళా సమాఖ్య కార్యకర్తలు కిందపడిపోయారు. న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శనివారం జరిగిన సిజెపి ధర్నాలో సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు, ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి హరీశ్ బాలా, ఢిల్లీ కార్యదర్శి షిజో వర్గీస్, ధీరేంద్ర తివారి, ఎఐఎస్ఎఫ్ ఢిల్లీ నేతలు మోహిత్, ఆదిత్యన్ సహా కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై నిరసన వ్యక్తం చేశారు. మోదీ, ధర్మేంద్ర ప్రధానకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సమయంలో అప్పటికే జంతర్‌మంతర్‌కు వచ్చిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వీరి నిరసన వైపు దూసుకెళ్ళారు. మీద మీదకు వెళ్ళి చూపుడు వేలును చూపిస్తూ వీరంగం సృష్టించారు. దీంతో విద్యార్థి, యువజన, మహిళా సమాఖ్య కార్యకర్తలు ఆర్ఎస్ఎస్ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేయగా, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వారికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మీదకు దూసుకుపోయారు. వారిని అడ్డుకునేందుకు జరిగిన ప్రయత్నంలో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు బలంగా తోసేయడంతో నిషా సిద్ధూ, మరో ఇద్దరు యువతులు కిందపడిపోయారు. అయినప్పటికీ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వైఎఫ్, ఎస్ఎఫ్ కార్యకర్తలను నెట్టేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు.

**ఆర్ఎస్ఎస్ దాడిని తీవ్రంగా ఖండించిన సిపిఐ**

ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు కార్యకర్తలపై ఆర్ఎస్ఎస్ పిరికిపంద దాడిని సిపిఐ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఈ దాడి ప్రజాస్వామ్య హక్కులపై ప్రత్యక్ష దాడి అని, తమ వైఫల్యాలపై ప్రజల శాంతియుత ఆగ్రహాన్ని అణచివేయడానికి బిజెపి–ఆర్ఎస్ఎస్ కూటమి పడుతున్న తీవ్ర ఆరాటాన్ని తరువాయి 12లో

## ఎవరెంత ఏడ్చినా ఫ్యూచర్ సిటీ నిర్మిస్తాం

**ఆర్ఆర్ఆర్ ఆగదు : అభివృద్ధీ ఆగదు**

ఫామ్ హౌస్‌లో ఉండే కెడితోనైనా, ఢిల్లీలో ఉండే మోదీతోనైనా కొట్లాడతాం

కొహెడలో ఫ్రూట్‌మార్కెట్ శంకుస్థాపనలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి



తెలంగాణ ప్రజలు ఇచ్చిన ధైర్యంతో ఫామ్ హౌస్‌లో ఉండే కెడితోనైనా, ఢిల్లీలో ఉండే మోదీతోనైనా కొట్లాడుతానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఎవరెంత ఏడ్చినా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతామని, ఆర్ఆర్ఆర్ ఆగదు అని, అభివృద్ధి కూడా ఆగదు అని, వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నామన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న అంతర్జాతీయ సమీకృత మార్కెట్, ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సిఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి తరువాయి 8లో

## 50 లక్షల ఎకరాలకు ఇప్పటికీ సాగునీరు లేదు



రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు పూర్తయినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు

'మీట్‌ది ప్రెస్'లో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రజాపక్షం/హైదరాబాద్

సకల జనులు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు పూర్తయినా నేటికీ ప్రజల ఆకాంక్షలు, ఉద్యమ లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడిన తెలంగాణలో రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, దళితులు, గిరిజనులు, బిసిలు, మైనారిటీల సమస్యలు తరువాయి 12లో

## ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు కూల్చివేత

కువైట్–బ్రహ్రైన్‌లో అమెరికా స్థావరాలపై క్షిపణి దాడులు : ఐఆర్‌జిసి ప్రకటన

అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న దాడులు

**కైరో:** ఇరాన్–అమెరికా మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. హోర్ముజ్ జలసంధిలోకి అనుమతి లేకుండా ప్రవేశించేందుకు ప్రయత్నం చేసి ట్యాంకర్లపై కాల్పులు జరిపామని, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా యుద్ధ నౌకకు హెచ్చరికలు చేస్తూ క్షిపణి దాడులు చేశామని, కువైట్,బ్రహ్రైన్‌లలో కూడా అమెరికా స్థావరాలపై దాడులు చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. లెబనాన్ నుండి ఇజ్రాయెల్ వైదొలగనంతకాలం పశ్చిమాసియాలో శాంతి సాధ్యం కాదని ప్రకటించింది. ఇరాన్ కోస్తా తీర ప్రాంతంలో ఉన్న రాడార్ కేంద్రంపై అమెరికా దాడులు చేసింది. గోరుక్‌లోని లక్ష్యాలపై తరువాయి 8లో



నీట్ పరీక్ష ప్రశ్నా పత్రం లీక్ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని హిమాయత్‌నగర్ 'వై' జంక్షన్ వద్ద ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిరసన

12








## సూక్ష్మ జీవుల పరిమాణం ఎంత?



ప్రపంచంలోని అన్ని బ్యాక్టీరియాలను ఒక దానిపై ఒకటి పేర్చితే 10 బిలియన్ లైట్‌ఇయర్స్ దూరం చేరుతాయని కొన్ని వాదనలు వినిపిస్తాయి. ఈ వాక్యం వినడానికి ఆశ్చర్యకరంగా ఉన్నప్పటికీ, శాస్త్రీయంగా పరిశీలిస్తే ఇది వాస్తవానికి చాలా దూరంగా ఉంటుంది. ఒక లైట్‌ఇయర్ అంటే సుమారు 9.46 ట్రిలియన్ కిలోమీటర్లు. కాబట్టి 10 బిలియన్ లైట్‌ఇయర్స్ అనేది విశ్వస్థాయి అపార దూరం. భూమిపై ఉన్న మొత్తం బ్యాక్టీరియా సంఖ్య సుమారు '10 టు ది పవర్ ఆఫ్ 30' అని అంచనా వేసి నా, వాటి పరిమాణాన్ని గణితపరంగా లెక్కిస్తే ఈ స్థాయి దూరాన్ని చేరడం సాధ్యం కాదు. ఇంకొక ప్రాచుర్యం పొందిన వాదన ప్రకారం, 0.001 మిల్లీమీటర్ల పొడవున్న సూక్ష్మ జీవులు మిల్కీ వే గెలాక్సీని 20,000 సార్లు చుట్టేస్తాయట. మిల్కీ వే గెలాక్సీ వ్యాసం సుమారు 100,000 కాంతి సంవత్సరాలు. దీన్ని 20,000 సార్లు చుట్టాలంటే అవసరమైన మొత్తం పొడవు అనూహ్యంగా ఎక్కువగా ఉంటుంది. ఈ లెక్కను సూక్ష్మ జీవుల పరిమాణంతో పోలిస్తే, ఇది గణితపరంగా సాధ్యం కాని అతిశయోక్తిగా కనిపిస్తుంది. తార్కికంగా పరిశీలిస్తే, ఒక బ్యాక్టీరియా సగటు పొడవు సుమారు 1 మైక్రోమీటర్ (0.001మిల్లీమీటర్). ఈ పొడవును మొత్తం బ్యాక్టీరియా సంఖ్య (10kp)తో గుణిస్తే పెద్ద సంఖ్య వస్తుంది. అయినప్పటికీ, ఆ మొత్తం పొడవు బిలియన్ లైట్ ఇయర్స్ స్థాయికి చేరదు. ఇక్కడ సమస్య సంఖ్యల్లో కాదు...వాటిని ఎలా అర్థం చేసుకుంటున్నామన్నదే కీలకం. ఈ తరహా వ్యాఖ్యలను శాస్త్రీయ నిజాలుగా కాకుండా ఆశ్చర్యాన్ని కలిగించే వర్ణనలుగా చూడాలి. ఇవి ఖచ్చితమైన లెక్కల కోసం కాకుండా, ప్రకృతి యొక్క విస్తృత పరిమాణాన్ని మనకు ఊహించేందుకు ఉపయోగపడతాయి. అంటే, సూక్ష్మ జీవుల విపరీత సంఖ్యను మనకు అర్థమయ్యేలా చెప్పేందుకు ఈ విధమైన పోలికలు ఉపయోగిస్తారు. అయితే వాటిని పేర్చి విశ్వస్థాయి దూరాలను చూపించడం శాస్త్రీయంగా సరైనది కాదు.

## టై కట్టుకోవడం ప్రమాదకరమా?



నెక్‌టై ధరించడం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందనే వాదనలు ఇటీవలి కాలంలో చర్చకు వచ్చాయి. ముఖ్యంగా, మెదడుకు వెళ్లే రక్తప్రవాహంపై టై ప్రభావం ఉంటుందా అనే ప్రశ్న పరిశోధనల దృష్టిని ఆకర్షించింది. కొన్ని అధ్యయనాల్లో, టైను బిగిగా కట్టినప్పుడు మెడలోని రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి, మెదడుకు వెళ్లే రక్తప్రవాహం సుమారు 7–8 శాతం వరకు తగ్గినట్లు గమనించారు. అయితే, ఈ ఫలితాలు చిన్న నమూనా పరిమితిలోనే వచ్చినందున, వాటిని సాధారణ జనాభాకు నేరుగా వర్తింపజేయడం శాస్త్రీయంగా సమంజసం కాదు. టై ధరించడం వల్ల తలనొప్పి లేదా తల తిరగడం వంటి సమస్యలు వస్తాయా? అనే ప్రశ్నకు సమాధానం పరిస్థితినిబట్టి మారుతుంది. టైని అత్యంత బిగిగా కట్టినప్పుడు మెడపై ఒత్తిడి పెరిగి, రక్తప్రసరణ లేదా నాడీవ్యవస్థపై స్వల్ప ప్రభావం చూపవచ్చు. దీనివల్ల కొందరికి అసౌకర్యం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపించవచ్చు. అయితే సాధారణంగా సడలుగా కట్టిన టై వల్ల ఈ సమస్యలు ఉత్పన్నం కావడం అరుదు. కంటి ఒత్తిడి విషయానికొస్తే, బిగిగా ఉన్న టై మెడలోని శిరలపై ఒత్తిడిని పెంచి, కంటి లోపలి ఒత్తిడి స్వల్పంగా పెరగడానికి కారణమవుతుందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది ప్రత్యేకంగా గ్లాకోమా వంటి కంటి సమస్యలు ఉన్నవారికి ప్రాముఖ్యంగా మారవచ్చు. అయినప్పటికీ, ఇది సాధారణ వ్యక్తులకు పెద్ద ప్రమాదం కాదు. ఇంకా ఒక వాదన ప్రకారం, టైలు సూక్ష్మ జీవాలను మోసుకెళ్తాయని అంటారు. ఇందులో కొంతవరకు నిజం ఉంది, ఎందుకంటే టైలను తరచుగా శుభ్రం చేయకపోవడం సాధారణం. అందువల్ల అవి బ్యాక్టీరియా నిల్వకు కారణమవ్వొచ్చు. అయితే ఇది టైకి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. శుభ్రం చేయని ఏ వస్త్రమైనా ఇదే పరిస్థితిని కలిగిస్తుంది. తార్కికంగా విశ్లేషిస్తే, ఈ మొత్తం చర్చలో ప్రధాన సమస్య సంభావ్య ప్రమాదాన్ని సాధారణ ప్రభావంగా చూపించడం. అంటే, కొన్ని పరిస్థితుల్లో మాత్రమే కనిపించే ప్రభావాలను అన్ని సందర్భాలకు వర్తింపజేయడం జరుగుతోంది. తుదకు, నెక్‌టై ధరించడం సాధారణ పరిస్థితుల్లో ప్రమాదకరం కాదు. అయితే, దాన్ని అతిగా బిగించి ధరించడం వల్ల అసౌకర్యం కలగవచ్చు. కాబట్టి, సరైన విధంగా, సడలుగా ధరించడం ఉత్తమం.

## దీర్ఘాయుష్షు కుక్కలు..



ఆస్ట్రేలియాలో జీవించిన బ్లూయి అనే కుక్క ప్రపంచంలో అత్యంత దీర్ఘాయుష్షు పొందిన కుక్కల్లో ఒకటిగా రికార్డు పుస్తకాల్లో స్థానం సంపాదించింది. ఇది సుమారు 29 సంవత్సరాలు 5 నెలలు బ్రతికినట్లు నమోదైంది. కుక్కల జీవితకాలంతో పోలిస్తే ఇది అసాధారణం. సాధారణంగా చిన్న జాతుల కుక్కలు 12–15 సంవత్సరాలు, పెద్ద జాతులవి 8–12 సంవత్సరాలు మాత్రమే జీవిస్తాయి. ఈ నేపథ్యంలో బ్లూయి జీవితం దాదాపు రెట్టింపు కాలం. అయితే, ఇదే ప్రపంచంలో అత్యంత వృద్ధ కుక్క అని ఖచ్చితంగా నిర్ణయించ డం కొంతవరకు సమస్యాత్మకం. పాతకాలపు రికార్డుల ఖచ్చితత్వం ఎల్లప్పుడూ నిర్ధారించలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆధునిక కాలంలో కూడా కొత్త రికార్డుల ప్రకటనలు జరుగుతునే ఉన్నాయి. ఉదాహరణకు, బొబీ అనే కుక్క ఇటీవల అత్యంత వయసుగల కుక్కగా ప్రకటించినప్పటికీ, ఆ రికార్డు విశ్వసనీయతపై వివాదాలు తలెత్తాయి. కాబట్టి, అత్యంత వృద్ధ అనే పదాన్ని ఉపయోగించేటప్పుడు రికార్డు ధ్రువీకరణ ప్రమాణాలు కీలకం. తార్కికంగా పరిశీలిస్తే, ఒక కుక్క 29 సంవత్సరాలకు పైగా జీవించడం అనేది సాధారణ జీవశాస్త్ర పరిమితులను మించి ఉంటుంది. దీనిని సమతు ల్య ఆహారం, తక్కువ ఒత్తిడి ఉన్న జీవనశైలి, నిరంతర వైద్య సంరక్షణ మొదలైన పలు కారకాల అంశాల సమ్మేళనంగా చూడాలి. ఇక్కడ ముఖ్యమైన విశ్లేషణాత్మక లోపం ఏమిటంటే, ఒక అపవాదాన్ని సాధారణ ప్రమాణంగా భావించడం. బ్లూయి వంటి ఉదాహరణలను ఖాయంగా తీసుకోవడానికి వీల్లేదు. ఇవి సాధారణ ధోరణిని సూచించవు. ఇవి జీవ వ్యవస్థలలో ఉండే వైవిధ్యాన్ని మాత్రమే ప్రతిబింబిస్తాయి.

## వృద్ధ మార్జాలం..



పిల్లులలో అత్యంత దీర్ఘాయుష్షు సాధించిన మార్జాలానికి ఉదాహరణగా క్రీమ్ పఫ్ పేరును పేర్కొంటారు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో జీవించిన ఈ పిల్లి 38 సంవత్సరాలు 3 రోజులు బ్రతికినట్లు నమోదు అయింది. అందుబాటులో ఉన్న ఆధారాల ప్రకారం, ఇది అత్యంత విశ్వసనీయమైన, విస్తృతంగా అంగీకరించిన రికార్డులలో ఒకటిగా కొనసాగుతున్నది. సాధారణ పరిస్థితుల్లో పిల్లుల జీవితకాలం 12 నుండి 18 సంవత్సరాల మధ్య ఉంటుంది. మెరుగైన సంరక్షణ, పోషకాహా రం, వైద్య సేవలతో కొన్ని పిల్లులు 20 సంవత్సరాల వరకు జీవించవచ్చు. ఈ నేపథ్యంలో, క్రీమ్ పఫ్ జీవితం సాధారణ సగటు తో పోలిస్తే రెండింతలకు మించి ఉంది. ఇది సహజ జీవశాస్త్ర పరిమితులను మించి పోయే అరుదైన ఉదాహరణగా చూడాలి. అయితే, ఇదే ప్రపంచంలో ఎప్పటికీ అత్యంత వృద్ధ పిల్లి అనే వాదనను పరిశీలించినప్పుడు జాగ్రత్త అవసరం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ధ్రువీకరించిన రికార్డుల ప్రకారం ఇది నిజమే. కానీ రికార్డులు శాశ్వతం కావు. భవిష్యత్తులో కొత్త ఉదాహరణలు ఈ స్థాయిని అధిగమించే అవకాశం ఉంది.

– బిఎస్ఎస్ మైత్రేయి

# తమిళనాడులో అన్నామలై రాజకీయం

అసెంబ్లీ ఎన్నికల దరిమిలా తమిళనాడు రాజకీయాలు అనేక మలుపులు తిరుగుతున్నాయి. రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై తన భవిష్యత్ రాజకీయ ప్రయాణాన్ని ఆ పార్టీ కేంద్ర నాయకులకు వివరించి వారి ఆశీస్సులు పొందిన తర్వాత గతవారం ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయటం ఒక కొత్త తరహా రాజకీయం. డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం ఆదర్శాల ప్రేరణతో తాను ఒక 'రాజకీయ ఉద్యమం' (అవసరమైనప్పుడు అదే పార్టీగా మారుతుంది) ప్రారంభిస్తున్నట్లు అన్నామలై శుక్రవారం చెన్నైలో ప్రకటించారు. అన్నామలై రాజీనామాను ఆమోదించినట్లు అంతకు కొద్దిగంటల ముందు బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఢిల్లీలో ప్రకటించారు. తమ ఉద్యమ కార్యకర్తలు కోయంబత్తూరులోని కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ అండ్ పాలిటిక్స్‌లో శిక్షణ పొందుతారని, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో తాను ప్రారంభిస్తున్న రాజకీయ ఉద్యమం అంతిమంగా రాజకీయ పార్టీగా మారుతుందని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందని అన్నామలై తమ రాజకీయ ఆకాంక్షను దాపరికం లేకుండా ప్రకటించారు. అన్నామలై ప్రకటన తదుపరి రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు ..నాగరాజ్ సహా పలువురు బిజెపికి రాజీనామా ప్రకటించారు. అన్నామలైతో చేరతామని చెప్పారు. సోషల్ మీడియా పోస్టుల ద్వారా యువతరాన్ని ఆకర్షించటం కొత్త రాజకీయ లక్షణంగా స్థిరపడుతున్నందున అన్నామలై తమ ద్రవిడ వ్యతిరేక, జాతీయవాద భావజాలం వ్యాప్తి చేయటానికి అదే మార్గాన్ని ఎంచుకున్నారు.

అన్నామలై కర్నాటక కేడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి. "సింగం"గా ప్రాచుర్యం పొందాడు. 2021 నుంచి 2025 వరకు రాష్ట్ర బిజెపి అధ్యక్షునిగా పనిచేశారు. ద్రవిడ పారంపర్య రాజకీయాలపై విరుచుకుపడుతూ జాతీయవాదంతో బిజెపికి స్వతంత్ర అస్థిత్వంకోసం కృషి చేశారు. తమిళనాడులో బిజెపికి సాంప్రదాయకంగా ప్రజాదరణ లేదు. జయలలిత మరణానంతరం ఎఐఎడిఎంకెలో ఏర్పడిన నాయకత్వం శూన్యంలోకి చొరబడి దానితో పొత్తుతో బలపడాలనే వ్యూహం ఎంచుకుంది. అయితే అన్నామలై సొంత చొరవతో ద్రవిడ రాజకీయాలతో తలపడటం, అవినీతి వ్యతిరేక ఆందోళనలు చేపట్టటంవల్ల 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఓటు 11శాతానికి పెరిగింది. అయితే అధిష్టానవర్గం ఎఐఎడిఎంకెతో పొత్తు రాజకీయంతో అన్నామలై విభేదించటం, అన్నామలైని రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని ఎఐఎడిఎంకె షరతు విధించటంతో 2025 ప్రారంభంలో ఆయన్ను పదవినుంచి తొలగించింది బిజెపి అధిష్టానం. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ కూడా చేయలేదు. దాదాపు 30సీట్లు పోటీచేసిన బిజెపికి ఒక్కసీటు మాత్రమే దక్కింది. అన్నామలై వాగాడంబరం జనాలను ఆకర్షించినా అతనికి ఎన్నికలు కలిసిరాలేదు. 2021లో అరవకురుచ్చి అసెంబ్లీ సీటు నుంచి, 2024లో కోయంబత్తూరు లోక్‌సభ స్థానానికీ అన్నామలై పోటీ చేసినా రెండుసార్లూ ఓటమి వరించింది.

ప్రభుత్వ సర్వీసుల్లో నిజాయితీపరులుగా పేరుపొంది, సామాజిక స్పృహ కలిగిన ఉన్నతాధికారులు (ఐఎఎస్, ఐపిఎస్‌లు) కొందరు అప్పుడప్పుడూ ఉద్యోగం వదిలి ప్రజాక్షేత్రంలోకి వస్తుంటారు. రాజకీయాల్లో నెగ్గుకురావటం సులభంకాదని దిగినాక అర్థమవుతుంది. ఆ కోవకు చెందిన అన్నామలై హిందూత్వవాది. ద్రవిడ రాజకీయానికి మూలం హేతువాదం. అందువల్ల ఆయన డిఎంకె, అన్నాడిఎంకెల మూలాలపై దాడిచేసినా ఫలితం లేకపోయింది. తమిళనాడులో కొత్తపార్టీకి ఇప్పటికీ జాగా ఉందని నమ్ముతున్న అన్నామలై నేరుగా రాజకీయాల్లో దిగకుండా, సోషల్ మీడియా వేదికను ఎందుకు ఎంచుకున్నట్లు? యువత రాజకీయాలకు సమయం ఇవ్వటం లేదని ఆయనకు తెలుసు. అందువల్ల సోషల్ మీడియా పోస్టుల ద్వారా వారిని ఆకర్షించటం సులువు అని భావించి ఉంటారు. పొరుగున ఉన్న శ్రీలంకలోనేగాక తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సైతం టివికె పార్టీ వ్యవస్థాపకుడు, సినీమా హీరో విజయ్ అనూహ్యంగా అందలం అధిరోహించటంలో సోషల్ మీడియాదే ప్రధాన పాత్ర అని గ్రహించి ఉంటారు.

విజయ్ ముఖ్యమంత్రి పీఠం అధిరోహించటానికి కనీస మెజారిటీ లేనప్పటికీ, ఆ పేరుతో రాష్ట్రపతి పాలన విధించి పాలన పగ్గాలను బిజెపి తన చేతికి తీసుకునే ప్రమాదాన్ని నివారించటానికి ముందు కాంగ్రెస్, ఆ తర్వాత సిపిఐ, సిపిఐ(ఎం), విసికె, ముస్లింలీగ్ ఆయనకు తోడ్పాటిచ్చాయి. ఆ తర్వాత ఎఐఎడిఎంకె శాసనసభాపక్షంలో చీలిక వచ్చింది. విజయ్ బిజెపితో ఎన్నికల పొత్తును నిరాకరించాడు, అధికారంలో ఉన్న డిఎంకెపై దాడిని ఎక్కుపెట్టాడు. అతని వ్యూహం ఫలించింది. ఇప్పుడు అన్నామలై ఏమి చేయబోతున్నారు? తన అనుయాయులకు నీతిసూత్రాలు, ఆదర్శాలు బోధించవచ్చు. అవినీతిపై రాజకీయ నాయకుల ఆస్తులు, వ్యక్తిగత జీవితంపై విమర్శలు చేయవచ్చు. ఉద్రేకపూరిత ప్రసంగాలు చేయవచ్చు. కాని నీవు ఎటు? నీది అతివాదమా, మితవాదమా? హేతువాదమా, హిందూత్వనా? అనే ప్రశ్నలు ఎదురైనప్పుడు అన్నామలై ఎంచుకునే మార్గమే ఆయన భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. నిర్దిష్టంగా భావజాలం వేళ్లూని ఉన్న రాష్ట్రంలో ప్రాంతీయవాదానికి జాతీయవాదాన్ని పోటీపెట్టటం, పరోక్షంగా బిజెపితో సంబంధాలు కలిగి ఉండటం అన్నామలై ఆకాంక్షలు నెరవేర్చదు. ప్రాంతీయ మనోభావాలు బలంగా ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో జాతీయవాదాన్ని, సనాతన ధర్మవాదాన్ని బలంగా ముందుకు తెచ్చే నాయకులను బిజెపి ఎంచుకుంటున్నది. చేగువేరా విప్లవ తత్వం, సామాజిక మార్పు భావాలతో దశాబ్దం క్రితం జనసేన పార్టీ నెలకొల్పిన సినీస్టార్ పవన్ కల్యాణ్ ఇప్పుడు సనాతన ధర్మం, జాతీయవాదం ప్రచారంలో మునగటాన్ని మనం చూస్తున్నాం. అన్నామలై ఆ పంథానుంచి పూర్తిగా – తమిళ ప్రజలకు అర్థమయ్యేరీతిలో దూరం జరగకపోతే బిజెపికి వంతగానే పరిగణించబడతాడు. ●

# ఆందోళన కలిగిస్తోన్న వాతావరణ మార్పు



సయ్యద్ అజీజ్ పాషా
మాజీ ఎంపి

రోజురోజుకు వాతావరణం క్షీణిస్తుండటంతో వాతావరణ మార్పు అనేది నేడు అత్యంత చర్చనీయాంశంగా మారింది. వాతావరణ శాస్త్రవేత్తల అంచనాలను సామాన్యులు అవహేళన చేసినప్పటికీ, లోతైన అధ్యయనం చేస్తే వారు ముందుగా వేసిన అంచనాలు దాదాపుగా సరైనవేనని తేలింది. ఎందుకంటే అవి లోతైన అధ్యయనాలు ఆధారంగా వేసిన అంచులు. భారతదేశంలో మనం కరువు, తీవ్రమైన వడగాలులు, వర్షాకాలంలో (కొన్ని ప్రాంతాలలో) బీభత్సమైన వరదలను చూస్తున్నాము.

ప్రపంచవ్యాప్తంగా అంటార్కిటికా, గ్రీన్‌ల్యాండ్స్, ఇతర హిమానీనదాలలో మంచు కరగడమే దీనికి కారణం. అడవుల నరికివేత, కార్చిచ్చులు, వేడి పెరుగుదల వంటివి సముద్ర మట్టాన్ని మరింత పెంచి, తీరప్రాంత నగరాలు, ద్వీప దేశాలను భయంకరమైన తుపానులతో హెచ్చరిస్తున్నాయి.

భారతదేశం ఒక క్లిష్టమైన దశలో ఉంది. ఎందుకంటే 77 శాతం జిల్లాలు అధిక నుండి అత్యధిక ఉష్ణోగ్రత ప్రమాదంలో ఉన్నాయి. దీని ఫలితంగా 2025 నాటికి 54 లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. గత 39 సంవత్సరాలలో వాతావరణ మార్పుల వల్ల అత్యధికంగా ప్రభావితమైన దేశాలలో భారతదేశం 9వ స్థానంలో ఉంది. మధ్య,తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలోని ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం ద్వారా వర్గీకరించబడిన వాతావరణ నమూనా అయిన ఎల్‌నినో మరొక ముఖ్యమైన అంశం.

గత 15 సంవత్సరాలుగా భారతదేశంలో తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు ఎల్‌నినో ఒక ప్రధాన కారణంగా ఉంది. ఇది ప్రధానంగా రుతుపవనాలను తొక్కిపెట్టి, దుర్భిక్షం, వడగాలుల పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తుంది. పర్యావరణ విధ్వంసానికి అడవుల నిర్మూలన మరో కారణం. అడవులు



నాశనమైనప్పుడు, గిరిజన వర్గాలు అత్యధికంగా నష్టపోతాయి. వారు జీవనోపాధి కోసం నగరాలకు వలస వెళ్తారు. 2006 అటవీ హక్కుల చట్టం స్థానభ్రంశం చెందిన వ్యక్తులకు కొన్ని హక్కులు, అధికారాలను కల్పించినప్పటికీ, గిరిజనులను తరచుగా వారి సొంత భూములలో ఆక్రమణదారులుగా ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా, గిరిజనులు ప్రపంచ సగటు కంటే దాదాపు 7 రెట్లు అధిక రేటుతో వాతావరణ మార్పుల కారణంగా స్థానభ్రంశం చెందుతున్నారు. కాబట్టే అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయడం ప్రాథమికమైనది. ఏదైనా అభివృద్ధి లేదా ఏదైనా ప్రాజెక్టుకు సంబంధిత గ్రామసభ సమ్మతి అవసరం. కానీ మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఆదేశాన్ని అమలు చేయడం లేదు. దానికి విరుద్ధంగా, వారు గౌతమ్ అదానీకి ప్రభుత్వ భూమిని మంజూరు చేయడం ద్వారా తమ ఉదారతను ప్రదర్శించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వం సర్గుజాలో 1742.6 హెక్టార్ల అటవీ భూమిని అదానీకి బదిలీ చేసింది. మధ్యప్రదేశ్, బిహార్, అస్సోం, మహారాష్ట్రలు కూడా వరుసగా 7వేలు, 1040, 116, 87.35 హెక్టార్ల భూమిని అదానీకి మళ్లించాయి. స్థానిక గ్రామ సభల ఆమోదం తప్పనిసరి అనే ప్రక్రియను పక్కనపెట్టి ఈ భూములను కేటాయించారు. తద్వారా ఇది అటవీ హక్కుల చట్టాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమే కాకుండా, వన్యప్రాణుల కారిడార్‌కు ముప్పు వాటిల్లడానికి కారణమవుతోంది.

2015–16 నాటి సంఘటనలను మరోసారి పరిశీలిస్తే, పరిస్థితి మరింత దారుణంగా మారింది. ప్రజల కష్టాలను తగ్గించడానికి భారత ప్రభుత్వం 7–8 పథకాలను ప్రారంభించింది. కానీ, అమలు చాలా నెమ్మదిగా, నామమాత్రంగా, పెద్ద సంఖ్యలో ప్రజలకు అందుబాటులో లేకుండా ఉంది. చివరగా, పౌరులుగా మనం వర్షపు నీటి సేకరణ కోసం కొన్ని సానుకూల చర్యలు తీసుకోవాలి.

నీటి పైపులలోని లీకేజీలను సరిచేయడం, స్థానిక, వాతావరణ మార్పులను తట్టుకునే మొక్కలను నాటడం, నగరాలను పచ్చగా మార్చడానికి నిర్దిష్ట సంఖ్యలో మొక్కలు నాటిన తర్వాతే నిర్మాణ ప్లానులకు అనుమతి ఇచ్చేలా పురపాలక సంఘాలు, పురపాలక సంస్థలకు తప్పనిసరి చేయడం వంటివి చేయాలి.

బెంగళూరు పురపాలక సంస్థ చాలా కాలం క్రితమే భవన నిర్మాణ ప్లానుల ఆమోదానికి దీనిని ఒక ముందస్తు షరతుగా పెట్టింది. కాబట్టి, ప్రకృతి ప్రకోపాన్ని కొంత మేరకు ఎదుర్కోవడానికి, ప్రజల బాధలను తగ్గించడానికి ప్రభుత్వంతో పాటు, పౌరుల చొరవ అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉంది.

# ఇప్టా ఘన వారసత్వాన్ని చాటిన జాతీయ నాటకోత్సవాలు

## ముంబైలో జయప్రదంగా సంప్రదాయ పునరుద్ధరణ

హర్మన్ సింగ్



స్వాతంత్ర్యం కోసం భారతదేశం పోరాడుతున్న సమయంలో ప్రపంచం రెండవ ప్రపంచ యుద్ధం సృష్టించిన సంక్షోభంలో చిక్కుకుంది. బెంగాల్ ప్రజలు కరువు కాటకాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణమది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో 1943, మే 25న వివిధ రాష్ట్రాలు, సంస్థానాలకు చెందిన రచయితలు, కళాకారులు బొంబాయిలో సమావేశమై 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్'(ఇప్టా)ను ఏర్పాటు చేశారు. యుద్ధం, కరువు, రాజకీయ అణచివేతతో కూడిన ఆ కాలంలో, ఫాసిజం, మతతత్వం, పేదరికానికి వ్యతిరేకంగా ప్రతిఘటనకు సాధనాలుగా ఇప్టా నాటక, సంగీత, నృత్య, చలనచిత్ర రంగాలను మలిచింది. 'ప్రజలే ఇప్టాకు నాయకులు (హీరోలు)' అనేది ఇప్టా నినాదం.

ఎనిమిది దశాబ్దాలకు పైగా క్రియాశీలకంగా కొనసాగుతున్న ఇప్టా దేశంలో ఒక ముఖ్యమైన సాంస్కృతిక ఉద్యమంగా ఎదిగింది. కళ అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, అది సామాజిక పరివర్తనకు కూడా స్ఫూర్తినిస్తుందని ఈ సంస్థ నిరూపించిం ది.

చాలా ఏళ్లపాటు ఇప్టా ముంబైలో నాటకోత్సవాలను నిర్వహించింది. వివిధ కారణాల వల్ల ఆ సంప్రదాయం కొనసాగడం లేదు. సుదీర్ఘ విరామం తర్వాత కైఫీ, షౌకత్ అజ్మీల స్ఫూర్తితో, అలాగే ఇప్టా పునర్వ్యవస్థీకరణలో కీలక పాత్ర పోషించిన జితేంద్ర రఘువంశీ స్మారకార్థం ఈ ఏడాది మే 20 నుండి 27 వరకు ఇప్టా ఒక ఉత్సవాన్ని నిర్వహించింది. ముంబైలోని మాతుంగాలో ఉన్న మైసూర్ అసోసియేషన్ ఆడిటోరియం లో జరిగిన ఈ ఉత్సవానికి ఇప్టా జాతీయ కమిటీ నాయకత్వం వహించ గా, ఇప్టా ముంబై విభాగం ఆతిథ్యమిచ్చింది. ఇందులో ఢిల్లీ, నాసిక్, ముంబై, పంజాబ్‌లోని కపుర్తలా, మధ్యప్రదేశ్‌లోని ఇందోర్, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, తమిళనాడు, ఒడిశా, బిహార్‌లోని పాట్నా ప్రాంతాల నుండి కళాకారులు పాల్గొన్నారు. వీరు హిందీ, తమిళం, మరాఠీ, ఒడియా, పంజాబీ భాషలలో మొత్తం 12 నాటకాలను ప్రదర్శించారు.

గిరిజన, దళిత వర్గాలు, అసమానత, మహిళల గౌరవం, సామాజిక న్యాయం, మతతత్వం, పర్యావరణ సమస్యలు, మార్కెట్ ఆధారిత సంస్కృతి వంటి అంశాలపై కళాకారులు నాటకాలను ప్రదర్శించారు. ఇప్టా జెఎన్‌యు బృందం ప్రదర్శించిన 'గోహ్' అనే నాటకం, ఆదివాసీల జీవనం, వారి సంస్కృతి, పురాణ గాథలు, జీవనశైలి, పర్యావరణ పరిరక్షణ కోసం వారు చేసే పోరాటాలను ఆవిష్కృతం చేసింది. వందన టెటే, అనుజ్ లుగున్, జసింత కెర్కెట్టాల కవితల ఆధారం. ఈ నాటకానికి జెఎన్‌యు బృందం సమిష్టిగా దర్శకత్వం వహించింది.

ఆనంద్ బసు దర్శకత్వం వహించిన ఇప్టా తమిళనాడు వారి 'ఉర్యంత తీరప్పు'(సుప్రీం తీర్పు) నాటకం నీరు, అడవులు, భూమి మధ్య ఉన్న సంబంధాన్ని నొక్కి చెబుతూ, భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు, సాధారణ పౌరుల హక్కులకు మధ్య నెలకొన్న సంఘర్షణను హృద్యంగా చూపింది.

ముకేశ్ కాలే దర్శకత్వం వహించిన ఇప్టా నాసిక్ వారి 'ఉపత్ శుంభ్' (తప్పు దారి పట్టిన రాక్షసుడు) నలుగురు కష్టపడుతున్న కళాకారుల కథ ద్వారా వినోద పరిశ్రమ ఆడంబరం వెనుక ఉన్న కఠోర వాస్తవాలను బహిర్గతం చేసే ఒక వ్యంగ్య హాస్యనాటకం.

ఇందర్‌జీత్ రూపోవాలి దర్శకత్వం వహించిన ఇప్టా పంజాబ్ వారి 'కుడే విచ్ ఖిద్య గులాబ్' (చెత్తలో వికసించిన గులాబీ) నాటకం కుల, వర్గాల కోణంలో ఒక పారిశుధ్య కార్మికుడైన తండ్రీ కొడుకుల కథను చిత్రీకరించిం ది. ఇది రిజర్వేషన్ విధానాలపై వచ్చిన విమర్శలపై కూడా ప్రతిస్పందనను వ్యక్తీకరించింది.




గుల్రేజ్, సారిక శ్రీవాస్తవ దర్శకత్వంలో ఇప్టా ఇందోర్ ప్రదర్శించిన 'ఆజాదీ కే తరానే' నాటకం క్విట్ ఇండియా ఉద్యమం నుండి స్వాతంత్ర్యం వరకు జరిగిన భారతదేశ స్వాతంత్ర్య పోరాటాన్ని చిత్రించింది. విస్తృతమైన పరిశోధన ఆధారంగా ఇది చిమూర్, బల్లియా, మిడ్నాపూర్‌లలో కార్మికులు, రైతులు, విద్యార్థులు, సాధారణ పౌరులు పాల్గొన్న స్థానిక తిరుగుబాట్లను ప్రదర్శించింది. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎవరు లేరో కూడా ఈ నాటకం చూపిందని ఆనంద్ పట్వర్ధన్ వ్యాఖ్యానించారు.

వేద్ రాకేశ్ దర్శకత్వంలో ఇప్టా లక్నో ప్రదర్శించిన 'సప్నా మేరా యహీ సఖీ' నాటకం, మధ్యయుగపు మహిళా కవయిత్రులు మీరాబాయి, అక్క మహాదేవి, ఆండాళ్, లల్లన్‌ల తిరుగుబాటు స్ఫూర్తిని ప్రకటించింది. సామాజిక కట్టుబాట్లను సవాలు చేసే మహిళలను సమాజం ఎలా దైవంగా పూజిస్తుందో లేదా ఖండిస్తుందో ఇది చూపిస్తుంది.

ఇప్టా ముంబైకి చెందిన నిధి కాంత్ పాండే దర్శకత్వం లో బల్‌రాజ్ సాహ్నీ రచించిన 'మేరీ ఫిల్మీ ఆత్మకథ' సంగీత రూపకాన్ని, అనురాధ దార్ నిర్మించిన 'ఆనంద్ హి ఆనంద్' చిత్రాన్ని ప్రదర్శించింది. ఈ చిత్రం చేతన్, దేవ్, విజయ్ ఆనంద్‌ల మధ్య ఉన్న సంబంధాలను, హిందీ సినిమాకు వారు చేసిన సేవలను వివరించింది.

ఇప్టా ఒడిశా ప్రదర్శించిన 'ఏకనువా సకలర అపేక్షరే' (ఒక కొత్త ఉదయం కోసం ఎదురుచూడటం), విక్రమ్ కేసరి జెనా దర్శకత్వంలో, ఇద్దరు సోదరుల మధ్య నెలకొన్న సైద్ధాంతిక సంఘర్షణను చిత్రీకరించింది. వారిలో ఒకరు అవినీతిపరుడైన రాజకీయ నాయకుడు, మరొకరు సాయుధ విప్లవాన్ని విశ్వసించేవాడు. వీరు చివరికి గాంధేయ విలువలను స్వీకరిస్తారు.

ఇప్టా జోధ్‌పూర్ ప్రదర్శించిన కృష్ణ చందర్ రచించిన 'థాలీ కా బైంగాన్', డాక్టర్ వికాస్ కపూర్ దర్శకత్వంలో అజ్ఞానం, అవకాశవాదంపై వ్యంగ్యం ద్వారా కుల, మతాల పేరిట జరిగే దోపిడీని తీవ్రంగా విమర్శించింది.

తన్వీర్ అక్తర్ దర్శకత్వంలో జరిగిన ఇప్టా బిహార్ 'కోర్ట్ మార్షల్' నాటకం తన పైఅధికారిని హత్య చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక సైనికుడి విచారణ ద్వారా కులతత్వం వికృత రూపాన్ని బట్టబయలు చేసింది. రమేశ్ తల్వార్ దర్శకత్వంలో జరిగిన ఇప్టా ముంబై వారి 'హమ్ పర్వానే: ది స్టోరీ ఆఫ్ అష్ఫకుల్లా ఖాన్ వార్సీ', అష్ఫాఖ్ ఉల్లా ఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్‌ల త్యాగాలను కీర్తించింది. వారి విప్లవ వారసత్వం భగత్ సింగ్, ఆయన సహచరులకు స్ఫూర్తినిచ్చింది.

1943 మే 25న బొంబాయిలోని మార్వాడీ విద్యాలయంలో జరిగి న ఇప్టా సదస్సుకు జవహర్‌లాల్ నెహ్రూ పంపిన సందేశంలో 'ప్రజలు, వారి సంప్రదాయాలలో వేళ్ళూనుకున్నట్లయితే, భారతదేశంలో ప్రజానాటక రంగం అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయి.' అని పేర్కొన్నారు.

భారతదేశ అణు విజ్ఞాన కార్యక్రమానికి మూలస్తంభాలలో ఒకరైన హోమీ జహంగీర్ భాభా ఇప్టా స్వర్ణోత్సవాల సందర్భంగా భారత ప్రభుత్వం ఒక స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసినప్పుడు హర్షం వ్యక్తం చేశారు. 'ఇప్టాకు లభించిన ప్రజా ఆదరణ పట్ల గర్వపడే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది' అని ఆయన అన్నారు. 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్'(ఇప్టా) అనే పేరును స్వయంగా డాక్టర్ భాభాయే సూచించడం విశేషం.

## అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పరితపించిన
# యోధుడు చంద్ర రాజేశ్వర్‌రావు



సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి
ఈ.టి.నరసింహ్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పరితపించిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వర్‌రావు అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ్మ కొనియాడారు. చంద్ర రాజేశ్వర్‌రావు 112వ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఆయన చిత్రపటానికి ఈ.టి.నరసింహ్మ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, బాల నరసింహ, సీనియర్ నాయకుడు కందిమల్ల ప్రతాపరెడ్డి ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీ రంగరాజన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీవుల్లా ఖాద్రి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రి శ్రీమాన్, ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మ, సురవరం కపిల్, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ్మ మాట్లాడుతూ 1946–51 మధ్య జరిగిన చరిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచిన చంద్ర రాజేశ్వర్‌రావు పేద రైతులకు భూములు పంచే ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 28 ఏళ్ల పాటు సేవలందించి పార్టీ బలోపేతానికి, జాతీయ స్థాయిలో వామపక్ష ఉద్యమాల విస్తరణకు కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, స్ఫూర్తితో నేటి ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కందిమల్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం సామ్యవాద సిద్ధాంతాలను భారత రాజకీయాల్లో ముందుకు తీసుకెళ్లిన మహానేత చంద్ర రాజేశ్వర్‌రావు అని కొనియాడారు. పేదల కోసం జీవితాంతం పోరాడిన ఆయన స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందరావు, దశరథ్ పాల్గొన్నారు.

# త్వరలో చైనా సందర్శిస్తా

ఉత్తమమైన పద్ధతులను తెలుసుకుంటా
'ది హిందూ హడిల్ కాంక్లేవ్'లో
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గుజరాత్ పెట్టుబడులను ఆకర్షించడం లేదు. బలవంతంగా గుజరాత్‌లో పెట్టుబడులు పెట్టేలా చేస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత 20 ఏళ్ల నుంచి ఒకే ఒక్క బ్రాండ్ అంబాసిడర్ అక్కడ పని చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంగా పోరాడతామని, కేంద్ర ప్రభుత్వ వివక్షపై పోరాడతామని, తెలంగాణలో పెట్టుబడులకు అనుమతులు ఇచ్చే విషయంలో వారు గుజరాత్ వెళ్లి పెట్టుబడులు పెట్టమంటున్నారని, దీనిని ఎదుర్కొంటున్నామన్నారు. పెట్టుబడుల సాధన విషయంలో పొరుగు రాష్ట్రాలతో స్నేహపూర్వక మ్యాచ్ ఆడతామన్నారు. ది హిందూ దినపత్రిక బెంగుళూరులో నిర్వహించిన 'ది హిందూ హడిల్ కాంక్లేవ్'లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో ది హిందూ డైరెక్టర్ ఎన్.రామ్ అడిగిన ప్రశ్నలకు సిఎం సమాధానాలిచ్చారు. 'అభివృద్ధిలో తెలంగాణ పొరుగు రాష్ట్రాలతో పోటీపడడం లేదు. తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతున్నది. ఎందుకు పొరుగు రాష్ట్రాలతో పోటీ పడాలి. మేం చైనా, జపాన్, సౌత్ కొరియా, జర్మనీతో పోటీపడుతున్నాం. మేం వాళ్లతో పోటీ పడతాం. నా నినాదం చైనా+1. నేను 15 ఏళ్ల క్రితమే చైనా వెళ్లాను. నేను ఎవరి దగ్గర నుంచి నేర్చుకోవడానికి ఇబ్బంది పడను. నేను సాగునీటి ప్రాజెక్టు దగ్గరకు వెళితే అసిస్టెంట్ ఇంజినీర్ దగ్గర నుంచి తెలుసుకోవడానికి మోహమాట పడను. ఎందుకంటే ఆయనకే అసలైన సమస్య తెలుసు. దానిని ఎలా పరిష్కరించాలో తెలుసు. త్వరలోనే నేను చైనా సందర్శిస్తా. నేను నేర్చుకుంటా. హార్వర్డ్‌లో పది రోజులు కోర్సు చేశాను. చైనాను సందర్శించి ఉత్తమమైన పద్ధతులను తెలుసుకుంటాను'' అని సిఎం వివరించారు.

**బ్యూరోక్రాట్లు తెలివైనవారు**

''నేను ప్రతి బ్యూరోక్రాట్ మైండ్సెట్‌ను అర్థం చేసుకోగలను. మిక్స్‌డ్ బ్యూరోక్రాట్లు తెలివైనవారు. ఏమి అడిగినా ఎస్ అంటారు. ఎందుకు ఎస్. ఏమిటి ఎస్ అనేది అర్థం చేసుకోవాలి. ఏదైనా పత్రికలో కథనం చూస్తే దాని పరిష్కారం తెలుసుకుంటాను. ప్రతి ఒక్కరి అభిప్రాయాలు తీసుకుంటా. వాటిని రాసుకుంటా. చివరకు నా అభిప్రాయం చెబుతా. ముందే నేను నా అభిప్రాయం చెబితే దానికి అనుగుణంగా వారు చెబుతారు. మమ్మల్ని సంతోషపెట్టేందుకు ప్రయత్నిస్తారు. నేను 2006 నుంచి 2023 వరకు 17 ఏళ్ల ప్రతిపక్షంలో ఉన్నాను. ఆ సమయంలో ఎంతో తెలుసుకున్నా. ప్రజా సమస్యపై పోరాడాను. అందుకే నన్ను తప్పుదోవ పట్టించలేరు. చిన్న రైతు, నిరక్షరాస్యులు సైతం తమ దగ్గర ఉన్న సమాచారంతో తన కామన్‌సెన్స్‌తో పరిష్కారం చూపుతారు. పరిపాలనలో కామన్‌సెన్స్ అతి ముఖ్యమైన అంశం. కామన్సెన్స్ ఉపయోగించి సమస్యను అర్థం చేసుకుంటే సగం సమస్య పరిష్కారమవుతుంది. మిగతాది తగిన నిర్ణయంతో పూర్తవుతుంది'' అని సిఎం చెప్పారు.

**పెద్దవాళ్లు జల వనరులను చెరబడుతున్నారు**

చెరువులు, నాలాలను పేదలు ఆక్రమించుకుంటే అర్థం చేసుకోగలమని, కానీ పెద్దవాళ్లు జల వనరులను చెరబడుతున్నారని, అందుకే హైడ్రాను ఏర్పాటు చేశామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సీనియర్ ఐపిఎస్ అధికారి హైడ్రాకు నేతృత్వం వహిస్తున్నారని, ఇప్పుడు తెలంగాణాలో ఎవరైనా జల వనరులను ఆక్రమించే ధైర్యం చేస్తున్నారేమో అడగండి అని సిఎం వ్యాఖ్యానించారు. ''హైడ్రా మోడల్ అందరికీ అవసరం అని నేను అనుకోను. ఎం6 మోడల్ అవసరం. మహా నగరాలైన ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూర్ ఆరు మహా నగరాలు. నగరాల్లో ఆక్రమణలకు సంబంధించి వాటి సొంత మోడల్‌ను అనుసరించాలి. పర్యావరణం, నీటి కొరత, ఫ్లాష్ ఫ్లడ్స్‌పై సొంత మోడళ్లను అనుసరించాలి'' అని సిఎం సూచించారు.

**రూ.2లక్షల కోట్ల అప్పులను పునర్ వ్యవవస్థీకరించే పనిలో ఉన్నాం**

గత పాలకులు 11, 11.50 శాతం వడ్డీ రేటుతో స్వల్ప కాలానికి గతంలో అప్పులు తెచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని 7 నుంచి 8 శాతం వడ్డీరేటుతో పునర్ వ్యవస్థీకరిస్తున్నామని, వాటిని దీర్ఘకాల రుణాలుగా మార్చుతున్నామని, రూ.2 లక్షల కోట్ల అప్పులను పునర్ వ్యవవస్థీకరించే పనిలో ఉన్నామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. జిఎస్‌టిలో ఉన్న లోపాలపై కేంద్ర, రాష్ట్రాలు దృష్టి పెట్టడం లేదని, అరవింద్ సుబ్రహ్మణ్యాన్ని జిఎస్‌టి సలహాదారుగా నియమించుకున్నామన్నారు. గత ఏనిమిదేళ్ల కాలంలో నెలకు రూ.3,500 కోట్లు మించి జిఎస్టి రాబడిలేదన్నారు. గత ఆరు నెలలుగా రూ.4 వేల కోట్లను దాటుతున్నామని, ఆరు నెలల్లోనే అదనంగా రూ.5 వేల కోట్లు అదనంగా వచ్చిందన్నారు. పన్నులు పెంచకుండా అవినీతిని,లీకేజీలను అరికట్టడంతో సాధ్యమైందని సిఎం చెప్పారు.

# అత్యంత పారదర్శకంగా నీట్

సి.ఎస్.రామకృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 21న జరగనున్న 'నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్' (నీట్)కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీట్ పరీక్ష ఏర్పాట్లు, ధాన్యం సేకరణ, సిఎం పర్యటనపైన హైదరాబాద్‌లోని సచివాలయంలో రామకృష్ణారావు శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 24 నగరాల్లోని 208 కేంద్రాల్లో 72,956 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, వీరికి రవాణ, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, భద్రత ఏర్పాట్లు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టియాన జోంగ్తును ఆదేశించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మాట్లాడుతూ ఈసారి నిర్వహించే నీట్ పరీక్షకు అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామన్నారు. పరీక్షా పత్రాల భద్రత కోసం తొలిసారిగా భారత వాయుసేన (ఐఎఎఫ్) సేవలను వినియోగిస్తున్నామని వెల్లడించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను, పుకార్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, కట్టడి చేయాలని పోలీసు అధికారులను రాష్ట్ర శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్ ఆదేశించారు.

**ధాన్యం సేకరణపై అప్రమత్తం...**

రానున్న రోజుల్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రామకృష్ణారావు ఆదేశించారు. ఇప్పటికే సేకరించిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి జిల్లాల్లో పర్యటించనున్న నేపథ్యంలో ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అవసరమైన భద్రత, రవాణ, ఇతర లాజిస్టిక్ ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి.ఆనంద్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ దాన కిషోర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, సెర్ప్ సిఇఒ దివ్య, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘా

టిజిఎండిసి
అధికారులతో మంత్రి
జి.వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కార్మిక, ఉపాధి, గనులు భూగర్భ శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. లారీల కదలికలను నిరంతరం పర్యవేక్షించే బలమైన నిఘా వ్యవస్థ ద్వారా అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇసు క ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడంతో పాటు అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో శనివారం తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టిజిఎండిసి) అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక లభ్యత, ఆదాయం, ఆదాయ వృద్ధికి ఉన్న అవకాశాలు, నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, వ్యవస్థలో తీసుకురావాల్సిన మెరుగుదలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. అన్ని కార్యకలాపాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. టిజిఎండిసి డైరెక్టర్ అనుదీప్ దురిశెట్టి శాఖ చేపడుతున్న ఆదాయ వృద్ధి చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం, అక్రమ మైనింగ్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి మంత్రికి వివరించారు. కొన్ని ప్రాంతాల్లో శాఖ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా ఆయన వివరించారు. అలాగే సాండ్ బజార్ల పనితీరు, శాఖ నిఘా వ్యవస్థ, సిబ్బంది అవసరాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఖనిజ వనరుల సమర్థ నిర్వహణ కోసం అమలు వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతో పాటు పరిపాలనా సామర్థ్యాన్ని పెంచాలని అధికారులకు సూచించారు.

## నీళ్లు రాకుండా అడ్డుకుంటున్న ప్రభుత్వాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎపి, కర్నాటక ప్రభుత్వాలు కలిసి జూరాలకు నీళ్లు రాకుండా అడ్డుకుంటున్నాయని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీన్‌కుమార్, మాజీ ఎంఎల్‌ఎ జైపాల్ యాదవ్‌తో కలిసి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు, రంగారెడ్డిలో 90 టిఎంసిలు ఉంటే 45 టిఎంసిలు చాలని సిఎం రేవంత్ రెడ్డి అంటున్నారన్నారు. ఎపి సిఎం చంద్రబాబు చెప్పినట్టు పరిపాలించేందుకు ప్రజలు రేవంత్ రెడ్డికి అధికారం ఇచ్చారా అని ప్రశ్నించారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులో 300 ఎకరాలు మాత్రమే భూ సేకరణ మిగిలిందన్నారు. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి సినిమాలు చూసి జిల్లాల పర్యటనకు వెళ్తున్నారన్నారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ 30 నెలల తర్వాత సిఎం రేవంత్ రెడ్డికి పాలమూరు గుర్తుకొచ్చిందన్నారు.

**మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్**

| NIT No & Date | పని వివరణ | అంచనా విలువ | ప్రారంభ తేదీ & సమయం | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 07/DB/EE-II/ Bowen-pally Circle/ MMC/2026-27, తేది: 05.06.2026 | ఎంఎంసి, బోయిన్‌పల్లి సర్కిల్-03 పరిధిలో ఉన్న నాలాల మరమ్మతులు మరియు నిర్వహణ, అదనపు క్యాచ్‌పిట్ల నిర్మాణం. (2 పనులు) | రూ.9.30 లక్షలు | 06.06.206 మ.2.00 గం.లకు | 09.06.2026 మ.2.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి.
DIPR R.O. No. : 3762-PP/CL/ADVT/2026-27, Date: 06-06-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్.
షార్ట్ టెండర్ నోటీసు నెం. 7/EE.Div.NO.28/GHMC/2026-27 తేది: 06.06.2026

| NIT NO. | పని వివరణ | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా & సెల్ నెం. |
|---|---|---|---|---|
| షార్ట్ టెండర్ నోటీసు నెం. 7/ EE.Div.NO. 28/GHMC/ 2026 - 27, తేది: 06.06.2026 | నిర్వహణ పనులు (02) నెం.లు | రూ.39.80 లక్షలు | ప్రారంభ తేది: 08.06.2026 మ.03.00 గం.ల నుండి, స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 15.06.2026 మ.03.00గం.ల వరకు. | శ్రీమతి ఆర్.ఇందిర బాయి సెల్ నెం. 9963025505 |

జతచేయబడినవి: పని వివరాల కాపీ
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్.28, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 3816-PP/CL/ADVT/2026-27, Date: 06-06-2026

## పంటల మార్పిడే తెలంగాణ వ్యవసాయానికి భవిష్యత్



వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే పంటల మార్పిడి అనివార్యమని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ బి.ఆర్.కె.భవన్‌లోని రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో వైవిధ్యీకరణపై కమిషన్ రూపొందించిన సమగ్ర నివేదికను కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి, విడుదల చేశారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ, కేరళ, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నివేదిక రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వరి, పత్తి సాగు పెరగడంతో సంప్రదాయ, ఉద్యాన, కూరగాయల పంటల సాగు గణనీయంగా తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధరలు కల్పించాలని నివేదికలో సూచించినట్లు చెప్పారు. కమిషన్ సభ్యుడు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయని హెచ్చరించారు. కందులు, జొన్నలు, పప్పుధాన్యాలు, కూరగాయల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశముందని పేర్కొన్నారు. రైతుకు లాభం చేకూర్చే విధానాలే వ్యవసాయ భవిష్యత్తును నిర్ణయిస్తాయని అన్నారు.

## జంతర్‌మంతర్ వద్ద నాయకులపై దాడిని ఖండించిన సిపిఐ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న యువజన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడిన ఆర్‌ఎస్‌ఎస్ గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువజన, విద్యార్థి సంఘాల నేతలపై దాడికి పాల్పడడం అత్యంత దుర్మార్గమైన అప్రజాస్వామిక చర్యని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగం, విద్యారంగ సమస్యలు, పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువజన, విద్యార్థి నాయకులపై దాడి జరగడం ఆందోళనకరమన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడే నినాదాలు చేస్తున్న ఉద్యమకారులపై దాడి చేయడం ఫాసిస్టు ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఘటనలో ఎఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి హరీష్ బాల, సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు గాయపడినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను హరించేందుకు, విద్యార్థియువజన ఉద్యమాలను అణచివేయడానికి ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. దాడికి బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితులకు పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, విద్య, ఉపాధి హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలు ఇలాంటి దాడులతో ఆగవని, మరింత బలంగా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## సుద్దాల హనుమంతుకు ముఖ్యమంత్రి నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ వైతాళికుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా కళాకారుడు సుద్దాల హనుమంతు జయంతి సందర్భంగా ఎ.రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తన కలంతో ప్రజల్లో చైతన్యం నింపి, తన గళంతో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సుద్దాల హనుమంతు అని కొనియాడారు. సమాజంలోని అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సుద్దాల హనుమంతు జీవితం ధైర్యం, నిబద్ధత, ప్రజాసేవ వంటి విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.




# విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర సర్కారు చెలగాటం

టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అలాగే ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే కేంద్ర ప్రభుత్వం ఎల్‌పిజి, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై అదనపు భారం మోపిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ యుజి 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయాల్సి రావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఖైరతాబాద్ డిసిసి ఆధ్వర్యంలో శనివారం లిబర్టీ సర్కిల్‌లో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నెలల తరబడి కష్టపడి పరీక్షలకు సిద్ధమైతే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృథా అయిందన్నారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష వ్యవహారంలో నష్టపోయిన విద్యార్థులు, వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
**ప్రజారోగ్యం మరియు మునిసిపల్ ఇంజనీరింగ్ శాఖ**
కొటేషన్స్

| క్ర.సం. | పని పేరు |
|---|---|
| 1 | నల్లగొండ మునిసిపాలిటీ: నల్లగొండ జిల్లా, శేషమ్మగూడెంలోని 17.16 MLD STP వద్ద కాలువ ఎస్కేప్ / రెగ్యులేటర్ గేట్ల నిర్వహణ కొరకు, సహాయక నిర్మాణం మరియు అవసరమైన అన్ని అనుబంధ పరికరాలతో కూడిన 1) 1400mm x 1200 mm, 2) 1200mm x 1200mm, 3) 1000mm x 500mm కాస్ట్ ఐరన్ స్క్రూ గేర్ రకం హోయిస్ట్ (మాన్యువల్‌గా పనిచేసేది) యొక్క డిజైన్, ఫ్యాబ్రికేషన్, సరఫరా, స్థాపన, టెస్టింగ్ మరియు కమిషనింగ్ పనుల కొరకు, అనుభవజ్ఞులైన తయారీదారులు / డీలర్లు / సరఫరాదారుల నుండి పై భాగాల కొరకు పోటీతో కూడిన సీల్డ్ కొటేషన్లను 7 రోజులలోపు ఈ క్రింది చిరునామాకు ఆహ్వానించడమైనది. ఈ దశలో ఎటువంటి EMD చెల్లించనవసరం లేదు. |

పేరు: కె. వెంకటేశ్వర్లు, బి.టెక్.,
చిరునామా: O/o ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (FAC), పబ్లిక్ హెల్త్ డివిజన్, ఎల్.ఎస్. గుట్ట, క్లాక్ టవర్ సమీపంలో, నల్లగొండ-508001.
మరిన్ని సందేహాల కొరకు, దయచేసి కార్యాలయ పని వేళల్లో నల్లగొండ, పబ్లిక్ హెల్త్ డివిజన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాన్ని సంప్రదించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ డివిజన్ నల్లగొండ.
DIPR R.O. No. : 3742-PP/CL/ADVT/2026-27, Date: 06-06-2026

**కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం,**
**జిల్లా : కామారెడ్డి**
Roc.No. E1/Quotation Add/MCK/1847/2026-27 Dated: 06.06.2026
కొటేషన్ ప్రకటన
కామారెడ్డి పురపాలకసంఘంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు స్థానిక కాంట్రాక్టర్లు, ఏజన్సీల నుండి సీల్డ్ కొటేషన్స్ (కవర్లలో దాచిపెట్టిన ఉదాహరణ పూర్వకంగా పేర్కొన్న ధరలు)కు ఆహ్వానం.
1. పారిశుద్ధ్యవాహనాలకు చిన్న చిన్న మరమ్మతులు నిర్వహించడం, బిగించిన టైర్లు, ట్యూబ్ పంక్చర్ బిల్లులు, సరఫరా, బట్వాడాతో పాటు ఇతర స్వచ్ఛ ఆటోలకు, జెసిబిలు, ట్రాక్టర్లు, ట్రాలీలు, వేటినైనా మట్టంగా చదును చేయగల భారీ యంత్రాలు, భారీ క్రేన్లకు మరమ్మతులు చేయడం.
2. నాలుగు చక్రాలున్న ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో / వ్యర్థాల సేకరణకు మూసిఉన్న కంటైనర్ బాడీలో నింపుకుని వెళ్ళగల ఎలక్ట్రిక్ వాహనం, బరువైన ఘన పదార్థాలను దిమ్మరించగల హైడ్రాలిక్ లార్, పూర్తిగా మోటారుతో పనిచేసే వాహనం లిథియం-ఐయాన్-బ్యాటరీ ప్యాక్, ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన ఆన్‌బోర్డ్ ఛార్జర్, డ్రైవర్ క్యాబిన్, లెడ్ లైటింగ్ వ్యవస్థ, రివర్స్‌హారన్, ప్రజలకు బహిరంగ ప్రకటనలు చేయడానికి ఉపయోగించే వ్యవస్థ, ఆర్‌టిఓ రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, నంబర్‌ప్లేట్, అన్ని ప్రామాణిక వస్తువులు, రవాణా, కమిషనింగ్, సమగ్ర హామీ మరియు ఒక ఏడాదిపాటు ఉచితంగా కార్యకలాపాలు చేయడం, నిర్వహణ (ఓ అండ్ ఎం), జిఎస్‌టి మినహాయింపులతో సంబంధిత పని సంపూర్ణంగా పూర్తిచేసి సరఫరా చేయాలి. సరఫరా పరిమాణం సంఖ్య 4.
3. నీటి నాణ్యతను పరీక్షించే రసాయనాలు, పరీక్షా పదార్థం, గ్లాస్‌వేర్, వినియోగ వస్తువులు, టెస్టింగ్ కిట్లు, లేబొరేటరీ పరికరాలు, ఐఎస్ 10500 ప్రామాణికతలకు అనుగుణంగా త్రాగునీటి శాంపిల్స్ పరీక్షించడానికి వివిధ భౌతిక, రసాయనిక, బాక్టీరియాలను పరికరాలు సరఫరా చేయాలి. లేబొరేటరీ రసాయనాలు, పరీక్షా పదార్థాలు, వినియోగ వస్తువులు, పరీక్షా పరికాల వారీగా విడివిడిగా సరఫరా దారులు ధరలను పేర్కొనాలి. పరిమాణం సంఖ్య రెండు.
4. 25.00హెచ్.పి త్రీ స్టేజ్, మూడు అంచెల సబ్‌మెర్సిబుల్ మోటారుసెట్ల సరఫరాచేసి అందజేయాలి. ఈ మోటారు సెట్లు స్టెయిన్‌లెస్ స్టీల్ పంపు బాడీతో బోర్‌వెల్ ఆపరేషన్స్‌కు అనుగుణంగా ఉండాలి. స్వచ్ఛమైన కాపర్ వైండింగ్‌తో ఉన్న సబ్‌మెర్సిబుల్ మోటారు, అత్యున్నతమైన సామర్థ్యంగల ఇంపెల్లర్స్, అందుకు అనుగుణంగా ఉండే స్టార్టర్ కనెక్షన్స్, డెలివరీ ఏర్పాట్లు, రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్, పూర్తయిన పనికి సంబంధించిన అన్ని అనుబంధ ఛార్జీలు, జిఎస్‌టి మినహాయించి.. తయారీదారు: సిఆర్‌ఐ.
5. పూర్తి చేసిన పనికోసం మూడు దశల 25 హెచ్‌పి సబ్‌మెర్సిబుల్ కంట్రోల్ ప్యానల్, జిఎస్‌టి మినహాయించి అన్ని యాక్సెసరీస్‌తో పూర్తిసెట్టును సరఫరా చేసి స్వాధీనం చేయాలి.
6. పూర్తిచేసిన పనికోసం ఎంఎస్ బేస్ ప్లేట్ మొదలైనవాటితో సహా 15 హెచ్‌పి త్రీ ఫేస్ ఇండక్షన్ మోటార్ పూర్తి సెట్ సరఫరా,స్వాధీనం చేయాలి. తయారీదారు: కిర్లోస్కర్.
7. పూర్తిచేసిన పనికోసం త్రీ ఫేజ్ 15 హెచ్‌పి ఇండక్షన్ మోటార్ కంట్రోల్ ప్యానెల్, పూర్తి సెట్‌ను జిఎస్‌టి మినహాయించి సరఫరా, స్వాధీనం చేయాలి.
8. బోర్‌వెల్ ఆపరేషన్స్‌కు అనువైన 15.00 హెచ్.పి. త్రీ స్టేజ్, త్రీ ఫేజ్, సబ్‌మెర్సిబుల్ మోటార్ సెట్ పూర్తి సెట్ సరఫరా చేయాలి, స్వాధీనం చేయాలి.దీనికి స్టెయిన్‌లెస్ స్టీల్ పంపు బోడీ, కాపర్ వైండింగ్ సబ్‌మెర్సిబుల్, ఇంపెల్లర్లు, అనువైన స్టార్టర్ కనెక్షన్లతోసహా డెలివరీ ఏర్పాట్లు ఉండాలి. రవాణా లోడింగ్, అన్‌లోడింగ్ మరియు ఇతర అన్ని అనుబంధ ఛార్జీలతోసహా పూర్తిచేసిన పనికోసం జిఎస్‌టిని మినహాయించి అన్నివిధాలుగా పూర్తి సెట్ సరఫరా చేయాలి. తయారీదారు: సిఆర్‌ఐ.
9. పూర్తిచేసిన పనికోసం త్రీ ఫేజ్ 15 హెచ్.పి సబ్‌మెర్సిబుల్ పంపు,కంట్రోల్ ప్యానెల్ మరియు అన్ని అనుబంధ పరికరాలతో పూర్తిసెట్‌ను జిఎస్‌టి మినహాయించి సరఫరా చేయాలి. స్వాధీనం చేయాలి.
10. 1.1 క్యూబిక్ మీటర్ లోతైన తవ్వేద యంత్రం (లోడర్ బకెట్), 0.26 క్యూబిక్ మీటర్ల లోతైన బ్యాక్‌హో బకెట్ యంత్రం, 49 హెచ్.పి యంత్రంతో పనిచేసే జెసిబి బ్యాక్‌హో లోడర్ మోడల్ 3డిఎక్స్ సేకరణ. దీనికి ఒక సంవత్సరం ఇండస్ట్రియల్ టైర్లు, మరియు రెండు సంవత్సరాలు వారంటీ, కట్టర్‌కట్ మొదలైనవి ఉండాలి. డీజిల్ పరిమాణం లేదు.

కొటేషన్ స్వీకరించే ప్రారంభ తేదీ : 08.06.2026
కొటేషన్ ముగింపు తేదీ : 11.06.2026
కొటేషన్ల స్వీకరణకు చివరి తేదీ : 11.06.2026 @ 4.00 పి.ఎం.

మరిన్ని వివరాలను పురపాలకసంఘం కార్యాలయంలో ఉన్న ఇంజనీరింగ్ విభాగం నుండి తెలుసుకోవచ్చును. మున్సిపల్ కార్యాలయం పనిదినాల సమయంలో సంప్రదించాలి. కాంటాక్ట్ ఫోన్ నంబర్లు : 9849907822 మరియు 9849907825.
సం/- కమిషనర్ మున్సిపల్ కౌన్సిల్ కామారెడ్డి
DIPR R.O. No. : 3794-PP/CL/ADVT/2026-27, Date: 06-06-2026

# బియ్యం ఎగుమతులకు తెలంగాణ కేంద్రంగా మారాలి

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలోనే అగ్రగామి వరి ధాన్యం ఉత్పత్తి రాష్ట్రంగా నిలిచిన తెలంగాణను బియ్యం ఎగుమతులు, ఆధునిక సాంకేతికతలు, విలువ ఆధారిత ఉత్పత్తుల రంగంలోనూ ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో2026లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, బియ్యం ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఎగుమతి ఆధారిత రైస్ మిల్లులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రపంచ బియ్యం మార్కెట్లలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు.రైస్ మిల్లింగ్ రంగంలో కార్మికుల కొరతను అధిగమించేందుకు యాంత్రీకరణ, ఆటోమేషన్‌పై దృష్టి పెట్టాలని మిల్లర్లకు సూచించారు. స్టీల్ సైలోలు, ఆధునిక గోదాములు, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ధాన్య నిల్వ, పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రైవేటు భాగస్వామ్య విధానంలో భారీ గోదాముల నిర్మాణానికి పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పారా బాయిలింగ్ యూనిట్లలో నీటి వినియోగాన్ని తగ్గించే, విద్యుత్‌ను ఆదా చేసే సాంకేతికతలను అవలంబించాలని సూచించారు. పోషక విలువలను కాపాడే ఆధునిక బియ్యం ప్రాసెసింగ్ విధానాలు వినియోగదారులకు మరింత ఆరోగ్యకరమైన ఆహారం అందించగలవని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఏటా సుమారు 300 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరుగుతోందని, దేశ యాసంగి వరి కొనుగోళ్లలో రాష్ట్ర వాటా దాదాపు 60 శాతమని తెలిపారు. ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతుల ఖాతాల్లో రూ.39 వేల కోట్లు జమ చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు రూ.96 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీ పథకం ద్వారా 3.2 కోట్ల మందికి లబ్ధి చేకూరుతోందని, ఇందుకోసం ఏటా రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు.రైతులు, మిల్లర్లు, సాంకేతిక నిపుణులు, విధాన రూపకర్తలు సమష్టిగా కృషి చేస్తే తెలంగాణ బియ్యం ఉత్పత్తి, సాంకేతికత, ఆవిష్కరణలు, ఎగుమతుల రంగాల్లో ప్రపంచస్థాయి కేంద్రంగా ఎదుగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ఎసిబికి చిక్కిన వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్

### మిర్యాలగూడ బస్టాండ్‌లో రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వక్ఫ్‌బోర్డ్ ఆధీనంలో ఉన్న స్థలం విషయంలో అనుకూలమైన రిపోర్ట్ రాసేందుకు లంచం అడిగిన వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌ను ఎసిబి అధికారులు శనివారం దాడులు చేసి పట్టుకున్నారు. తెలిసిన వివరాల ప్రకారం పెద్దవూరలోని మసీదుకు సంబంధించిన 996.33 గజాల స్థలంను గతంలో దాతలు మసీదు నిర్మాణం కోసం ఇచ్చారు. ప్రస్తుతం భూముల రేట్లు పెరగడంతో దాతల వారసులు తమ భూమి కోసం ప్రయత్నాలు సాగిస్తుండగా, దాతలు ఇచ్చిన భూమి వక్ఫ్‌బోర్డుకు లేదా మసీదుకు చెందాలని అన్యాక్రాంతం కావద్దు అని మసీదు నిర్వాహకుడు వక్ఫ్‌బోర్డుకు లేఖ రాశాడు. ఇందుకు సంబంధించిన విషయములో వక్ఫ్‌బోర్డ్ అధికారులు విచారణ చేస్తున్న క్రమంలో దాతల భూమి మసీదుకు అనుకూలంగా రిపోర్టు రాయాలి అంటే డబ్బులు ఇవ్వాలని వక్ఫ్‌బోర్డుకు ఇన్‌స్పెక్టర్ మహమూద్ డిమాండ్ చేయగా మసీదు నిర్వాహకుడు ఎసిబిని ఆశ్రయించాడు. పథకం ప్రకారం ఎసిబి డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ బస్టాండులో మెహమూద్‌కు పదివేల లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం మిర్యాలగూడలోని మందుల వారి కాలనీలో గల మెహమూద్ ఇంటిని సోదాలు నిర్వహించారు.

## పేదల పక్షాన పోరాడిన మహానేత చంద్ర

### ప్రజా ఉద్యమాలకు ఆయన జీవితం స్ఫూర్తి : ఎమ్మెల్సీ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పేదలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత, భారత కమ్యూనిస్టు ఉద్యమ దార్శనికుడు స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ సత్యం అన్నారు. చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, చంద్ర రాజేశ్వరరావు జీవితం పేదలు, రైతులు,కార్మికుల సంక్షేమం కోసం సాగిన నిరంతర పోరాటానికి ప్రతీకగా నిలిచిందన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి ఆయన అందించిన సేవలు అపారమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు,సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లోడంగి శ్రవణ్ కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి,బొల్గురి నర్సింహా,బంటు వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య టి.వెంకటేశ్వర్లు,తూము బుచ్చిరెడ్డి,పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిమిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ఘోర అగ్నిప్రమాదం



**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : మండలంలోని చిమిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పాఠశాల గదిలో మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ప్రమాదం జరిగిన సమయంలో పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పిందని, అందరూ ఊపిరి పీల్చుకున్నారని స్థానికులు తెలిపారు. పాఠశాల భవనం నుండి దట్టమైన పొగలు, మంటలు రావడం గమనించిన గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమా చారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాఠశాల గదుల్లో నిల్వ ఉంచిన నూతన పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల కీలక రికార్డులు, బెంచీలు, కుర్చీలు, కంప్యూటర్లు, ఇతర ఫర్నీచర్ సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతై బూడిదయ్యాయి. అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలియగానే గ్రామ ప్రజలు పాఠశాల వద్దకు చేరుకొని సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు.

## విద్యార్థుల నమోదు పెంచాలి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్** : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు(ఐఎఎస్) అన్నారు. శనివారం భువనగిరి మండలంలోని కేసారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. జూన్ 24 నుండి జూలై 25 వరకు జరిగే సర్ (ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ) సర్వేకు అందరు సహకరించాలని కోరారు. సేంద్రీయ వ్యవసాయం కలుగు ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో దినకర్, మండల విద్యాది కారి రంగరాజన్, మెడికల్ అధికారి యామిని, వ్యవసాయ అధికారి మల్లేష్, హౌసింగ్ అధికారి రామచందర్, గ్రామ సర్పంచు మనోహర పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ళ అరెస్ట్

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలోని బంకెట్ హాల్‌లో పేకాటడుతున్నారన్న సమాచారంతో చండూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.శ్రీరాములు తమ సిబ్బందితో కలిసి బంకెట్ హాల్‌పై దాడిచేసి రూమ్ నెంబర్1లో పేకాట ఆడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. బుషిపాక సుధాకర్ చండూరు, జక్కలి శ్రావన్ బంగారిగడ్డ , మోగుదాల ప్రవీన్ చండూరు , కారింగు వెంకన్న చండూరు , బొమ్మగోని ప్రశాంత్ చండూరు, సంగెపు సతీష్ చండూరు, నల్పరాజు మహేష్ బంగారిగడ్డలు పేకాట ఆడుతుండగా పట్టుబడి చేసి వారి నుండి రూ.8,300 , ఏడు సెల్ ఫోన్లు ,ఒక బైక్ ,పేక ముక్కలు స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదు చేసి విచారణచేయనైనదని స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీరాములు తెలిపారు.

# పిల్లల భవిష్యత్తే సమాజానికి ముఖ్యం

### టిజిపిఎ డైరెక్టర్ అభిలాషా బిష్త్



**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్ ):** పిల్లల హక్కులు, వారి భవిష్యత్ నిర్మాణం సమాజానికి అత్యంత ముఖ్యమని, పిల్లల రక్షణ కుటుంబం నుంచే ప్రారంభమవుతుందని టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్ పేర్కొన్నారు. శనివారం కనగల్ మండలం చెర్లగౌరారం గ్రామంలో జిల్లా పోలీస్ శాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆదేశానుసారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన బాల పంచాయతీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాటీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్ పాల్గొని మాట్లాడుతూ పిల్లల్లో నాయకత్వ లక్షణాలు,విమర్శనాత్మక ఆలోచన,సామాజిక బాధ్యత,సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించాలన్నారు.గ్రామస్థాయి నుంచి పిల్లలకు ప్రజాస్వామ్య అవగాహన కల్పించడం, వారి అభిప్రాయాలను వినడం, గ్రామాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలన్నారు.ప్రతి తల్లి తండ్రి పిల్లలకు సమయం కేటాయిస్తూ వారి ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచే పిల్లలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురాగలమన్నారు. విద్యతో పాటు పిల్లల్లో సామాజిక అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ బాలల భద్రత, విద్య, మానసిక అభివృద్ధి కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి రమేష్, నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, ఏంపిడిఓ వేద రక్షిత, సీఐలు ఆది రెడ్డి, రాము,కరుణాకర్,ఎస్‌ఐ అంజలి,రాజీవ్ రెడ్డి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి,డీఈఓ సుశీందర్ రావు, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణయ్య,చెర్లగౌరారం సర్పంచ్, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తప్పతాగి రాంగ్‌రూట్‌లో కారు ర్యాష్ డ్రైవింగ్

### ఎదురుగా బైక్‌పై వస్తున్న యువకుడిని ఢీ...
### కుడికాలు విరిగి గాలిలోకి ఎగిరిన వైనం...
### చావు బతుకుల్లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు





**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త కుమారుడు తప్పతాగి రాంగ్‌రూట్‌లో కారు ర్యాష్ డ్రైవింగ్ చేసి ఎదురుగా బైక్‌పై వస్తున్న యువకుడిని ఢీకొట్టడంతో అతడి కుడికాలు విరిగి గాలిలోకి ఎగిరిపడిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన అక్బర్‌పాషా అనే యువకుడు శుక్రవారం రాత్రి అందాజ 10 గంటల సమయంలో టిఎస్07హెచ్‌పి 3463 నంబర్ గల బైక్‌పై వస్తుండగా సూర్యాపేట మండలంలోని గాంధీనగర్ సమీపంలో టిఎస్29 డి 0555 నంబర్ గల ఫోర్డ్ కారులో ప్రయాణిస్తున్న ప్రముఖ పారిశ్రామిక వేత్త కుమారుడు తప్పతాగి రాంగ్‌రూట్‌లో ర్యాష్ డ్రైవింగ్ చేసి బలంగా ఢీకొట్టాడు. దీంతో అతడి కుడికాలు తొడ వరకు విరిగి గాలిలోకి ఎగిరి కింద పడింది. అతడు కారును ఆపకుండా వెళ్ళిపోవడంతో రహదారిపై నుండి వెళ్తున్న కొంతమంది ప్రయాణికులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో చావుబతుకుల్లో మధ్య ఉన్న ఆ యువకుడిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన అక్బర్‌పాషా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబానికి ఆధారమైన కుమారుడు ప్రమాదానికి గురికావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కుమారుడు కావడంతో అతడికి ఉన్న రాజకీయ పలుకుబడితో కేసును నీరుకార్చేందుకే తీవ్రంగా ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నపాటి రోడ్డు ప్రమాదానికి హంగామా చేసే పోలీసులు కూడా దీనిని బయటకు పొక్కకుండా తగు జాగ్రత్త పడ్డారు. వారు బయటపడకుండా ఎంత ప్రయత్నించినా దాగక పోవడం సోషల్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వార్తా కథనాలు పెద్దఎత్తున రావడంతో పోలీసుల తీరుపట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నవాడికి ఒక న్యాయం లేనివాడికి మరో న్యాయమా అంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో చేసేది ఏమిలేక అతడి కారును తీసుకువచ్చి పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. ఈ ప్రమాదం చేసిన వారిపై కేసు నమోదు చేశారా లేదా అన్న విషయం తెలుసుకునేందుకు మీడియా ప్రతినిధులు రూరల్ పోలీసులను అడిగినా వివరాలను బయటకు వెల్లడించని పరిస్థితి.

# ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గౌరవం

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటి రాష్ట్రస్థాయిలో విశేష గౌరవాన్ని దక్కించుకుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని 16వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా ఎస్‌పి కె. నరసింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతి, పారిశుద్ధ్యం, ఓటరు నమోదు తదితర అంశాలపై ఆయన ప్రజలతో మాట్లాడుతూ సూర్యాపేటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటిగా మార్చేందుకు వినూత్న ప్రయోగాలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుండి ఇటుకలను తయారు చేస్తూ దీనిని నిరంతరం కొనసాగే ఒక స్థిరమైన వ్యవస్థగా మార్చడం శుభపరిణామమని కొనియాడారు. ప్రజల భాగస్వామ్యం, శానిటేషన్ సిబ్బంది కష్టం వల్లే ఈ విజయం సాధ్యమైందని అభినందించారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం దేశంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. ఈ నిబంధనల ప్రకారం తడిచెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, వీటితోపాటు శానటరి వేస్ట్ కూడా వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా విభజించాలనే రూల్స్ వచ్చాయన్నారు. ఈ నియమాలను పక్కాగా అమలు చేయడంలో సూర్యాపేట మున్సిపాలిటి రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని, భవిష్యత్తులో పారిశుద్ధ్య విభాగంలో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వార్డుల్లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో ఇబ్బందిగా మారిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యపై ఆయన తీవ్రంగా స్పందించారు. సంబంధిత ఏజెన్సీ అధికారులను పిలిపించి, పనులు త్వరగా పూర్తి చేయాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు వివరించారు. ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అత్యంత అవశ్యకమైన విద్య, వైద్యం, శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అధికారులు నేరుగా గ్రామాలు, మండలాలు, మున్సి పాలిటిల్లోని ప్రజల వద్దకే తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లేందుకు యంత్రాంగం శ్రమిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, డిఎస్‌పి ప్రసన్నకుమార్, తహశీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, వార్డు కౌన్సిలర్ షేక్ జహీర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, డాక్టర్ అమూల్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రోగుల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్

### మందుల లభ్యత, వైద్య సేవలపై ఆరా..
### జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నల్లగొండ** : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ చేశారు.శనివారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు.మొదట సూపరింటెండెంట్ కార్యాలయంలో హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్,అనంతరం వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు.అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యం సక్రమంగా అందుతోందా,అవసరమైన మందులు అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని మందులు అందుబాటులో లేవని రోగులు చెప్పడంతో వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి సరఫరా పరిస్థితిని తెలుసుకుని,అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆసుపత్రిలో త్వరలో ప్రారంభించనున్న డిఅడిక్షన్ సెంటర్‌ను కూడా పరిశీలించిన కలెక్టర్, మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు.అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతూప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వఆసుపత్రుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నేత నరసింహారావు,డాక్టర్ శ్రీకాంత్,ఇతర వైద్యులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వ్యాపారస్తులకు అండగా ఉంటా

### ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : వ్యాపారస్తులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాదితో కలిసి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాల విషయంలో, అసోసియేషన్‌ల ఎన్నికల విషయంలో తాను ఎప్పుడూ జోక్యం చేసుకోనన్నారు. వివిధ సంఘాలకు ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల ఇష్టప్రకారం ఓటు వేసి గెలిపించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం గెలుస్తుందన్నారు. పట్టణంలో ఎవరైనా వ్యాపారస్తులను బెదిరిస్తే తాను సహించబోనని అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తానన్నారు. తమకు గతంలో కేటాయించిన స్థలం గురించి ఆర్యవైశ్య సంఘం నాయకులు అడిగినప్పుడు గతంలో మంత్రిగా పనిచేసిన జగదీష్‌రెడ్డి అనేక కుల సంఘాలకు స్థలాలు ఇస్తున్నట్లు శంకుస్థాపన చేశారని, కానీ అవేవీ ప్రభుత్వ రికార్డులలో నమోదు కాలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ ఉప్పల సత్యనారాయణ, నాయకులు రాచకొండ శ్రీనివాస్, బిక్కుమళ్ల కృష్ణ, జూలకంటి నాగరాజు, సుమన్ వెంకన్న, మిట్టపల్లి రమేష్, బోనగిరి కృష్ణ, దోగుపర్తి ప్రవీణ్, కుంచపర్తి రాజశేఖర్, సోమ ప్రవీణ్, రాచర్ల సత్యం, బెలిదె శ్రీనాథ్ పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ సమావేశం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేటలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం శనివారం నిర్వహించబడింది. ఈ సమావేశం సీనియర్ సివిల్ జడ్జికమ్‌చైర్మన్ మండల న్యాయ సేవల కమిటీ జి.సబిత అధ్యక్షతన జరిగింది. రాబోయే 20 జూన్ 2026న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేయుటకు అవసరమైన చర్యలు, రాజీ ద్వారా పరిష్కరించదగిన కేసులను గుర్తించడం, సంబంధిత పక్షాలకు అవగాహన కల్పించడం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందవచ్చని, సంబంధిత అధికారులు , పోలీసు శాఖ సిబ్బంది పూర్తి సహకారం అందించాలని సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రత్నకుమారి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.సత్తయ్య, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, రామన్నపేట సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు మరియు అడ్డగూడూరు సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# కట్టుకున్నోడిని కాదని... ప్రియుడిపై మోజు..!

### చివరికి ప్రియుడి చేతిలోనే ప్రియురాలు హతం
### మహిళ హత్య కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసులు...



**ప్రజాపక్షం/హాలియా:** మూడు ముళ్ళు వేసి...ఏడడుగులు నడిచి చివరి శ్వాస వరకు తోడునీడగా నిలుస్తానని బాస చేసిన భర్తకు తోడుగా ఉండాల్సిన భార్య... వేరొకరితో అక్రమ సంబంధం మోజులో పడి చివరికి అతని చేతిలోనే ప్రాంతం కానీ ప్రాంతంలో హతమవడం సంచలనం కలిగించిన సంఘటనను హాలియా సర్కిల్ పోలీసులు ఎంతో చాకచక్యంగా ఛేదించి హంతకున్ని పట్టుకున్నారు. సంఘటనకు సంబంధించిన వివరాలు మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు శనివారం హాలియా పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించి హత్యకు సంబంధించిన సమాచారం తెలిపారు. ఈనెల రెండవ తేదీన త్రిపురారం గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం కుళ్ళిపోయిన స్థితిలో లభ్యమైనట్లు చెప్పారు.ఈసంఘటనపై త్రిపురారం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయినట్లు డిఎస్‌పి వివరించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు హత్యకు సంబంధించిన వివరాలు సేకరించేందుకు హాలియా సీఐ సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో హాలియా సర్కిల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజులు కాల్ డేటా సమాచారం సేకరించారు. పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసుగా పరిశీలనలో ఉన్న ఈ మహిళ మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలానికి చెందిన తిరుపతమ్మగా గుర్తించారు. హత్యకు గురైన తిరుపతమ్మ గతంలో ఏ ఏ ప్రాంతంలో నివసించిందో వివరాలు సేకరించినట్లు తెలిపారు. మృతురాలు తిరుపతమ్మ గొర్రెలు మేపటం కోసం దాదాపు 5 సంవత్సరాల క్రితం ఆంధ్ర ప్రాంతానికి వెళ్లగా అక్కడ నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం పెద్దజత్రం గ్రామానికి చెందిన బోయకూలూరు లింగప్ప (26)తో ఏర్పడిన పరిచయం అక్రమ సంబంధం గా మారిందని చెప్పారు. వీరి అక్రమ సంబంధం పై అనుమానం రావడంతో మృతురాలు తన భర్తతో కలిసి వారి స్వగ్రామానికి వెళ్లిపోయారు. కానీ వీడు పైమోజుతో భర్తతో కలిసి ఉండటం ఇష్టంలేని తిరుపతమ్మ కొద్దిరోజుల తర్వాత ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో ఆమె భర్త కూర్మప్ప దేవరకద్ర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయమై విచారణ చేపట్టిన పోలీసులు తిరుపతమ్మ లింగప్పతో కలిసి ఉండడాన్ని గుర్తించి ఆమెను తీసుకువచ్చి ఆమె భర్త కూర్మప్పకు అప్పగించినట్లు తెలిపారు. ఇదే విషయమై కూర్మప్ప తన భార్యను అక్రమ సంబంధం పై పలుమార్లు హెచ్చరించినట్లు చెప్పారు. కానీ తిరుపతమ్మ ప్రియుడు పై ఉన్న మోజుతో దాదాపు 24 రోజుల క్రితం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో భర్త కూ ర్మప్ప ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదని చెప్పారు. తిరుపతమ్మ అప్పటినుండి లింగప్పతో దుర్గి దగ్గర గల ఒక గ్రామంలో సహజీవనం చేస్తున్నట్లు తెలిసిందని వివరించారు. ఈ సమయంలోనే లింగప్పకు మరో మహిళతో వివాహం కావడంతో తిరుపతమ్మకు లింగప్పకు నిత్యం గొడవలు జరుగుతున్నట్లు చెప్పారు. దీంతో లింగప్ప ఆమెను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం వేసినట్లు తెలిపారు.దీనిలో భాగంగానే గత నెల 27వ తేదీన లింగప్ప మాచర్ల వెళ్లి తిరుపతమ్మ తీసుకొచ్చి కొండమల్లేపల్లి, దేవరకొండ, మిర్యాలగూడ ప్రాంతాలలో తిరిగి చివరిగా గత నెల 29వ తేదీన త్రిపురారం గ్రామానికి తీసుకొచ్చి అక్కడ సబ్ స్టేషన్ వెనకవైపు గల ఒక భావి వద్దకు తీసుకెళ్లి అక్కడ తిరుపతమ్మను మాటల్లోకి దించి ఆమె రెండు చేతులను వెనక్కి ఆమె చున్ని తో కట్టేసి ఆమె మెడకు చీరతో ఉరివేసి ఆమెపై ఉన్న చీర చివరి భాగానికి పెద్ద బండరాయి కట్టి పక్కనే ఉన్న బావిలోకి పడేసి ఆమెను హతమార్చి అక్కడి నుండి పారిపోయినట్లు చెప్పారు. ఈ విషయమై పోలీసులు ముమ్మరంగా విచారణ చేస్తుండగా పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు లింగప్ప స్వగ్రామం నుండి గతంలో మృతురాలితో కలిసి నివసించిన గండిగనుముల ప్రాంతానికి వెళ్తుండగా శనివారం ఉదయం 6 గంటల సమయంలో త్రిపురారం ఎస్ఐ నరేష్ పెద్దవూర జంక్షన్ వద్ద అతనిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.ఇదే విషయమై అతనిని విచారించగా తిరుపతమ్మను హతమార్చిన తీరును వివరించినట్లు చెప్పారు. హత్య జరిగిన 24 గంటల వ్యవధిలోనే మృతురాలు వివరాలు సేకరించడంతోపాటు నిందితుడు బోయ కుల్లూరు లింగప్ప అరెస్టు చేయడం అభినందనీయమని డిఎస్‌పి రాజశేఖర్ రాజు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో హాలి యా సీఐ సతీష్ రెడ్డి హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్, త్రిపురారం ఎస్ఐ నరేష్, నిడమనూరు ఎస్ఐ విజయ్ కుమార్ లను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అభినందించినట్లు తెలిపారు. ఈసందర్భంగా డిఎస్‌పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ ఒంటరిగా నివసించే మహిళలు ము ఖ్యంగా పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగతంగా కలిసిన సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 112కు కాల్ చేసి సహాయం పొందవచ్చని ఆయన చెప్పారు.



## ప్రభుత్వ లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

**ప్రజాపక్షం/వంగూరు :** పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రాజు అంత్యక్రియలు శనివారం చెందిన స్వగ్రామమైన ఉల్పరలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం ముఖ్య మంత్రి సభకు బందోబస్తు వెళ్లి ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న గా ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామ సమీపంలో పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ పాటిల్ ఆదేశాల మేరకు నిర్వహించిన అంత్యక్రియాల్లో అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొని రాజు పార్థివ అధ్యాయానికి పూలమాల వేసిన నివాళులు అర్పించారు. అనంతరం పోలీస్ శాఖ తరపున రూ.30 వేలు ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ రాజు కుటుంబానికి పోలీస్ శాఖ తరపున అన్ని విధాల ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. అంత్యక్రియలు ఉప్పు నుంతల ఎస్సై పుట్ట మహేష్, ఆర్ఐ జగన్, ఏ.ఆర్ఐలు. ప్రశాంత్, గౌస్, పాషా, శివాజీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పిఎంశ్రీ విద్య కేంద్రాలను వెంటనే రద్దు చేయాలి



**ప్రజాపక్షం/కృష్ణ :** ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్‌వాడీలకు అప్పజెప్పాలని, వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటీయు కృష్ణ మండలం నాయకురాలు మల్లమ్మ, సిఆర్ గోవింద్ రాజ్ (సిఐటియు ) జిల్లా అధ్యక్షులు గోవింద్‌రాజ్ నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా అంగన్‌వాడీల కేంద్రాలకు ఎసరుపెట్టే కార్యక్రమానికి పూనుకున్నాదని విమర్శించారు. అందులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లను, పిఎం శ్రీవిద్యను ప్రవేశపెడుతున్నారని అన్నారు. అంగన్వాడీలకు నష్టం కలిగించే ప్రీ ప్రైమరీ స్కూల్ పీఎం శ్రీవిద్యను గ్రామాలలో అమలు చెయ్యమని వాటిని అంగన్వాడీలకు అప్పజెప్పాలని అంగన్వాడీ టీచర్లకు హెల్పర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోల్ పెట్టిన విధంగా రూ.18 వేలు వేతనాలు ఇవ్వాలని హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లమ్మ,రాగ సుధా, లక్ష్మీ, లీలావతి, మహేశ్వరి పి చంద్ర కళ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో గ్రామసభ



**ప్రజాపక్షం/వెల్దండ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి, రాచూర్, కేస్లీతండా, మర్రిగుంటతండా, చౌదర్‌పల్లి, రాఘాయిపల్లి, పల్గుతండా, శంకర్‌కొండ తండా గ్రామాల్లో ఎంపీడీఓ కృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్నా అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి భవిష్యత్తులో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పథకాల గురించి అధికారులు ప్రజలకు వివరించి గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. ఆ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు మూడవత్ శారద హరికిషన్, గున్నెల శ్రీనివాస్, శ్రీనునాయక్, భాగ్యమ్మపుల్‌సింగ్, సుంకిరెడ్డి కృష్ణరెడ్డి, సామ వెంకటయ్య,సభవట్ రమేష్‌నాయక్, ఇస్లావత్ రవీందర్‌నాయక్, ఆర్ అండ్ బీ ఏఈ సురేందర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ పల్లవి, ఎంఈఓ చంద్రుడు, ఏపీఓ లక్ష్మణ్‌నాయక్, ఏపీఎం ఈశ్వర్‌జీలతో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పి. నరసింహ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్ నివాసంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని మాజీ మంత్రివర్యులు డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ లక్ష్మారెడ్డి, మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యుడు మన్యం శ్రీనివాస రెడ్డి, షాద్‌నగర్ మాజీ శాసనసభ్యులు అంజయ్య యాదవ్, దేవరకద్ర మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ రెండు తదితరులు వారిని శాలువాతో సన్మానించి స్వీట్స్ తినపెట్టి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిని ఆశీర్వదించడం జరిగింది.

## అదనపు ఎస్సీ హాస్టళ్లను మంజూరు చేయాలి

కొంగళి శ్రీకాంత్ డిమాండ్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్నత చదువుల చదువుతున్న ఎస్సీ (షెడ్యూల్డ్ కులాల) విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలను తక్షణమే మంజూరు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అడ్వకేట్ డాక్టర్ కొంగళి శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిని కలిసి కార్యాలయంలో ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొంగళి శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్య హబ్‌గా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం ప్రస్తుతం 14 ప్రభుత్వ కళాశాలలతో పాటు జడ్చర్ల, భూత్‌పూర్ పరిధిలోని విద్యసంస్థలతో కలిపి ఒక పెద్ద విద్య హబ్‌గా అవతరించింది. గవర్నమెంట్ కళాశాల ల్లోనే దాదాపు 10 వేల మంది విద్యార్థులు చదువుతుండగా, ప్రైవేట్ కళాశాలల్లో మరో 10 వేల మందికి పైగా ఉన్నారని తెలిపారు. వీరిలో అత్యధిక శాతం మంది గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన నిరుపేద ఎస్సీ విద్యార్థులే ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు శ్రీనివాస్, శివ, సురేష్, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులు.. ప్రతిభకు నిలయాలు

జిల్లా కలెక్టర్ ప్రియాంక



**ప్రజాపక్షం/మక్తల్ :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రభుత్వ బడిబాట భవితకు బంగారు బాట పోస్టర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆవిష్కరణ ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షులు నరసింహ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడులు నాణ్యతను కిందిస్థాయిలో అందరికీ అవగాహన కల్పించి, ప్రభుత్వ బడుల్లో నూతన ప్రవేశాలను పెంచాలని తెలియజేశారు. విద్యారంగ అభివృద్ధి, ప్రభుత్వ బడుల బలోపేతం, విద్యార్థుల ప్రతిభ ప్రోత్సాహం లక్ష్యంగా రూపొందించిన బడిబాట పోస్టర్ ఎంతో అభినందనీయమని రూపొందించిన బడిబాట పోస్టర్ ఎంతో అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన, ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ టీవీ తదితరులు, ఇంగ్లీష్ మీడియం విద్యా విస్తరణ, నో బ్యాగ్ డే వంటి కార్యక్రమాల అమలుతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగవుతాయని ఆమె పేర్కొన్నారు. తపస్ అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి ఆడిట్ కమిటీ కన్వీనర్ గుంపు బాలరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో ప్రవేశాలు పెంచడం, ప్రభుత్వ బడులు పటిష్టత కోసం కృషి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్, జిల్లా నాయకులు సీతరాములు తిరుపతయ్య శ్రీనాథ్ మహిళా విభాగం నర్మద, సౌభాగ్య లక్ష్మీ ,వెంకటమ్మ, కృష్ణవేణి , మండల నాయకులు చిన్న నరసింహులు, వెంకటేష్, వాజ్పాయ్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్లలో ఉన్న ప్రముఖ సుఖదా హాస్పిటల్స్ లో అవగాహన సదస్సు ఏర్పాట చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.గౌతమి, మాట్లాడుతూ 6 నెలల వయస్సు తర్వాత శిశువు ఎదుగుదల, పోషక అవసరాల కోసం తల్లి పాలతో పాటు ఇచ్చే అదనపు ఆహారాన్ని పూరక ఆహారం అంటారు. అని చెబుతు చిన్న పిల్లలకు ఏ విధమైన ఆహారాన్ని ఇవ్వాలి అనే దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల చుట్టపక్కల ఉన్న వివిధ గ్రామాల తల్లులు హాజరు అయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారి పిల్లల ఆహారం పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పూర్తిగా అవగాహన కల్పించిన డా.గౌతమి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డా.విజయలక్ష్మీ డిజిఒ, డా.సంకీర్తన డిజిఒ, డా.గౌతమి పీడియాట్రిషన్, డా.సూర్య ఎమ్‌డి జనరల్ ఫిజిషియన్ పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో వివేక్ హస్పిటల్ అండ్ ఫర్టిలిటీ సెంటర్ సహకారంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆవరణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మహ్మద్ అన్వర్ పాషా, ఉప సర్పంచ్ జోగు రాములమ్మ లింగమయ్యలు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆస్పత్రి డాక్టర్ పాండు రంగ గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులనందించారు. అనంతరం గ్రామ సర్పంచ్ మహ్మద్ అన్వర్ పాషా మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు శేఖర్, లాజర్, దేవదానం, జోగు రమేష్‌లతో ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలో శనివారం 4,5,6,7వ వార్డులకు సంబంధించిన వార్డు సభలు కొత్తకోటలోని దండు గడ్డ ప్రాథమిక పాఠశాల నందు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఏసీఎల్బీ కీమ్యా నాయక్ మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులు ఎన్ఎఫ్‌బీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మాదక ద్రవ్యాల నిర్మూలన, నషా ముక్త్ భారత్ కార్యక్రమం, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పోతులపల్లి అరుణ శ్రీనివాస్ మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అదేవిధంగా ప్రీ ప్రైమరీ విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలలోని ప్రీ ప్రైమరీ తరగతుల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ వార్డు సభలలో మురుగు కాలువల పూడికతీత, శుభ్రత పనులు, నీటి నిల్వలు, నీరు నిలిచిపోయే ప్రాంతాల నివారణ చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, వనమహోత్సవం కార్యక్రమం కింద చేపట్టనున్న మొక్కల నాటకం, వార్డుల అభివృద్ధికి సంబంధించిన ఇతర స్థానిక సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పల్లెపగు ప్రశాంత్, మదనపురం మార్కెట్ చైర్మన్ మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లవి కృష్ణారెడ్డి, జే.అఖిల, సుభాష్, తిరుపతయ్య, మంజుల రామకృష్ణ, గాయత్రి, సత్యం సాగర్, పి.రవీందర్ రెడ్డి, నభి మాస్టర్, మురళి యాదవ్, భీమ చంద్రకాంత్, సంజీవుడు సుధా, రామ్మోహన్ రెడ్డి, అయ్యన్న, మేస్త్రి శ్రీనివాసులు, పెంటన్న యాదవ్, చీర్లా యాదయ్య సాగర్, సాయిలు మేస్త్రి, నంద వెంకటేష్ రాసాల వెంకటేష్, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ, విద్యాశాఖ, విద్యుత్‌శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ శాఖ, ఎక్సైజ్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన



**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం అమరవాయి గ్రామ సభకు మహిళా శిశు సంక్షేమ శాఖ వారి జిల్లా బాలల పరిరక్షణ విభాగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ఎమ్మార్వో సాహెబ్, జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సాహెబ్ మాట్లాడుతూ అక్కడక్కడా బాలికలపై జరుగుతున్న అన్యాయపు దాడుల గురించి లైంగిక వేధింపులు నిరోధక చట్టం గురించి తెలియజేస్తూ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ చట్టం రూపొందించారని, ఈ చట్టంలో బాలబాలికలకు సమానమైన రక్షణ లభిస్తుంది. ఇటీవల కాలంలో ప్రతి చోట ఎదురవుతున్న సమస్య లైంగిక వేధింపులు అదేవిధంగా చిన్న వయసులోనే పెళ్లిలు చేయడం చట్ట రీత్యా నేరం అని చెప్పారు. అయితే ఇలా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే గ్రామంలో ఉండే బాలల పరిరక్షణ కమిటీకి లేదా 1098, 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సామాజిక మద్యమం వల్ల పిల్లలు చెడు అలవాట్లకు లోనై అవకాశం ఉంది. కాబట్టి బాలల అందరూ కూడా కేవలం మంచి విషయాల కోసం మాత్రమే ఫోన్స్ వాడాలని ఎమ్మార్వో సాహెబ్, జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం, శివ ఆ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ అధికారి ఎత్తం శివ మండల రెవిన్యూ అధికారి ఎమ్మార్వో సాహెబ్, ఆర్ ఐ మధు గ్రామ సర్పంచ్ పి.హుసేన్ ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి నాగరాజు అంగన్వాడీ టీచర్స్ పద్మావతి, సుజాత ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## రెండు కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థలాల పరిశీలన

**ప్రజాపక్షం/మాగనూర్ :** మండంలోని అడవి సత్యవార్, కొత్తపల్లి గ్రామాల ప్రజల దశాబ్దాల కల నెరవేరే దిశగా అడుగులు పడ్డాయి. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు రెండు గ్రామాల్లో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థలాలను అధికారులు, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఎడి విజయ భాస్కర్, మాగనూరు ఏసీ గంగాధర్ అధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది అడవి సత్యవార్ సర్వే నెం.105, కొత్తపల్లి సర్వే నెం. 247 స్థలాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. స్థల అనుకూలత, ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం, లైన్ విస్తరణ అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, నాయకులు శివరామ్ రెడ్డి, నరసింహ్ రెడ్డి, కొత్తపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకలు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సబ్స్టేషన్లు మంజూరు చేసినందుకు మంత్రి వాకిటి శ్రీహరికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త సబ్‌స్టేషన్లతో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందడంతో పాటు, లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బిఆర్ఎస్ పాదయాత్ర ప్రకటనతో కదిలిన ప్రభుత్వం



ప్రాజెక్టులపై సరైన అవగాహన లేని ముఖ్యమంత్రి, మంత్రులు : మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జిల్లా కేంద్రం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రులు డా.సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్, మాజీ ఎంపీ మన్నే శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు వాల్యానాయక్, ఇంతియాజ్ విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మేము పాదయాత్ర అనౌన్స్ చేసిన తరువాత ప్రభుత్వంలో చలనం వచ్చింది. రెండున్నర ఏండ్లు ప్రభుత్వానికి టైమ్ ఇచ్చామని అన్నారు. పాదయాత్ర ప్రకటనతో మంత్రులు, ముఖ్యమంత్రి ప్రాజెక్టును విజిట్ చేశారు. ప్రాజెక్టు పూర్తిపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు. నార్లపూర్ నుండి ఉదండాపూర్ వరకు సంవత్సరంలోపు పూర్తి చేస్తామని అన్నారు. మా ప్రభుత్వం ఉంటే ఆరు నెలల్లో కరివేన వరకు నీళ్లు తీసుకువచ్చే వాళ్లం. అన్ని పనులు చేసాక మిగిలిన పనులు చేయడానికే ఇంకో ఏడాది అంటున్నారు. పాలమూరు ప్రాజెక్టుకు 27000 వేల ఎకరాలు భూ సేకరణ చేశాం. బీఆర్ఎస్ భూసేకరణ చేయలేదనడం హాస్యాస్పదం. కాలువలకు బీఆర్ఎస్ పిలిచిన టెండర్లను రద్దు చేశారు. కేసీఆర్ ఎంపీగా ఉండి జిల్లాకు ఏం చేయలేదనడం ఏంటి? డెబ్బై ఏండ్ల పాలనలో పాలమూరును వలసల జిల్లాగా పేరు తెచ్చారు. మా జిల్లా ప్రాజెక్టులు అంటేనే పెండింగ్ ప్రాజెక్టులుగా మార్చారు. ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాకు 27 వేల ఎకరాల సాగునీరు అందేది. బీఆర్ఎస్ వచ్చాక ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. ఈ జిల్లాను బాగు చేయాలని కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటి ప్రాజెక్టు పాలమూరులోనే శంకుస్థాపన చేశారు. కానీ అనేక కేసులు వేసి అడ్డుకున్నారు. రైతులను భూములు ఇవ్వొద్దని రెచ్చగొట్టారు. అయినప్పటికీ అన్ని అనుమతులు తీసుకొచ్చి ప్రాజెక్టు తొంభై శాతం పూర్తి చేశాం. వలసల జిల్లాకు ఐదు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తట్టెడు మట్టి తీయలేదు. కాంగ్రెస్ కేసులు వేయించింది. అధికారంలోకి వచ్చాక పనులు పెండింగ్ పెట్టింది. కాంగ్రెస్ పెండింగ్ పెట్టింది. కాంగ్రెస్ పెండింగ్ ప్రాజెక్టులను బీఆర్ఎస్ పూర్తి చేసింది. జడ్చర్లలో సభ పెడితే సీఎం ఏదైనా ఇస్తారని ఆదేశించారు. జడ్చర్లకు, జిల్లాకు ఒరిగిందేమీ లేదు. కేసీఆర్‌ను తిట్టడానికి సరిపోయింది. ఇందుకేనా సభ పెట్టిందన్నారు.

## ఆహార భద్రతను కాపాడుదాం



ఏవో డాకేశ్వర్ గౌడ్

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా భూసారాన్ని పెంపొందించడంతో పాటు ఆహార భద్రతను కూడా కాపాడవచ్చని వ్యవసాయ అధికారి (ఏవో) డాకేశ్వర్ గౌడ్ సూచించారు. వీపనగండ్ల మండలంలోని నాగర్లబండ తండాలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వానాకాలంలో సుమారు 18 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని తెలిపారు. అయితే పంట మార్పిడి విధానంలో భాగంగా ఈ విస్తీర్ణంలో కనీసం 2 వేల ఎకరాల్లో మినుములు, పెసర్లు, కందులు, వేరుశనగ, కొర్రలు, సజ్జలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పంట మార్పిడి వల్ల భూమిలోని పోషకాలు సమతుల్యంగా ఉండి భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. అంతేకాకుండా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం తగ్గి పంటలను రక్షించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అనుసరించి పంటల వైవిధ్యాన్ని పెంచాలని, తద్వారా ఆదాయాన్ని మెరుగుపర్చుకోవాలని ఆయన సూచించారు. ఆహార ధాన్యాలతో పాటు పప్పుధాన్యాల ఉత్పత్తి పెరగడం ద్వారా దేశ ఆహార భద్రతకు కూడా తోడ్పాటు అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్లబండ తండా సర్పంచు గోపాల్ నాయక్, ఏఈఓ నారియా నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# లిక్కర్ ఫ్యాక్టరీ జలదోపిడీపై సమగ్ర విచారణ చేపట్టాలి



బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ యుగంధర్ గౌడ్

**ప్రజాపక్షం/పెబ్బేరు :** ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ జల దోపిడీపై సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పెబ్బేరు మండలంలోని రంగాపూర్ శివారులో గల ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ సమీపంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాచాల మీడియాతో మాట్లాడుతూ ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ అక్రమ నీటి వాడకంపై గత కొన్ని నెలలుగా బీసీ పొలిటికల్ జేఏసీకి ప్రజల నుండి అనేక ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణనది నీటిని అక్రమంగా వాడుకుంటున్నారని, అదే విధంగా ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలను కృష్ణానదిలో కలుపుతున్నట్లు కూడా మా దృష్టికి వచ్చిందన్నారు. వేసవి కాలంలో కృష్ణానది నీరు అడుగంటి పోవడంతో వ్యవసాయానికి కూడా క్రాఫ్ హాలిడే ఇచ్చారని, అంతేకాకుండా, ఇటీవల జరిగిన బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు సైతం తాగునీటికి ప్రజలు అనేక తంటాలు పడ్డారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి సందర్భంలో నది పక్కనే ఉన్న లిక్కర్ ఫ్యాక్టరీ కృష్ణానది జలాలను స్టోరేజ్ చేసుకొని, 30హెచ్‌పి, 40 హెచ్‌పి మోటార్లతో అక్రమంగా ఫ్యాక్టరీకి తోడేస్తున్నారని మండిపడ్డారు. నిబంధన ప్రకారం నది జలాలను మొదటగా తాగడానికి, సాగు చేసుకోవడానికి వాడుకోవాలని, తర్వాతనే ఇతర అవసరాల కోసం ప్రభుత్వ అనుమతులతో వాడుకోవాల్సి ఉంటుందన్నారు. నేడు ప్రజలు తాగునీటికి, రైతులు వ్యవసాయానికి నీరు లేక అల్లాడుతున్నారని, లిక్కర్ ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం దర్జాగా జలదోపిడి చేస్తుందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెంటనే స్పందించి కృష్ణానది జలాల అక్రమ తరలింపు పై సమగ్ర విచారణను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ జెఏసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, నాయకులు దేవర శివ, బత్తుల జితేందర్, రామన్ గౌడ్, బీచుపల్లి సర్పంచ్, బీసీ రెడ్డి, ఉపసర్పంచు నాగరాజు, ఆదామ్, రాజశేఖర్ గౌడ్, వీరేష్, నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూరు మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు జి.సురూష్ కుమార్, కొత్తపల్లి ఉపాధ్యక్షుడు ఓ.నర్సింలు, మాగనూరు సంయుక్త కార్యదర్శి కళ్యాణం ఈరన్న, వర్కూర్ కోశాధికారి, జి.గిరిధర్, కొత్తపల్లి మండల మాజీ అధ్యక్షులు శివలింగయ్య, ఉదయ్ కుమార్, రామ్ గోపాల్, రవి ప్రకాష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ చేయూత



**ప్రజాపక్షం/వెల్దండ :** కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న గునిగంటిచంద్రయ్య కుటుంబానికి గృహ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో లబ్దిదారులకు సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలను అభినందించారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వారి గృహ నిర్మాణ కలను సాకారం చేయడంలో ట్రస్ట్ కీలక పాత్ర పోషిస్తోందని, భవిష్యత్‌లో ట్రస్ట్ ఇంకా మరిన్ని సేవలు చేస్తుందని గ్రామ సర్పంచ్ సిద్దగోని రమేష్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కరుణాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు.

## మంచినీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపాలిటిలో మంచినీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప వివరించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 26వ వార్డులోని ఇంద్రానగర్ కాలనీలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బోరుమోటర్‌ను చైర్మెన్ బసవేశ్వర్ అప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరు చింతించాల్సిన పని లేదని పేర్కొన్నారు. మున్సిపాలిటి పరిధిలోని వివిధ వార్డుల్లో తాగునీటి సమస్య ఎక్కడ ఉందనే విషయాన్ని గ్రహించి నియంత్రించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇంద్రానగర్ కాలనీలో వేసిన బోరు మోటర్ కారణంగా తాగునీటి సమస్య తీరుతుందని, ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన నీటిని అంధించేందుకు మున్సిపాలిటి చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఎస్‌పి శివ, కాంగ్రెస్ నాయకులు నాగమణి, బొట్టురాజు, దాసు, ప్రకాష్ తదితరులు పేర్కొన్నారు.

## కోహెడ రైతు మహోత్సవానికి తరలివెళ్ళిన అన్నదాతలు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** కోహెడ రైతు మహోత్సవానికి అన్నదాతలు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. శనివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కోహెడ గ్రామంలో నిర్వహించిన చారిత్రాత్మక రైతు మహోత్సవానికి ఆర్‌టిసి బస్సులో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పని చేస్తున్న అన్నదాతలు పెద్ద సంఖ్యలో రావడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి మైలురాయిగా నిలిచే, దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ సమీకృత పండ్లు, కూరగాయల మార్కెట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయడం రైతులకు వరంగా మారిందనవ అన్నారు. సుమారు 239ఎకరాల విస్తీర్ణంలో రూ.3300కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మార్కెట్‌కు స్వయంగా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం నుండి సుమారు 15ఆర్‌టిసి బస్సుల్లో రైతులకు ముఖ్యమంత్రి సభకు తీసుకువెళ్ళడం జరిగిందని గుర్తు చేశారు. రైతు రంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ ఎంపిడివో శ్రీకాంత్‌తోపాటు వివిధ గ్రామాల అన్నదాతలు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించాలన్నదే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలను అంధించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని మున్సిపల్ చైర్మన్‌అగ్గనూరి బసవేశ్వర్ అప్ప వివరించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 23,24,25వార్డుల్లో ప్రజాపాలన..పట్టణ ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా లక్ష్మీ నరసింహా కాలనీలో చైర్మన్ బసవేశ్వర్ అప్ప అధ్యక్షతన వార్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అంధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో పట్టణ అభివృద్ధి వేగవంతం చేస్తామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కౌన్సిలర్ విశాల విశ్వం, కమీషనర్ సునీతారెడ్డి, అగ్గనూరు నందు, అగ్గనూరు రవి తేజ, వెంకట్‌సాయి, బొబ్బిలి రమేష్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/కొందుర్గు:** సైబర్ నేరాల పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ సూచించారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని తంగేళ్ళపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఏసిపి లక్ష్మీ నారాయణతోపాటు రూరల్ సిఐ శ్రీనివాస్, కొందుర్గు ఎస్‌ఐ రవీందర్‌నాయక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసిపి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరగాళ్ళ సంఖ్య క్రమంగా పెరిగిపోయిందని దాంతోనే ప్రజలు మోసాలకు గురవుతున్నారని వివరించారు. యువకులు డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వివరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని, గ్రామాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులను ఎప్పటికప్పుడు గమనించాలని, తక్షణమే పోలీసులకు సమాచారం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వడం ద్వారానే ప్రమాదాలు జరగడానికి అస్కారం ఉందని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తులు మాత్రమే వాహనాలను నడిపించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. లేని పక్షంతో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు తహశీల్దార్ ఆజాం అలీ, గ్రామ సర్పంచ్ చందన గోవర్ధన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి పర్వీన్ భేగంతో పాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్ బాలురు మృతి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్ బాలురు మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ పాత 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. షాద్‌నగర్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో షాద్‌నగర్ నుండి సుమారు 16సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు బాలురు ద్విచంద్ర వాహనంపై లింగారెడ్డిగూడ వైపు వెళ్తున్న క్రమంలో ఎదురు ఉన్న జెసిబిని ఢీకొనడంతోపాటు ముందుకు వెళ్తు ఎంఎస్‌ఎన్ కంపెనీకి చెందిన బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు బాలురు అక్కడికక్కడే మృతి చెందినట్లు షాద్‌నగర్ పోలీసులు తెలిపారు. మృతులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాదు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# హైదరాబాద్‌లో 'ప్రాజెక్ట్ ఉద్వాసన' ప్రారంభం

భక్తిశ్రద్ధలతో పూజా సామాగ్రి సేకరణ, రీసైక్లింగ్ !

తొలి 'దివ్య వస్తువుల సేకరణ' కార్యక్రమం

పర్యావరణ పరిరక్షణకు జిహెచ్‌ఎంసి వినూత్న చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పూజల కోసం ఉపయోగించి అనంతరం పనికిరాకుండా మిగిలిపోయే దేవతా చిత్రాలు, విగ్రహాలు, పూజా ఫ్రేములు వంటి పవిత్ర వస్తువులను గౌరవప్రదంగా సేకరించి పునర్వినియోగం, రీసైక్లింగ్ చేయాలనే లక్ష్యంతో మహానగర పాలక సంస్థ( జిహెచ్‌ఎంసి) చేపట్టిన 'ప్రాజెక్ట్ ఉద్వాసన' పైలట్ కార్యక్రమం విజయవంతమైందని అధికారులు తెలిపారు. బంజారాహిల్స్‌లోని హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ (ఇస్కాన్)లో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని తొలి వాలంటీర్ ఆధారిత పవిత్ర వస్తువుల సేకరణ డ్రైవ్‌గా నిలిచింది. ఇళ్లలో పాత దేవతా చిత్రాలు, దెబ్బతిన్న ఫ్రేములు, పూజలకు ఉపయోగించిన విగ్రహాలను పారవేయడానికి సరైన విధానం లేకపోవడంతో ప్రజలు వాటిని సంవత్సరాల తరబడి భద్రపరుస్తున్నారు. కొన్నిసార్లు చెట్లు, చెరువులు, దేవాలయాల వద్ద వదిలివేయడం వల్ల అవి చివరకు చెత్తలో కలిసిపోతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా మతపరమైన సంప్రదాయాలను, పౌర బాధ్యతను, పర్యావరణ హిత విధానాలను సమన్వయం చేస్తూ జిహెచ్‌ఎంసి ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాత దేవతా చిత్రాలు, పూజా ఫ్రేములు, విగ్రహాలు తదితర పవిత్ర వస్తువులను తీసుకొచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. సేకరించిన వస్తువులకు ముందుగా సంప్రదాయబద్ధంగా 'ఉద్వాసన పూజ' నిర్వహించి, అనంతరం వాటిని వర్గీకరించి శాస్త్రీయ పద్ధతిలో విడదీసి రీసైక్లింగ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది పౌరుల నుంచి మొత్తం 68 కిలోల దివ్య వస్తువులు సేకరించగా, వాటిలో కొన్నింటిని ఆసక్తి చూపిన వారికి తిరిగి వినియోగం కోసం అందజేశారు. సేకరణ ప్రక్రియలో నమోదు, వస్తువుల స్వీకరణ, వర్గీకరణ, ఉ ద్వాసన పూజ, పునర్వినియోగానికి అనువైన వస్తువుల గుర్తింపు, శాస్త్రీయంగా విడదీయడం, రీసైక్లింగ్ వంటి ద శలను అనుసరించారు. పవిత్ర వస్తువులు సాధారణ ము న్సిపల్ చెత్తలో కలవకుండా అన్ని చర్యలను సేకరణ కేం ద్రంలోనే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరో ప్ర త్యేకత సాంకేతిక పరిజ్ఞానం వినియోగం. సేకరించిన వ స్తువుల పరిమాణం, రీసైక్లింగ్ చేసిన పదార్థాల వివ రా లు, వ్యర్థాల పరిమాణం వంటి అంశాలను డిజిటల్ విధానంలో నమోదు చేసి పర్యావరణ ప్రభావాన్ని అంచనా వేయనున్నారు. పైలట్ దశ అనంతరం నగరవ్యాప్తంగా క్యూ ఆర్ కోడ్ ఆధారిత సేవలను విస్తరించే ప్రతిపాదనను జిహెచ్‌ఎంసి పరిశీలిస్తోంది. ప్రాజెక్ట్ ఉద్వాసన కింద తదుపరి సేకరణ కార్యక్రమాన్ని ఈనెల 13న యూసుఫ్‌గూడలోని శ్రీ హనుమాన్ ఆలయంలో నిర్వహించనున్నట్లు జిహెచ్‌ఎంసి ప్రకటించింది.

**ఉద్వాసన అంటే ఏమిటి?**

వ్రతం లేదా పూజ ఉత్సవాలు పూర్తి అయ్యాక ఆరాధించిన దేవతలకు భక్తి పూర్వకంగా వీడ్కోలు పలికి, వారిని యథాస్థానానికి పంపడం. పటాలు, విగ్రహాలను కదిలిస్తూ దైవత్వాన్ని వారి నిజ నివాసానికి వెళ్లాలని ప్రార్థిస్తూ ఈ పూజ చేస్తారు.

**తిరిగి సంపదగా మార్చుకునే వస్తువులే : జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్**

రోజూ డంపింగ్ యార్డుకు చేరే చెత్తలో లోహాలు, దేవుని పటాలు వంటివి ఉంటున్నాయి. డంపింగ్ యార్డుకు చేరే పనికి రాని వస్తువుల్లో ఒక్క మట్టి తప్ప మిగిలినవి అన్ని తిరిగి సంపదగా మార్చుకునే వస్తువులే. ఇంటి వద్దే ఆయా వస్తువులను సేకరించగలిగితే, తక్కువ డబ్బులతో వ్యర్థాలను రీసైక్లింగ్ చేయగలం. అందులో భాగంగా ఇప్పటికే క్యూఆర్ కోడ్‌తో పని చేసే ప్రత్యేక శిబిరాలు, ఈవేస్ట్ బిన్‌లను హైదరాబాద్ నగరంలోని వేరు వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశాం. ప్రస్తుతం దేవుని పటాలనూ సేకరిస్తున్నాం. అని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. భక్తి విలువలను కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని నగర పౌరులకు ఆయన పిలుపునిచ్చారు.

## నల్లగండ్ల చెరువు అభివృద్ధికి పట్టాదారులు గ్రీన్ సిగ్నల్

టిడిఆర్ పరిహారం త్వరగా అందించాలని హైడ్రా కమిషనర్‌కు వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని నల్లగండ్ల చెరువు అభివృద్ధికి ప్రైవేటు పట్టాదారులు అంగీకారం తెలిపారు. ఈ మేరకు శనివారం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను కలిసి సంతకాలతో కూడిన అంగీకార పత్రాలను అందజేశారు. చెరువు అభివృద్ధి పనుల కారణంగా తమ భూములు కోల్పోతున్న నేపథ్యంలో, ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్(టిడిఆర్) విధానం కింద నష్టపరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రా నగరంలోని చెరువులను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో, నల్లగండ్ల చెరువును కూడా సుందరంగా తీర్చిదిద్దాలని పట్టాదారులు అభిప్రాయపడ్డారు. నల్లగండ్ల చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టిఎల్) పరిధి 89.69 ఎకరాలు కాగా, ఇందులో 36.37 ఎకరాలు ప్రభుత్వ భూమి, 53.32 ఎకరాలు ప్రైవేటు పట్టాదారుల భూమిగా ఉంది. రూ.28 కోట్ల వ్యయంతో చెరువు పునరుద్ధరణ పనులను హైడ్రా చేపట్టింది. చెరువు అభివృద్ధికి పట్టాదారులు సహకరించి ముందుకు రావడం శుభపరిణామమని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. టిడిఆర్ నిబంధనల మేరకు అర్హులైన పట్టాదారులకు నష్టపరిహారం అందేలా తనవంతు కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు.



# ప్రజా ఆరోగ్యంపై జిహెచ్‌ఎంసి ప్రత్యేక నిఘా

ప్రజారోగ్య నిపుణుల భాగస్వామ్యంతో..

'వన్ హెల్త్' విధానం అమలుతో వ్యాధుల పర్యవేక్షణ మరింత బలోపేతం

జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో ప్రజారోగ్య పరిరక్షణ, అంటువ్యాధుల నియంత్రణే లక్ష్యంగా మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా జిహెచ్‌ఎంసి మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎంఎస్‌యు) ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల వైద్యారోగ్య శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సమావేశానికి జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ (ఆరోగ్యం) బదావత్ సంతోష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (సిఎంఓహెచ్) డాక్టర్ కె. పద్మజ నేతృత్వం వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో అంటువ్యాధుల ముందస్తు గుర్తింపు, నివేదికల సమర్పణ, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమగ్ర వ్యాధి పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం, వ్యాధుల నివేదికల సమర్పణలో నిబంధనల అమలును మెరుగుపరచడం, వ్యాధుల వ్యాప్తి పరిస్థితుల్లో ముందస్తు సన్నద్ధత పెంపు వంటి అంశాలపై చర్చించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, సమగ్ర ఆరోగ్య సమాచార వేదిక (ఐహెచ్‌ఐపి) మార్గదర్శకాల ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సంస్థలు తప్పనిసరిగా తెలియజేయాల్సిన వ్యాధుల నివేదికలను సమయానికి అందించాలని అదనపు కమిషనర్ సంతోష్ సూచించారు. నివేదికల సమర్పణలో వెనుకబడిన ఆసుపత్రులు, ప్రయోగశాలలను గుర్తించి అవసరమైన సహకారం అందించాలని నిర్ణయించారు. ప్రైవేట్ వైద్య సేవల సంస్థలతో క్రమం తప్పకుండా సమన్వయ సమావేశాలు నిర్వహించి, వ్యాధుల నివేదికల వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు. వ్యాధుల ప్రబలతపై తక్షణ విచారణ, నియంత్రణ చర్యల కోసం రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు (ఆర్‌ఆర్‌టిలు) మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. ల్యాబొరేటరీ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (లిమ్స్) ఉపయోగిస్తున్న ప్రయోగశాలలు ఐహెచ్‌ఐపి పరిధిలోని 50 నోటిఫైయబుల్ వ్యాధుల కోసం ఆటోమేటిక్ అలర్ట్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో వ్యాధులపై సకాలంలో సమాచారం అందడంతో పాటు, వ్యాప్తి ప్రమాదాలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ శాఖలు, వైద్య సంస్థలు, ప్రయోగశాలలు, ప్రజారోగ్య నిపుణుల భాగస్వామ్యంతో 'వన్ హెల్త్' విధానాన్ని అమలు చేస్తూ వ్యాధుల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడానికి జిహెచ్‌ఎంసి కట్టుబడి ఉందని అదనపు కమిషనర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఈ చర్యల ద్వారా వ్యాధుల ప్రబలతను ముందుగానే గుర్తించడం, ప్రజారోగ్య సన్నద్ధతను మెరుగుపరచడం, ఆరోగ్య ముప్పులను వేగంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు.

# బ్యాడ్మింటన్ అభివృద్ధిలో పుల్లెల గోపీచంద్ పాత్ర అపూర్వం

గచ్చిబౌలిలో జరిగిన

యోనెక్స్-సన్‌రైజ్ సబ్ జూనియర్

ర్యాంకింగ్ టోర్నీ ముగింపులో

ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భారత బ్యాడ్మింటన్ అభివృద్ధిలో జాతీయ ప్రధాన కోచ్ డా.పుల్లెల గోపీచంద్ పాత్ర అపూర్వమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కొనియాడారు. శనివారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా మే 29 నుంచి నిర్వహించిన యోనెక్స్‌సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ (అండర్15,అండర్ 17) ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి 3,600 మందికి పైగా యువ షట్లర్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వారం రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో భవిష్యత్ స్టార్ షట్లర్లు తమ నైపుణ్యాన్ని చాటుకుంటూ ప్రేక్షకులను అలరించారు. అండర్15 బాలుర సింగిల్స్‌లో ఉత్తరాఖండ్‌కు చెందిన ఆదిత్య సింగ్ నేగి ఛాంపియన్‌గా నిలవగా, బాలికల సింగిల్స్‌లో రాజస్థాన్‌కు చెందిన అన్వి రాథోర్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. తెలంగాణకు చెందిన హంసిని రన్నరప్‌గా నిలిచి ప్రశంసలు అందుకుంది. అండర్17 బాలికల సింగిల్స్ విభాగంలో అవని విజేతగా నిలిచింది. బాలుర డబుల్స్‌లో తమిళనాడుకు చెందిన తాబిన్ అనుఫ్ అహ్మద్ ఎం.ఎఫ్ తెలంగాణకు చెందిన శ్రీచేతన్ శౌర్య శామల జోడీ అద్భుత ఆటతీరుతో విజేతలుగా నిలిచింది.బాలికల డబుల్స్‌లో కేరళకు చెందిన అలెక్సియా ఎల్సా అలెగ్జాండర్ తమిళనాడుకు చెందిన జయ సప్తశ్రీ ఎం జోడీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మిజోరంకు చెందిన లియాన్‌సాంగ్పుయా నాగాలాండ్‌కు చెందిన కిమ్‌కిమ్ ఖోంగ్‌సై జోడీ ఛాంపియన్‌గా అవతరించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత బ్యా డ్మింటన్ అభివృద్ధిలో జాతీ య ప్రధాన కోచ్ డా.పుల్లెల గోపీచంద్ పాత్ర అపూర్వమని కొనియాడారు.గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ వేదిక వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఆయన చేస్తున్న కృషి దేశ క్రీడారంగానికి అమూల్యమైనదని పేర్కొన్నారు.అనంతరం బ్యాట్ ఉపాధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ టోర్నీలో పాల్గొన్న యువ క్రీడాకారుల ప్రతిభను అభినందించారు.విజేతలు, రన్నరప్ క్రీడాకారులను అ భినందించిన వి చాముండేశ్వరి నాథ్ యువ క్రీడాకారుల విజయాల్లో కోచ్‌లు, తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ యు.వి.ఎన్.బాబు,బాయ్ కన్వీనర్ ఉమర్ రషీద్, బ్యాట్ ఉపాధ్యక్షులు వి.చాముండేశ్వరి నాథ్, బ్యాట్ సలహాదారు కొసరాజు లక్ష్మణ్, కోశాధికారి కె.వంశీధర్,బ్యాట్ సభ్యులు శ్రీనివాసరావు,మీడియా కోఆర్డినేటర్ రమణా రెడ్డి, స్పాన్సర్ రాజిరెడ్డి,గ్లోబల్ సొల్యూషన్స్ ప్రతినిధి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు అందరు సహకరించాలి : ఏసిపి రాజు



**ప్రజాపక్షం/యాచారం :** శాంతి బద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఇబ్రహింపట్నం ఏసిపి రాజు అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో జరిగిన గ్రామ సభకు అయన ముఖ్య అతిధిగా హజరై మాట్లాడారు. పోలీసులకు అందరు సహకరించాలని అయన కోరారు మధ్యం తాగి వాహనాలు నడుపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది చనిపోతున్నారు. అందువల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి దీనికి యువత దూరంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరు హెల్మేట్ ధరించడం తప్పని సరి అనే విషయాన్ని మర్చి పోవద్దని తెలిపారు. అనంతరం ఎంపిఒ శ్రీలత మాట్లాడుతూ తడిపోడి చెత్తను వేరుచేయాన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప ణాళికల కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పంట పోలాల్లో గట్ల వేంబడి మొక్కలు నా టాలన్నారు. నందివనపర్తి గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఎంపిడిఒ రాధ రాణి పాల్గోన్నారు. ఈ కార్యక్రమంలో యాచార సిఐ నందిశ్వర్‌రెడ్డి, ఎంపిఒ శ్రీలత. సర్పంచ్‌లు విజయ్‌కుమార్, శంకర్ అచ్చన మంగ జంగయ్య ,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గోన్నారు.

## మరో రెండు వారాలు హైడ్రా ప్రజావాణికి విరామం

జూన్ 22 నుంచి యథావిధిగా నిర్వహణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి సోమవారం నిర్వహించే హైడ్రా ప్రజావాణి కార్యక్రమానికి మరో రెండు వారాల పాటు విరామం కొనసాగనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ప్రకటించారు. ఈ నెల 8వ తేదీతో పాటు 15వ తేదీన కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబోమని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయడానికి మే 11వ తేదీ నుంచి వరుసగా నాలుగు సోమవారాలు ప్రజావాణికి విరామం ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ 22వ తేదీ నుంచి హైడ్రా ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని రంగనాథ్ చెప్పారు.

## రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

మండల అభివృద్ధి అధికారి అపర్ణ

**ప్రజాపక్షం/షాబాద్:** రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మం డల అభివృద్ధి అధికారి అపర్ణ అన్నారు. శనివారం షాబాద్ మండలం నుండి ముఖ్యమంత్రి ప్రారంభించే కోహెడ పండ్ల మార్కెట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆరు క్లస్టర్‌ల నుండి 9 బస్సులతో రైతులు బయాలుదేరారు. అభివృద్ధి అధికారి అపర్ణ మాట్లాడుతూ.. రైతులు ఆర్థికంగా రాణించేందుకు రాష్ట ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఆన్‌లైన్ ద్వారా విత్తనాలు, నాణ్యమైన ఎరువులు, పండ్ల మొక్కలు, రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు చెప్పారు.

## షాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌గా రవికుమార్



**ప్రజాపక్షం/షాబాద్:** షాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌గా రవికుమార్ బాధ్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ మండల ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఫోటో:04గ్రామసభలో మాట్లాడుతున్న ఏసిపి లక్ష్మీ నారాయణ.

# రైతులకు పరిహారం చెల్లించి మార్కెట్ నిర్మాణ పనులు

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** రైతులకు నష్ట పరిహారం చెల్లించి కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆదిభట్ల సర్కిల్ తొర్రురు డివిజన్ పరిధిలోని రొక్కం సత్తి రెడ్డి గార్డెన్‌లో బిఆర్‌ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సర్వే నెంబర్లు 507, 548లో అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సర్వేనెంబర్ 167/1లో మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సరైన నిర్ణయం కాదని విమర్శించారు.170 ఎకరాల విస్తీర్ణంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, మార్కెటింగ్ శాఖల అధికారులు ఎంతో కష్టపడి భూమిని చదును చేశారని తెలిపారు. రెండున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి సమగ్ర అధ్యయనం లేకుండా మార్కెట్‌ను మరో ప్రాంతానికి తరలిస్తుందని ఆరోపించారు. ఓఆర్‌ఆర్‌కు సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 167/1లో చెట్లు, గుట్టలు అధికంగా ఉండడంతో మార్కెట్ నిర్మాణానికి అనుకూల పరిస్థితులు లేవని పేర్కొన్నారు. అన్ని విధాలుగా అనుకూలమైన భూమి అందుబాటులో ఉండగా దానిని వదిలిపెట్టి ఎత్తైన ప్రాంతాన్ని ఎంపిక చేయడం వల్ల భవిష్యత్తులో భారీ వాహనాల రాకపోకల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. సర్వే నెంబర్ 167/1లో 120 మంది రైతులు తరతరాలుగా సాగు చేస్తున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, ఇప్పటివరకు రైతులకు తగిన నష్ట పరిహారం లేదని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం మార్కెటును తిరిగి సర్వే నెంబ ర్లు 507, 548 లోనే ఏర్పాటు చేయాలని ఆయ న డిమాండ్ చేశారు. కోహెడలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్యాణ్ నాయక్, సామ సంజీవరెడ్డి ఏను గు ఆనంద్ రెడ్డి, మోహన్ గుప్తా, సంపతీశ్వర్ రెడ్డి, బొక్క గౌతమ్ రెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు

## నిరుపేదలు, పాదచారుల కడుపు నింపేందుకే అన్నదానం

**ప్రజాపక్షం/మియాపూర్:** ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలు, పాదచారుల కడుపు నింపేందుకే వారంలో ప్రతి శనివారం హోఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని పౌండేషన్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్ అన్నారు. ప్రతి వారం క్రమం తప్పకుండ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం నిరుపేదలకు ఆశాకిరణంగా మారింది. ఆకలితో అలమటిస్తున్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు, పాదచారులకు, వివిధ షోరూంలలో పనిచేస్తున్న కార్మికులకు ఉచితంగా భోజనం అందించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శనివారం వేల మందికి అన్నదానం నిర్వహించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. సేవా భావంతో ముందుకు సాగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా హోప్ పౌండేషన్ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి ఆహారం అందించడం గొప్ప మానవతా సేవ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అన్నె అప ర్ణ, అన్నె సందీప్,భాస్కర్,మధుసూదన్ రెడ్డి,మల్లేష్, విష్ణు మూర్తి,రవి, పీటర్, మారం ప్రసాద్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



### దేశ ఆర్థిక వృద్ధిని మరింత పెంచే చర్యలపై...
## ఇఎసి సభ్యులతో ప్రధాని మోదీ భేటీ



**న్యూఢిల్లీ :** ప్రపంచ సంక్షోభం నేపథ్యంలో భారతదేశ ఆర్థిక వృద్ధిని మరింతగా పెంచేందుకు చేపట్టాల్సిన పలు చర్యల విషయమై ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం ఆర్థిక సలహా మండలి సభ్యులతో చర్చించారు. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యులు (ఇఎసి–పిఎం) కూడా భారతదేశం, ప్రపంచంపై ఆసియా సంఘర్షణ ప్రభావం గురించి తమ అంచనాను ప్రధానమంత్రికి విపులీకరించారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సమావేశానికి అధ్యక్షత వహించారు. భారత ఆర్థిక పరివర్తన, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రాధాన్యతలకు సంబంధించిన అనేక అంశాలపై ఆయన ఈ సందర్భంగా చర్చించారు. సంస్కరణల ప్రయాణానికి మరింత ఊపును ఇవ్వడం, జీవన సౌలభ్యంతోపాటు, వ్యాపార సౌలభ్యం కల్పించడంపై కూడా దృక్పథాలను పంచుకున్నాం అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రపంచ సంక్షోభ సమయంలో భారతదేశ ఆర్థిక వృద్ధిని మరింతగా పెంచేందుకు ప్రధాని, ఆర్థిక సలహా మండలి సభ్యులు వివిధ ఆలోచనలు, చర్యలపై చర్చించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. జీనవ సౌలభ్యం, వ్యాపార సౌలభ్యాన్ని మెరుగు పరిచేందుకు పలు సంస్కరణలపై కూడా ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించినట్లు వారు తెలిపారు. ఇఎసి అనేది భారత ప్రభుత్వానికి ముఖ్యంగా ప్రధానమంత్రికి ఆర్థిక సంబంధిత విషయాలపై సలహాలిచ్చే ఒక స్వతంత్ర సంస్థ. ఇఎసి సభ్యులతో పాటు ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు పి.కె.మిశ్రా, శక్తి కాంత దాస్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతం ఆర్థిక సలహా మండలిలో ఛైర్మన్, ముగ్గురు పూర్తికాలపు సభ్యులు , 11మంది పార్ట్‌టైమ్ సభ్యులు ఉన్నారు. ఎస్.మహేంద్రదేవ్ ఛైర్మన్‌గా ఉండగా, సంజయ్‌కుమార్ మిశ్రా, సంజీవ్ సన్యాల్, షమికా రవి పూర్తికాల సభ్యులుగా ఉన్నారు. 11 మంది పార్ట్‌టైమ్ సభ్యులలో రాకేష్ మోహన్, సజ్జిద్, జెడ్. చినోయ్, నీల్‌కాంత్ మిశ్రా, నీలేష్ షా, టి.టి.రామ్ మోహన్, సౌమ్య కాంతి ఘోష్, కె.వి.రాజు, చేతన్ ఘాటే, పామి దువ, పులక్ ఘోష్, గౌరవ్ వల్లభ్ ఉన్నారు. ఆర్థిక సలహా మండలి విధి విధానాలలో ప్రధానమంత్రి సూచించిన ఆర్థిక లేదా ఇతర ఏ అంశాన్ని అయినా విశ్లేషించి దానిపై ఆయనకు సలహా ఇవ్వడం, స్థూల ఆర్థిక ప్రాముఖ్యత గల అంశాలను పరిష్కరించేందుకు వాటిపై ప్రధానమంత్రికి అభిప్రాయాలను సమర్పించడం వంటివి ఉన్నాయి. ఇవి సుమోటోగా గానీ, ప్రధానమంత్రి లేదా మరెవరైనా చేసిన సిఫార్సు మేరకు గానీ ఉండవచ్చు. ప్రధానమంత్రి ఎప్పటికప్పుడు కోరిన ఇతర పనులను చూసుకోవడం కూడా వీటిలో భాగంగా ఉంటుంది.

### ఛార్జిషీట్‌లో భాగంగా ఉన్న పత్రాలను...
# నిందితులకు అందకుండా అడ్డుకోలేం

• సుప్రీంకోర్టు • రిటైర్డ్ మేజర్ జనరల్ వి.కె.సింగ్‌కు 'అత్యంత గోప్యమైన పత్రాల' టైప్ చేసిన కాపీని అందించాలని ఆదేశం



**న్యూఢిల్లీ :** ఛార్జిషీట్‌లోని పత్రాలను నిందితుడికి అందకుండా నిరాకరించకూడదని, అలా చేయడం వల్ల వారు నిష్పక్షపాత విచారణ పొందే హక్కుకు నష్టం వాటిల్లవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. 1923 అధికార రహస్యాల చట్టంలోని నిబంధనల కింద 2007లో నమోదైన కేసులో విచారణను ఎదుర్కొంటున్న రిటైర్డ్ మేజర్ జనరల్ వి.కె.సింగ్‌కు 'అత్యంత గోప్యమైన పత్రాల' టైప్ చేసిన కాపీని అందించాలని న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. మాజీ ఆర్ ఎడబ్ల్యు('రా') అధికారి కూడా అయిన వి.కె.సింగ్ కోరిన పత్రాలు విచారణ ప్రయోజనాలకు అసంబద్ధమైనవని సిబిఐ వాదించడంలేదని, జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా అవి 'అత్యంత గోప్యమైనవి' అని, వాటి కాపీలను అందిస్తే అవి బహిరంగంగా వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నాయని మాత్రమే ప్రాసిక్యూషన్ అభ్యంతరం తెలిపిందని ధర్మాసనం పేర్కొంది. 'ఛార్జిషీట్‌లో భాగంగా ఉన్న పత్రాలను జనరల్ డైరీలో ఉన్న వాటితో సహా ఒక నిందితుడికి అందుబాటులోకి రాకుండా విచారించడం అనేది ఒక సాధారణ చట్టం. అయితే అటువంటి పత్రాలను సద్భావనతో పొంది ఉండాలి. అవి ప్రాసిక్యూషన్ కేసుకు సంబంధించినవిగా ఉండాలి. న్యాయం, నిష్పక్షపాత విచారణ ప్రయోజనాల దృష్ట్యా వాటిని వెల్లడించడం అవసరమని పబ్లిక్ ప్రాసిక్యూటర్ భావించాలి' అని ధర్మాసనం తన మే 18వ తేదీ ఉత్తర్వులో పేర్కొంది. 'అలా ఎందుకంటే, అలాంటి పత్రాలను నిలిపివేయడం నిందితుడికి నిష్పక్షపాత విచారణ పొందే హక్కుకు తీవ్రమైన నష్టం కలిగించవచ్చు' అని ధర్మాసనం తెలిపింది గతేడాది ఢిల్లీ హైకోర్టు సెప్టెంబర్ ఉత్తర్వును సవాల్ చేస్తూ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం ఈ ఉత్తర్వును జారీ చేసింది. సింగ్ కోరిన డాక్యుమెంట్ల నకళ్లను ప్రాసిక్యూషన్ అందించాలని ఆదేశించిన ట్రయల్‌కోర్టు 2009 డిసెంబర్ నాటి ఉత్తర్వును హైకోర్టు సవరించింది. ప్రాసిక్యూషన్‌లో భాగంగా ఉండి తనకు అందజేయని కొన్ని డాక్యుమెంట్లను అందించాలని కోరుతూ ప్రాసిక్యూషన్‌ను ఆదేశించాలని కోరుతూ సింగ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి)లోని సెక్షన్ 207 కింద ట్రయల్ కోర్టులో ఒక దరఖా'స్తును దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరుపుతూ సుప్రీం కోర్టు ఇలా పేర్కొంది.'మా అభిప్రాయం ప్రకారం ఛార్జిషీట్‌లో భాగంగా ఉండి, దానికి వ్యతిరేకంగా ఉపయోగించబడుతున్నందున సదరు పత్రాలను అప్పీల్‌దారుడికి (సింగ్‌కు)అందించాలి'. నిందితుడికి నిష్పక్షపాత విచారణ పొందే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే, వ్యక్తిగత స్వేచ్ఛ అనే ప్రాథమిక హక్కులో ఒక ముఖ్యమైన అంశమని, జాతీయ భద్రత, సార్వభౌమాధికారం వంటి అంశాల ప్రయోజనాలను సమతుల్యం చేసే దృష్ట్యా సిబిఐ తరపున హాజరైన న్యాయాధికారిని ఒక న్యాయమైన ప్రతిపాదనతో ముందుకు రావాలని కోరినట్లు ధర్మాసనం పేర్కొంది. విచారణ సమయంలో న్యాయాధికారి ఆ పత్రాల టైప్ చేసిన కాపీని ఒక షరతుతో అందజేస్తామని, సింగ్ వాటిని కేవలం కోర్టు విచారణల ప్రయోజనం కోసం మాత్రమే ఉపయోగించవచ్చని, ఆ పత్రాలను ఎలక్ట్రానిక్ లేదా ప్రింట్ మీడియాలో లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఏ విధంగానూ ప్రచారం చేయరాదని సమర్పించినట్లు బెంచ్ తెలియజేసింది. సిఆర్‌పిసి సెక్షన్ 207 కింద అప్పీల్ దారు దాఖలు చేసిన దరఖాస్తులో సూచించిన పత్రాల టైప్ కాపీని..నిందితుడి వాదన కోసం రెండు నెలల్లోగా అతడికి అందించాలని మేం ఆదేశిస్తున్నాం అని ధర్మాసనం తెలిపింది. 'ఇండియాస్ ఎక్స్‌టర్నల్ ఇంటెలిజెన్స్...సీక్రెట్స్ ఆఫ్ రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్' అనే తన పుస్తకం ద్వారా రహస్య సమాచారాన్ని బహిరంగ పరిచారని సింగ్‌పై సెప్టెంబర్‌లో సిబిఐ ఒక ఫిర్యాదును నమోదు చేసింది.

### ఎన్నికల్లో బేరసారాల అడ్డగింతకు
## పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడుతా

ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి సుప్రియా సూలే



**పుణె:** ఎన్నికల్లో బేరసారాలకు పాల్పడుతుండడంపై ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి సుప్రియా సూలే ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలలో మరింత పారదర్శకతను కోరుతూ తాను పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర శాసన మండలి ఎన్నికలలో ప్రలోభాలు, ఒత్తిడి వ్యూహాల ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలను ప్రస్తుత రూపంలో రద్దు చేయాలని, లేదా బహిరంగ ఓటింగ్‌ను ప్రవేశపెట్టాలని ఆమె అన్నారు. 'ఎన్నికల ప్రక్రియలో నిర్మాణాత్మక మార్పులు కోరుతూ పార్లమెంటులో బిల్లును ప్రవేశపెడతాను.. ఎన్నికల సమయంలో బేరసారాలు ఆగాలి. సర్పంచ్ నుండి లోక్‌సభ వరకు ఎన్నికలు పారదర్శకంగా జరగాలి' అని సూలే అన్నారు. స్థానిక స్వపరిపాలన సంస్థల నుండి 16 శాసన మండలి స్థానాలకు 18న జరగనున్న ఎన్నికలకు ముందు, మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) భాగస్వామ్య పక్షాలు ఇటీవల కొంతమంది అభ్యర్థులను ఉపసంహరించుకోవడాన్ని ఆమె సమర్థించారు. ఫార్టీ ఫిరాయింపులు జరిగే అవకాశం ఉందన్న విస్తృత ఆందోళనల నేపథ్యంలో, కూటమి భాగస్వాములందరి నాయకులతో సంప్రదింపులు జరిపిన అనంతరం (ఉపసంహరణ) నిర్ణయాన్ని సమష్టిగా తీసుకున్నారు. ప్రతిచోటా బేరసారాల గురించి చర్చలు జరిగాయి' అని సూలే విలేకరులతో అన్నారు. ఈ నిర్ణయానికి దారితీసిన చర్చల సమయంలో ఎన్‌సిపి (ఎస్‌పి), కాంగ్రెస్, శివసేన (యుబిటి) నాయకులు కూడా పాల్గొన్నారని ఆమె తెలిపారు. ఉపసంహారణలపై వస్తున్న విమర్శలను ప్రశ్నిస్తూ, ప్రతి నియోజకవర్గంలోనూ భిన్నమైన రాజకీయ పరిస్థితి ఉంటుందని, రాజకీయ పార్టీలు బేరసారాలను అనుమతించాలా అని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల సంస్కరణల కోసం తన ప్రణాళికలను ప్రకటిస్తూ, పరోక్ష ఎన్నికల సమయంలో పదేపదే వస్తున్న బేరసారాల ఆరోపణలను పరిష్కరించడానికి పార్లమెంటులో తాను వ్యక్తిగతంగా ఒక బిల్లును ప్రవేశపెడతానని బారామతి ఎంపి తెలిపారు. 'ఒక పౌరురాలిగా, ప్రజాప్రతినిధిగా ఒక బిల్లును ప్రవేశపెడతాను. ఇలాంటి ఎన్నికల సమయంలో బేరసారాల ఆరోపణలు ఆగాలి' అని ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి అన్నారు. ప్రతిపాదిత చట్టం ఎన్నికల ప్రక్రియలో నిర్మాణాత్మక మార్పులను కోరుతుందని సూలే తెలిపారు.

### సాంకేతికత, ఎఐ ఉపయోగించి ఉంటే...
## నీట్ పేపర్ లీకేజీని అరికట్టేవారు

ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్



**పుణె :** నీట్ పరీక్షా పత్రం లీక్‌పై ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ స్పందించారు. వైద్య ప్రవేశ పరీక్ష నిర్వహణలో సాంకేతికత, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను వినియోగించి ఉంటే ఈ పరిస్థితిని నివారించ గలిగేవారన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు సాంకేతికతలో కొత్త అవకాశాలను పరిచయం చేసేందుకు 'సకల్ మీడియా గ్రూప్' సహకారంతో 'విద్యా ప్రతిష్ఠాన్' ఆధ్వర్యంలోని 'శరద్‌చంద్ర పవార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' చేపట్టిన టెక్నాలజీ ఆన్ వీల్స్ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. సాంకేతికత, ముఖ్యంగా ఎఐ వినియోగం ద్వారా నీట్ కుంభకోణాన్ని నివారించగలిగేవారా అని అడిగినప్పుడు, 'ఒకవేళ ఇది (ఎఐ వినియోగం) ముందే జరిగి ఉంటే, అసలు ఈ పరిస్థితి తలెత్తేదే కాదు' అని బదులిచ్చారు. 'జాతీయ స్థాయిలో ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించే బాధ్యతను ప్రస్తుతం ఎవరికైతే అప్పగించారో, వారు గతంలో నాతో కలిసి పనిచేశారు. ఆయన అత్యంత నిజాయితీపరుడు, సమర్థుడైన అధికారి. ఆయన పని ఫలితాలు రాబోయే రెండు నెలల్లో కనిపించడం ప్రారంభిస్తాయి' అని ఎవరి పేరునూ ప్రస్తావించకుండా ఆయన అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) మే 3న నిర్వహించిన నీట్ (యుజి) పరీక్ష, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 12న రద్దు చేశారు. దీనిపై ప్రస్తుతం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) దర్యాప్తు చేస్తోంది. ఇప్పటి వరకు 13 మందిని అరెస్టు చేసింది. దీనికి సంబంధించి తిరిగి పరీక్షను జూన్ 21న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వివాదం నేపథ్యంలో, కేంద్రం ఎన్‌టిఎలో ఇద్దరు జాయింట్ సెక్రటరీలను, జాయింట్ డైరెక్టర్లను నియమించింది. ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌కు చెందిన 1998 బ్యాచ్ అధికారి అనుజా బాపట్, ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (కస్టమ్స్, పరోక్ష పన్నులు)కు చెందిన 2004 బ్యాచ్ అధికారి రుచితా విజ్ ఎన్‌టిఎలో కొత్త జాయింట్ సెక్రటరీలుగా ఐదేళ్ల కాలానికి నియమితులయ్యారు. కాగా, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణతో సహా ప్రతి రంగంలోనూ ఎఐకి ప్రాముఖ్యత ఉందని పవార్ పేర్కొన్నారు. 'వ్యవసాయ రంగంలో ఎఐ అద్భుతమైన పురోగతిని తీసుకువచ్చింది. వివిధ రంగాలలో దీనిని ఉపయోగించడానికి మనం సాధ్యమైనంత కృషి చేయాలి' అని మాజీ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అన్నారు. ఎఐ ఒక ముఖ్యమైన అంశమని పవార్ పేర్కొంటూ 'భౌరావ్ పాటిల్ 'రయత్ శిక్షణ సంస్థను స్థాపించారు, మేము ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళుతున్నాము. ఈ సంస్థలో సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. మేము విద్యార్థుల నుండి ఎటువంటి ఫీజులు లేదా విరాళాలు వసూలు చేయము. పుణెతో పాటు మహారాష్ట్రలోని గిరిజన ప్రాంతాలలో కూడా దీనికి అనేక శాఖలు ఉన్నాయి గిరిజన కళాశాలల విద్యార్థులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, వివిధ రంగాలలో విజయం సాధించడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. ఈ రోజు మేము టెక్నాలజీ ఆన్ వీల్స్ అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించాము; దీనికి చాలా సానుకూల స్పందన లభిస్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని ఆ సీనియర్ నాయకుడు అన్నారు.

## నలుగురు అన్నాడిఎంకె మాజీమంత్రులు టివికెలో చేరిక



**చెన్నై :** ఇప్పటికే తీవ్ర అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న అన్నాడిఎంకెకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన నలుగురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు శనివారం చెన్నైలోని టివికె ప్రధాన కార్యాలయంలో అధికార పార్టీలో చేరారు. టివికెలో చేరిన అన్నాడిఎంకె నాయకులలో ఉడుమలై కె. రాధాకృష్ణన్, ఎం.సి. సంపత్, కదంబూర్ సి. రాజు, ఎన్.ఆర్. శివపతి ఉన్నారు. వీరంతా టివికె ప్రధాన కార్యదర్శి ఆనంద్, ఎన్నికల ప్రచార నిర్వహణ ప్రధాన కార్యదర్శి ఆధవ్ అర్జున్ సమక్షంలో అధికార పార్టీలో చేరారు. ఏప్రిల్ 23న జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత, అన్నాడిఎంకె వరుస ఎదురు దెబ్బలను ఎదుర్కొంటోంది. మొదట, 25 మంది ఎమ్మెల్యేలతో కూడిన ఒక అసమ్మతి వర్గం, ఆ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయాలన్న పార్టీ విప్‌ను ఉల్లంఘించి, అసెంబ్లీలో ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపింది. ఆ అసమ్మతి వర్గం ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామితో రాజీ పడక ముందే, వారిలో నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి టివికెలో చేరారు. అప్పటి నుండి, అనేకమంది అన్నాడిఎంకె కార్యకర్తలు పార్టీని వీడి టివికెలో చేరుతున్నారు. అన్నాడిఎంకెకు చెందిన నలుగురు మాజీ మంత్రులు పార్టీని వీడి టివికెలో చేరడం ఈ ధోరణిలో తాజా పరిణామం. ఉడుమలై రాధాకృష్ణన్ ఉడుమల్‌పేట నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు. అలాగే, సంపత్ కడలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మూడవ స్థానానికి పరిమితమయ్యారు. అదే విధంగా, కదంబూర్ రాజు కూడా కోవిల్‌పట్టి నియోజకవర్గంలో ఓడిపోయారు. మే 29న, 300 మందికి పైగా అన్నాడిఎంకె సభ్యులు చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న టివికె ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. పార్టీ మారిన వారిలో అన్నాడిఎంకె మాజీ మంత్రులు వెల్లమండి నటరాజన్, ఆనందన్, అలాగే మాజీ ఎమ్మెల్యేలు నటరాజ్ మరియు సాధన్ ప్రభాకర్ ఉన్నారు. అన్నాడిఎంకెను వీడి టివికెలో చేరిన మొదటి కీలక నాయకుడు కె.ఎ. సెంగోట్టయన్. ఎన్నికలకు చాలా ముందు నుండే ఆయన విజయ్‌కు అండగా నిలిచారు.

## ఎపిలోకి నైరుతి రుతుపవనాలు

కేరళ, తమిళనాడులో భారీ వర్షాలు: ఐఎండి



**విశాఖపట్నం/ తిరువనంతపురం / చెన్నై :** ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణశాఖ చల్లటి కబురు అందించింది. ఇప్పటికే కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాలను నైరుతి రుతుపవనాలు తాకినట్టు భారత వాతావరణశాఖ తెలిపింది. ఈ నెల 10వ తేదీకల్లా రాష్ట్రంలోని సగానికి పైగా భూభాగానికి రుతుపవనాలు తాకే అవకాశముందని పేర్కొంది. వచ్చే రెండు.. మూడు రోజుల్లో తొలకరి జల్లు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు గురువారం కేరళను తాకాయి. సాధారణంగా జూన్ ఒకటో తేదీ నాటికి కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించాల్సి ఉండగా మూడురోజులు ఆలస్యంగా చేరుకున్నాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకు రుతుపవనాల సీజన్‌లో 90 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది. ఇదిలా ఉండగా కేరళలోని వివిధ ప్రాంతాల్లో రాత్రంతా కురిసిన భారీ వర్షాలు శనివారం ఉదయం కూడా కొనసాగాయి. దీనివల్ల రోడ్లు జలమయమయ్యాయి, చెట్లు కూలిపోయాయి, ఇళ్లు దెబ్బతిన్నాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. త్రిస్సూర్‌లోని మనలూరులో ఒక తాత్కాలిక షెడ్డుపై చెట్టు పడటంతో అది ధ్వంసమై, దాని కింద నిద్రిస్తున్న 29 ఏళ్ల వ్యక్తి మరణించాడని అగ్నిమాపక, రక్షణ సేవల అధికారి తెలిపారు. మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్ అనే ఐదు జిల్లాల్లో ఐఎండి రెడ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే, పతనంతిట్ట, కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, త్రిస్సూర్, పాలక్కాడ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్, రాష్ట్రంలోని మిగిలిన మూడు జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రెడ్ అలర్ట్ దృష్ట్యా, వయనాడ్, కోజికోడ్, కాసరగోడ్ జిల్లాల్లో పర్యాటక ట్రెక్కింగ్ ప్రాంతాలకు వెళ్లడం, కొండ ప్రాంత రోడ్లపై రాత్రిపూట ప్రయాణం, క్వారీ కార్యకలాపాలపై నిషేధం విధించారు. ఈ మూడ జిల్లాల్లోని విద్యాసంస్థలకు శనివారం సెలవు ప్రకటించారు. నైరుతి రుతుపవనాలు అరేబియా సముద్రంలోని మధ్యపశ్చిమ, మధ్య తూర్పు ప్రాంతాలతో పాటు గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించాయని ఐఎండి తెలిపింది.

**తమిళనాడులోని పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు**

నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో, శనివారం నుండి తమిళనాడులోని పశ్చిమ కనుమల ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వర్గాలు తెలిపాయి. నీలగిరి, తేని, దిండిగల్ జిల్లాలు, కోయంబత్తూరు జిల్లాలోని కనుమ ప్రాంతాలలో అక్కడక్కడా గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రాంతీయ వాతావరణ కేంద్రం శనివారం విడుదల చేసిన తాజా సూచనల ప్రకారం, ఈరోడ్ సేలం, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూరు, వెల్లూరు, రాణిపేట, తిరుప్పూర్, మధురై, విరుదునగర్, కన్యాకుమారి జిల్లాలు, తెన్‌కాసి, తిరునెల్వేలి జిల్లాల కనుమ ప్రాంతాలలో కూడా ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అధిక గరిష్ట ఉష్ణోగ్రతలు, అధిక తేమ కారణంగా తమిళనాడు ఉత్తర తీర ప్రాంతాలలో అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని ఆ నివేదిక పేర్కొంది.

## అధికార దాహంతోనే రాజీనామా చేయడం లేదు

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ :** రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవిలో కొనసాగడం కేవలం ఆయనకున్న అధికార దాహాన్ని మాత్రమే తెలియజేస్తోందని కాంగ్రెస్ మండిపడింది. రాజీపడిన మంత్రిత్వశాఖను నడపడంలో ఆయన అసమర్థుడని ఆరోపించింది. సిబిఎస్ఇ పరీక్షల నిర్వహణలో విద్యా మంత్రిత్వ శాఖ మరింత నిజాయితీని ప్రదర్శించి ఉంటే, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేసిన ఈ మొత్తం గందరగోళాన్ని నివారించి ఉండవచ్చని శనివారం ఎక్స్‌లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. టెండర్‌కు సంబంధించి సైబర్ సెక్యూరిటీ అవసరాలను తీర్చడానికి కో ఎఫ్ట్ సిబిఎస్ఇకి రెండు సైబర్ సెక్యూరిటీ సర్టిఫికెట్లను సమర్పించిందన్న మీడియా నివేదికలను ఉటంకిస్తూ, విద్యా మంత్రిత్వ శాఖలోని రహస్యాలు వేగంగా, తీవ్రంగా బయటపడుతున్నాయి అని రమేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ రెండు సర్టిఫికెట్లు ఇతర క్లయింట్‌లకు సంబంధించినవని ఇప్పుడు వెల్లడైందని, వాటిలో ఒకటి గడువు ముగిసిపోయింది(కోఎఫ్ట్ సమర్పించినప్పుడు అది దాదాపు రెండేళ్ల పాతది). మరొకటి ప్రొడక్షన్ ఎన్విరాన్‌మెంట్‌లోని అప్లికేషన్‌గా కాకుండా తాత్కాలిక అప్లికేషన్‌గా ఆడిట్ చేయబడింది. ఈ మోసాన్ని ఎత్తి చూపడాని కి బదులుగా, సిబిఎస్ఇ అధిక ధరలకు కోఎఫ్ట్‌కు కాంట్రాక్టును అప్పగించిందని ఆయన ఆరోపించారు. ఫిబ్రవరి 2025 నాటికే జెన్‌జెడ్ ఎథికల్ హ్యాకర్లు సైబర్ సెక్యూరిటీలోని కీలక లోపాలను బయటపెట్టారని, అయితే ఇకపై అలా చేయలేని పరిస్థితి వచ్చేవరకు సిబిఎస్ఇ వాటిని ఖండించిందన్నారు. నిజానికి, కోఎఫ్ట్ పోర్టల్ కోలుకోలేని విధంగా దెబ్బతిందని చివరిగా అంగీకరిస్తూ, సిబిఎస్ఇ ఇప్పుడు కోఎఫ్ట్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించడం మానేసి, పునఃమూల్యాంకన ప్రక్రియ కోసం తన సొంత వెబ్‌సైట్‌ను నిర్మించుకుందని మీడియా నివేదికలను ఉటంకిస్తూ ఆయన పేర్కొన్నారు. మంత్రీ ప్రధాన్ పదవిలో కొనసాగడం ఆయనకున్న సిగ్గులేని అధికార దాహాన్ని మాత్రమే తెలియజేస్తుందన్నారు. లోతుగా రాజీపడిన మంత్రిత్వ శాఖను నడుపుతున్న అహంకారి, అసమర్థుడైన కిరాయి వ్యక్తిగా అతను పూర్తిగా బట్టబయలయ్యాడన్నారు.

## రామలింగారెడ్డి రాజీనామా ఆమోదించం

• కర్నాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ • సమస్యను చర్చల ద్వారా అంతర్గతంగా పరిష్కరించుకుంటామని వెల్లడి



**బెంగళూరు :** కర్నాటకలోని నూతన ప్రభుత్వంలో మంత్రులకు శాఖల కేటాయింపుపై కొందరు అలకపూనారు. సీనియర్ మంత్రి రామలింగారెడ్డి తీవ్ర అసంతృప్తితో శుక్రవారం ఆయన పదవికి రాజీనామా చేశారు. అయితే రామలింగ రెడ్డి రాజీనామాను అంగీకరించే ప్రసక్తే లేదని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ శనివారం స్పష్టం చేశారు. ఈ సమస్యను చర్చల ద్వారా అంతర్గతంగా పరిష్కరించుకుంటామని ఆయన పేర్కొన్నారు. రెడ్డి రాజీనామా ప్రకటనతో తలెత్తిన సంక్షోభాన్ని సద్దుమణిగేలా చేసేందుకు కాంగ్రెస్ నాయకత్వం ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏ పరిస్థితుల్లోనూ తాము ఆయన రాజీనామాను అంగీకరించము' అని శివకుమార్ విలేకరులతో అన్నారు. ఆ సీనియర్ నాయకుడిని మంత్రివర్గంలోనే కొనసాగించాలన్న ప్రభుత్వ దృఢ నిశ్చయాన్ని ఆయన దీని ద్వారా సూచించారు. రెడ్డి రాజీనామాకు సంబంధించిన సమాచారం తనకు అందిందని చెప్పిన ముఖ్యమంత్రి, దీనిపై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు చర్చలు కొనసాగుతాయని సంకేతాలిచ్చారు. 'రామలింగ రెడ్డి తన రాజీనామా లేఖను నాకు వాట్సాప్ ద్వారా పంపి ఉండవచ్చు. రాత్రంతా నేను ఇతర పనుల్లో బిజీగా ఉన్నాను. ఏ పరిస్థితుల్లోనూ మేము ఆయన రాజీనామాను అంగీకరించము. నేను ఆయనతో మాట్లాడతాను. అందరితోనూ మాట్లాడతాను' అని ఆయన అన్నారు.

**చర్చల ఫలితం కోసం వేచి చూస్తున్నా : రామలింగారెడ్డి**

తన రాజీనామా విషయంలో కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ మధ్య జరిగే చర్చల ఫలితం కోసం వేచి చూసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కర్ణాటక మంత్రి రామలింగ రెడ్డి శనివారం తెలిపారు. తాను ఎప్పుడూ నిర్దిష్ట శాఖ (పోర్ట్‌ఫోలియో) కోసం అడగలేదని, కేవలం ఇచ్చిన హామీలు నెరవేరకపోవడం వల్లే నిరాశకు గురయ్యానని ఆయన స్పష్టం చేశారు. బెంగళూరు అభివృద్ధి శాఖకు బదులుగా భారీ, మధ్య తరహా నీటి పారుదల శాఖను కేటాయించడంతో శుక్రవారం రాజీనామా ప్రకటించిన ఈ సీనియర్ కాంగ్రెస్ నేత, సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి శివకుమార్, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలాతో సహా పార్టీ అగ్రనేతలు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. రాజీనామాను ఉపసంహరించుకోవాలని సూర్జేవాలా కోరారు అని అని విలేకరులతో చెప్పిన రెడ్డి, తన రాజీనామాను ఆమోదించబోమని పార్టీ అధిష్టానం తనకు తెలియజేసిందని పేర్కొన్నారు.

## రాష్ట్రపతిపాలనను అడ్డుకునేందుకే...

టివికె మద్దతుకు కూటమి పార్టీలకు అనుమతిచ్చాం : స్టాలిన్




**చెన్నై:** తమమిళనాడులో ష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడాన్ని అడ్డుకోవాలనే ఏకైక ఉద్దేశంతోనే, ప్రభుత్వం ఏర్పాటులో టివికెకు మద్దతు ఇచ్చేందుకు తమ కూటమి భాగస్వామ్య పార్టీలను అనుమతించామని డిఎంకె అధినేత ఎం.కె. స్టాలిన్ పేర్కొన్నారు. శనివారం చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో అన్నాడిఎంకె కార్యకర్తలు డిఎంకెలో చేరారు. వారికి స్టాలన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కూటమి పార్టీలు తమ ప్రణాళికల గురించి నాకు చెప్పినప్పుడు, 'మీరు వెళ్ళవచ్చు, అది మీ ఇష్టం, ప్రజాస్వామ్య హక్కు; నేను మిమ్మల్ని ఆపను' అని వారితో చెప్పాను. తమిళనాడులో బిజెపి పాలనకు దారితీసే అవకాశం ఉన్న రాష్ట్రపతి పాలనను నివారించాలనే ఏకైక ఉద్దేశంతోనే వారిని వెళ్ళనిచ్చాను. డిఎంకె అధికారంలోకి రావాలని నమ్మిమాతో జతకట్టిన కూటమి పార్టీల మద్దతు వల్లే ఈ ప్రభుత్వం నేడు నడుస్తోంది' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం టివికెకు మద్దతు ఇస్తున్నట్లు డిఎంకె అధ్యక్షుడికి తెలియజేశామని కూటమి పార్టీల నాయకులు స్వయంగా వివిధ వేదికలపై చెప్పారని స్టాలిన్ పేర్కొన్నారు. 'కేవలం మన కూటమి మద్దతుతోనే కొనసాగుతున్న ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని ఈ కార్యక్రమంలో మనం ప్రతిజ్ఞ చేద్దాం' అని ఆయన అన్నారు. 'గెలుపోటములు సహజం. విజయం వరించినప్పుడు ఉప్పొంగిపోవడం గానీ, ఓటమి ఎదురైనప్పుడు నిరాశ చెందడం గానీ మేము చేయము' అని ఆయన అన్నారు.

# భారత్‌పై ఆంక్షలు పెడితే వెంటనే బెడిసి కొడతాయ్

## రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరిక

**సెయింట్‌పీటర్స్‌బర్గ్:** భారత్‌పై ఆంక్షలు పెట్టిన వాళ్ళకే తిరిగి తీవ్ర నష్టం జరుగుతుందని రష్యా అధ్యక్షుడు వ్లా దిమీర్ పుతిన్ అన్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ ఆర్థిక వేదిక సమావేశం సందర్భంగా పిటిఐ సహా ప్రపంచ ప్రముఖ మీడియా సంస్థల అధిపతులతో శుక్రవారం ఇష్టాగోష్టిలో అనేక ప్రశ్నలకు సమాధానాలు చె ప్పారు. ఈ సందర్భంగా ఒక ప్రశ్నకు జవాబు చెబుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఉన్న భారతదేశంపై ఆంక్షల పేరుతో ఆ దేశ సార్వభౌమాధికారా న్ని కించపరచి,నష్టం కలిగించే ఎలాంటి ప్రయత్నం జరిగినాగానీ నష్టం కలిగించే ప్రయత్నం చేసదేశాలకే తిరిగి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, వారికే మళ్ళీ బెడిసి కొడుతుందని అన్నారు.''భారతదేశం ఎప్పటికీ మోదీ నాయకత్వంలో ఒక సార్వభౌమాధికారదేశంగానే ఉంటుందని, ఎంతశక్తిమంతమైన ఆంక్షల బెదిరింపులైనా గానీ బెదిరించినవారికే వెంటనే తిరిగి బెడిసికొడతాయని అన్నారు. మోదీ ప్రధానమంత్రిగా లేని సమయంలో అమెరికా ప్రవేశంపై నిషేధం విధించిన ఘట్టాన్ని ఆయన గుర్తుచేసుకుంటూ ఆనాటి నుండి తమ మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయని, ఆయన ఈనాడు దేశ ప్రధానమంత్రిగా ఉన్నందువల్ల ఆక్షలు ఎత్తివేశారని, భారత్ ఎప్పుడూ సార్వభౌమాధికారదేశంగా ఉంటుందన్నారు. రష్యా నుండి ఎస్‌యు–57 ఎస్–500 గగనతల వ్యవస్థలను కొనుగోలు చేస్తే భారత్ మళ్ళీ అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటుందా?



అని ప్రశ్నించినప్పుడు, భారత్ సార్వభౌమాధికారంగల దేశమని మరోసారి ఉద్ఘాటిస్తూ, తమకు అవసరమైన,అనుకూలమైన విధానాలను భారత్ అవలంబిస్తుందని, తాము అత్యుత్తమ ధరలకు వాటిని అందిస్తామని, ఎవరు చెప్పినా ఈ విషయంలో రాజీ ఉండదని అన్నారు. భారత్ ఎప్పుడూ తన జాతీయ ప్రయోజనాలనే చూసుకుంటుందని అన్నారు. భారత్‌కు రష్యా సహకారంపై మాట్లాడుతూ, ఇతర రష్యా భాగస్వామ్య దేశాల తరహాలోనే ఈ సహకారం ఉంటుందని, ఇది రాజకీయ వాతావరణంతో ముడిపడి లేదని చెప్పారు. ''మమ్మల్ని ఎవరూ నియంత్రించలేరు, ఎవ్వరూ మాకు ఆదేశాలు ఇవ్వలేరు, అలాంటి ప్రయత్నం చేయలేరు, మేం ఎప్పటికీ సరైన మార్గంలోనే ప్రయాణం చేస్తాం, ప్రత్యేకించి భారత్ వంటి భాగస్వామి విషయంలో ఇచ్చిన హామీలకు ఎప్పటికీ కట్టుబడి ఉంటాం, సరైన దిశగా ఆలోచిస్తాం'' అని పుతిన్ చెప్పారు. రెండు దేశాలూ బ్రహ్మోస్ డిజైన్‌పై కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఎస్‌యు–57 ఐదవ తరం సుఖోయ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను తరారు చేయడంపై ఉమ్మడి ప్రతిపాదన చేశామని, కానీ ఆ తర్వాత స్వతంత్రంగా చేయాలని నిర్ణయించామన్నారు.

# సెయింట్ పీటర్స్‌బర్గ్‌పై మళ్ళీ ఉక్రేన్ దాడి

## 140 డ్రోన్లు కూల్చివేత



**కీవ్:** సెయింట్ పీటర్స్‌బర్గ్‌పైన, ఆ పరిసర ప్రాంతాలపైన ఉక్రేన్ మరోసారి దాడి చేసింది. అంతర్జాతీయ ఆర్థిక ఫోరం సమావేశం సందర్భంగా మొదటి రోజు శుక్రవారంనాడు భారీ ఎత్తున డ్రోన్లతో దాడి చేసింది. ఈ సమావేశాల చివరిరోజున శనివారం మరోసారి దాడి చేసింది. ఈ దాడులను రష్యా అసాధారణమైనవిగా పేర్కొంది. తమ బలగాలు రష్యా ఆయుధ గారాలు, నావికా బలగాలపైన కూడా దాడులు చేశాయని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. 500 కి.మీ దూరంలో ఉన్న దక్షిణ ఖెర్సాన్‌లోని ఒక చమురు డిపోపై కూడా తమ డ్రోన్లు దాడులు చేశాయని చెప్పారు. తమ సామర్థ్యాన్ని విస్తరించుకున్నామన్నారు. యుద్ధం ముగించాల్సిన సమయం వచ్చిందని, చర్చలు అవసరమని జెలెన్స్కీ పిలుపు ఇచ్చారు. దీనిని పుతిన్ తిరస్కరించారు. ఉక్రేన్‌తో ఒక శాంతి ఒప్పందం కుదిరేవరకూ అసలు జెలెన్స్కీతో చర్చల ప్రసక్తి, ఆయనను కలుసునే అవసరమే ఉండదని పుతిన్ తిరస్కరించిన తర్వాత శనివారంనాడు ఉక్రేన్ మరోసారి భారీ ఎత్తున సెయింట్ పీటర్స్‌బర్గ్‌పై డ్రోన్లతో దాడులు చేసింది. ఉక్రేన్ అధికారులు శనివారం ఈ విషయం చెబుతూ, ఇది పెరిగిన ఉక్రేన్ డ్రోన్ సామర్థ్యానికి చిహ్నమని పేర్కొన్నారు. కాగా సెయింట్ పీటర్స్‌బర్గ్ గవర్నర్ అలెగ్జాండర్ బెగ్లోవ్ ఒక ప్రకటన చేస్తూ మొబైల్ ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి ఆటంకాలు కలిగినా ప్రజలు వీధుల్లోకి రావాలని సలహా ఇచ్చారు. రీజినల్ గవర్నర్ అలెగ్జాండర్ డ్రోజ్‌డెంకో మాట్లాడుతూ 141 డ్రోన్లను లెనిన్‌గ్రాడ్ ఆ పరిసర ప్రాంతాలలో రష్యా కూల్చివేసిందని చెప్పారు. ఇదిలా ఉండగా ఖెర్సాన్ ప్రాంతంలో రష్యా చేసిన దాడుల్లో ఐదుగురు మరణించారు.

# ఆర్మేనియా పయనం ఎటువైపు?

## నేడు నిర్ణయాత్మక ఎన్నికలు





**ఎరెవాన్:** పశ్చిమాసియాదేశం ఆర్మేనియాలో పార్లమెంటుకు ఆదివారం ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. 1991లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత జూన్ ఏడో తేదీన మొదటిసారి ఆ దేశంలోపార్లమెంటు ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. ఆర్థికంగా ఆర్మేనియా పూర్తిగా రష్యాపై ఆధారపడి ఉందన్న విషయం ప్రస్తుత ప్రధానమంత్రి నికోల్ షాహిన్యాన్‌కు తెలిసినప్పటికీ ఆర్మేనియాను యూరప్‌వైపు మళ్ళించాలనే ఆయన విధానానికి ఈ ఎన్నికలు ఒక పెద్ద పరీక్షగా మారాయి.ఆర్మేనియాపై రష్యా పట్టు కోల్పోతుందని ఆయన వర్గం చేస్తున్న ప్రచారం మధ్య రష్యా మద్దతుగల ప్రతిపక్ష నాయకుడు సామ్వెల్ కరపెట్యాన్ విస్తృత ప్రచారం చేస్తూ ప్రజల మద్దతు కూడగడుతున్నారు. షాహిన్యాన్ మాత్రం ఆర్మేనియా గుర్తింపును పునర్నిర్మించాలని యత్నిస్తున్నారు. 2023లో ఆర్మేనియా తన పర్వతప్రాంత కరాబాఖ్ భూభాగాన్ని అజర్‌బైజాన్‌కు కోల్పోయింది. ఈ భూభాగంకోసం 1990వ దశకంలో పోరాటం జరిగింది. ఈ అంశమే ఆర్మేనియా జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకఅంశంగా, ఆనాడు ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపించే అంశంగా మారిపోయింది. ఈ భూభాగాన్ని నిశ్చయంగా కోల్పోవడంతో జాతీయవాదానికి పునాది లేకుండా పోయిందనే వాదన మొదలైంది. ఈ ఎన్నికలకు ముందు గత ఏడాది ఆగస్టునెలలో వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో ఆర్మేనియా,అజర్‌బైజాన్ మధ్య ఒక శాంతి ఒప్పందం జరిగినప్పటికీ దానిపై సంతకాలు మాత్రం ఇంకా జరగలేదు. ఆర్మేనియాపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేసేందుకు అజర్‌బైజాన్,టర్కీలు చర్యలు తీసుకున్నాయి. ఆర్మేనియాలో ఎన్నికల తర్వాతే ఒక కొత్త రాజ్యాంగాన్ని రచించేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరగనున్నది.

# సహారా నిషేధ మార్గంలో ఆగిపోయిన లారీ..

## దాహంతో అలమటించి 50 మంది మృతి



**అస్సామాకా:** ఉత్తర ఆఫ్రికాలో లిబియా–ఆల్జీరియా మధ్య అత్యంత ప్రమాదకరమైన నిషేధిత సహారా ఎడారి మార్గంలో ఒక వాహనం చెడిపోవడంతో అందులో వెళుతున్న దాదాపు 50 మంది ప్రయాణికులు భయంకరమైన వేడి, ప్రతికూల వాతావరణం మధ్య చిక్కుకుని మరణించారు. వాహనం చెడిపోయిన తర్వాత అందులోని ప్రయాణికులు 15 రోజులపాటు నిర్మానుష్యప్రాంతంలో నిప్పులు కక్కే ఎండ వేడిలో ఉడిపోయారు. ఎన్ని రోజులు వారు సజీవంగా ఉన్నారనే విషయం తెలియలేదుగానీ, గొంతు తడుపుకోవడానికి చుక్కనీరు కూడా పరిసరాల్లో లభించలేదు. దాంతో వారు శలభాల్లా మాడి శవాలుగా మారారు. హృదయవిదారకమైన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆల్జీరియా సరిహద్దుల్లో ఉన్న మాలీ దేశంలోని టెల్వాండెక్ పట్టణం నుండి 50 మంది పైగా ప్రయాణికులతో బయలుదేరిన లారీ నిర్దేశిత మార్గంలో వెళ్ళకుండా దారితప్పిందని, వాహనం చెడిపోవడంతో ప్రయాణికులు మృత్యువాత పడ్డారని అగాడెజ్ గవర్నర్ మేజర్ జనరల్ ఇబ్రా బౌలమా ఇస్సా చెప్పారు. వాహనం బాగు చేయడానికి డ్రైవర్ చాలా రోజులపాటే ప్రయత్నించి ఉంటాడని అన్నారు.

వారు ప్రయాణిస్తున్న వాహనం చెడిపోవడంతో ఇద్దరు ప్రయాణికులు మాత్రం ఎంతో ధైర్యంచేసి 80 కి.మీ దూరం నడుచుకుంటూ వెళ్ళి మధ్యలో ఒకచోట దాహం తీర్చుకుని ఆ తర్వాత ఉత్తర నైజర్‌లోని అస్సామాకా పట్టణానికి చేరుకుని అధికారులకు సమాచారం చేరవేశారు. హుటాహుటిన అధికారులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని చూస్తే వారు ప్రయాణించే వాహనం చుట్టూ మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గమనించారు. ఆధునిక మానవ చరిత్రలో అరుదైన ఈ సంఘటన అందరినీ కలచివేసింది. ప్రపంచంలోనే అత్యంత తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యే నిషేధిత ప్రయాణ ప్రాంతంగా ఇది ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతం గురించి అందరికీ తెలిసినందువల్ల సర్వసాధారణంగా ఈ మార్గంలో ఎవ్వరూ ప్రయాణం చేయరు. ఈ విధమైన మరణాలు లిబియా లేదా ఆల్జీరియాకు వెళ్ళే ప్రయాణ ప్రాంతంలో అసాధారణమైన విషయం కాదని, ఈ మార్గంలో వెళ్ళే వాహన డ్రైవర్లకు ఎడారి దాటడం కష్టమని తాము ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రతికూల వాతావరణంపట్ల అవగాహన కల్పిస్తూనే ఉంటామని స్థానిక స్వచ్ఛంధసేవా సంస్థ అధిపతి చెహువో అజీజౌ చెప్పారు.ఈ ప్రయాణ బృందంలో కేవలం ఇద్దరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని చెప్పారు. ''ఎన్నో సంవత్సరాలుగా మేం ఈ మార్గంలో ప్రయాణం చేయవద్దని చెబుతున్నాం, ప్రయాణాలను వ్యతిరేకిస్తున్నాం, ఐనాగానీ ప్రయాణాలు జరుగుతున్నాయి, మరణాలు సహజంగా మారాయి,ఇప్పుడు ఈ సంఖ్య చాలా పెద్దది, లిబియా–ఆల్జీరియా మధ్య ఇలాంటి కేసులు జరుగుతూ ఉంటాయి, కానీ వీరు మాలీ నుండి నైజర్‌కు వెళ్ళేందుకు ఈ మార్గంలో ప్రయాణం చేశారు అని అజీజౌ చెప్పారు.

## ఇజ్రాయెల్ గగనతల దాడుల్లో

# లెబనాన్ సైనికులు సహా తొమ్మిదిమంది మృతి



**బీరూట్:** ఇజ్రాయెల్ సైన్యం చేసిన గగనతల దాడుల్లో ముగ్గురు లెబనాన్ సైనికులు సహా తొమ్మిదిమంది దక్షిణ లెబనాన్‌లో మరణించారు. లెబనాన్ సైన్యంలోని ముగ్గురు నబతియేహ్ నగరంలో రహదారిపై కారులో వెళుతుండగా దాడుల్లో మరణించారు. అదేవిధంగా సక్సాకియేహ్ గ్రామంలో మరో ఆరుగురు మరణించగా నలుగురు గాయపడ్డారు. పదే పదే లెబనాన్‌లో ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది. తమ ప్రజలు, సైన్యంపై అదే పనిగా జరుగుతున్న దాడులు తమ ధృఢ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని ఆర్మీ ప్రకటించింది. ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య వాషింగ్టన్‌లో నాలుగో విడత చర్చల్లో శాంతి ఒప్పందం కుదిరినాగానీ దాడులు ఆగలేదు. హెజ్బొల్లా సైన్యం ఉత్తర ఇజ్రాయెల్‌పై దాడులు ఆపితేనే తాము కూడా యుద్ధం ఆపుతామని ఐడిఎఫ్ సైనికులు చెబుతున్నారు. హెజ్బొల్లా ఇదే విషయం చెబుతున్నది. ఈ నేపథ్యంలో పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ గనుక సమగ్ర ఒప్పందానికి వస్తే దక్షిణ లెబనాన్ నుండి తాము వైదొలగుతామని హెజ్బొల్లా అగ్రనాయకత్వం ప్రకటించింది. మరోవైపు ఇరాన్ విదేశీవ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్‌కు ఒక విజ్ఞప్తి చేస్తూ నిజమైన శత్రువు నుండి తమ దేశాన్ని కాపాడాలని కోరారు. అదే సమయంలో ఔన్ కూడా ప్రకటన చేస్తూ తమ దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని ఇరాన్‌కు హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో దౌత్యం ఒక్కటే సమస్యను పరిష్కరిస్తుందని హెజ్బొల్లాకు కూడా తెలియజేశారు.మార్చి రెండో తేదీన లెబనాన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ 3,500 మంది మరణించారు. మరో 29 మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించారు.

# వేలాది ఫోన్లు ట్యాప్ చేశారు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంపి చామల సంచలన వ్యాఖ్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, మీడియా సంస్థల అధినేతలు, సినీ ప్రముఖులతో పాటు వేలాది మంది ఫోన్లు ట్యాప్ చేశారని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా శనివారం సిట్ అధికారుల ఎదుట హాజరైన అనంతరం ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సిట్ అధికారులు తనను విచారణకు పిలిచారని, 2023 జూలైలో తన ఫోన్ ట్యాప్ అయినట్లు తమకు లభించిన ఆధారాల ప్రకారం వివరించారని చామల తెలిపారు. ఆ సమయంలో తాను టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్‌గా పని చేస్తూ, అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉండటంతో తన ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు అధికారులు చెప్పారని పేర్కొన్నారు.అధికారాన్ని నిలబెట్టుకోవడానికే ప్రతిపక్ష నాయకుల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించిన ఆయన, బిఆర్‌ఎస్ నేతలతో పాటు వారి కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా నిఘాలో ఉన్నాయని అన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు ఫోన్ కూడా ట్యాప్ అయిందని, అందుకే ఆయన తన డ్రైవర్, పిఎలను మార్చుకున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత కూడా తన ఫోన్ ట్యాప్ అయిన విషయాన్ని బహిరంగంగానే చెప్పారని గుర్తు చేశారు. అధికార దుర్వినియోగంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను మించిన వారు లేరని విమర్శించిన చామల, రాష్ట్రంలో స్వేచ్ఛను హరించి అన్ని వ్యవస్థలను అధికార ప్రయోజనాల కోసం వినియోగించారని ఆరోపించారు. 2018లో భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చినప్పటికీ ఎవరికి మంత్రి పదవులు ఇవ్వాలన్నది కూడా ఫోన్ ట్యాపింగ్ ఆధారంగా తెలుసుకునే ప్రయత్నం చేశారని వ్యాఖ్యానించారు.సిట్ దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న విషయాలు ప్రజలు వింటే ఆశ్చర్యపోతారని, వేలాది ఫోన్లను ట్యాప్ చేసి వ్యక్తిగత సంభాషణలను కూడా విన్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారందరికీ చట్టపరమైన శిక్ష పడాల్సిందేనని డిమాండ్ చేశారు.అలాగే బిఆర్‌ఎస్ నేతలు నీతులు చెప్పడం మానుకోవాలని, పదేళ్ల పాలనలో మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు.

# ఫ్యూచర్ సిటీ నిర్మిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు ఐటి శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసనమండలి చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపిలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు చల్లా నరసింహారెడ్డి, మల్‌రెడ్డి రామిరెడ్డిలతో కలిసిభూమి పూజ చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగసభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు, కార్యకర్తలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందన్నారు. నాడు కొత్తపేట నుండి పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లురేకుల షెడ్లు వేశారన్నారు. ఆ షెడ్లు గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు పిసిసి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, పూలు కూరగాయలు, మాంసం, పెండ్లి, కార్యం చేస్తే ఇక్కడికి వచ్చిన వారికి అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అని తెలిపారు. ఇక ప్రభుత్వానికి ఆదాయం



సమకూర్చిపెట్టే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని, అక్కడ తాగేందుకు నీళ్లు ఉండవు, కూర్చునేందుకు కుర్చీలు, సరిపడ స్థలం ఉండదు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 39 సబ్ రిజిస్టర్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నామన్నారు. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాలు రూ.500 బోనస్ ఇస్తున్నాం. మీరు విధ్వంసం చేసిన వికాసం వైపు నడిపిస్తున్న, సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నన్నారు. కష్టాలున్నాయ్, నిధుల కొరత, అప్పులు ఉన్నయ్, వయసు చిన్నదైనా, తెలంగాణ ప్రజలు నమ్ముకుని ఈ బాధ్యత అప్పజెప్పారు కనుక రోజుకు 18 గంటలు పని చేస్తూ, ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. తాను మీలాగే మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చినవాడిని కాబట్టి, కష్టమైనా నష్టమైనా.. మీరందరిచ్చిన ధైర్యంతో ఫామ్ హౌస్‌లో పండుకున్న కేడితోనైన, ఢిల్లీలో ఉండే మోదీతోనైనా ధైర్యంగా నిలబడి కొట్లాడుతానని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం: మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మృగశిర కార్తె సందర్భంగా చేప ప్రసాదం స్వీకరించేందుకు దేశ నలుమూలల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తరఫున చేసే ఏర్పాట్లను పకడ్బందీగా ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 8 వ తేదీ మృగశిర కార్తె సందర్భంగా అస్తమా వ్యాధిగ్రస్తులకు వేసే చేప ప్రసాదం పంపిణీ పై నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాట్లను సహచర మంత్రులు వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డిలతో కలసి అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పర్యవేక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీకి సంబంధించిన కౌంటర్లు, భారీకేడ్ లను పరిశీలించి క్యూలైన్‌లో వచ్చే భక్తులకు వేసవి దృష్ట్యా ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చేప ప్రసాదం పంపిణీ 8 వ తేదీ రాత్రి 9 గంటలకు ప్రారంభమై 9 వ తేదీ రాత్రి వరకు నిరంతరంగా చేప ప్రసాదం పంపిణీ చేయడం జరుగుతుందని, చివరి వ్యక్తి వరకు ప్రసాదం అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నాణ్యమైన కొర్రమీనుచేప పిల్లలు లక్షా నలుబై వేలు వరకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచడం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

# భారీ నిరసన

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సహా తమ డిమాండ్లను పరిష్కరించడం కంటే, తమ సంస్థ సోషల్ మీడియా కార్యకలాపాలపైనే ప్రభుత్వం దృష్టి సారిస్తోందని విమర్శించారు. మతతత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తూ, దేశాన్ని, మహాత్మా గాంధీని, బి.ఆర్.అంబేద్కర్‌ను కీర్తిస్తూ నినాదాలు మాత్రమే చేయాలని దీప్కే వారికి సూచించారు. తాను అమెరికాకు వెళ్లినప్పటి కంటే తిరిగి వచ్చినప్పుడే తన తల్లి ఎక్కువగా ఏడ్చిందని, ఎందుకంటే భారతదేశానికి తిరిగి వస్తే తనను అరెస్టు చేస్తారేమోనని ఆమె భయపడిందని సిజెపి వ్యవస్థాపకుడు అన్నారు. ఇది కేవలం మా అమ్మ భయం మాత్రమే కాదు, రాజకీయాల గురించి మాట్లాడే ఏ యువకుడి తల్లిదండ్రులకైనా ఉండే భయం ఇది.... మనం ఇంకెంతకాలం ఈ భయంతో బ్రతకాలి? మేము భయపడటం లేదని వారికి చెప్పండి అని ఆయన అన్నారు. 'మిత్రులారా, ఇది ఒక సుదీర్ఘ పోరాటం. మేము సోషల్ మీడియాలో ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేయడం ప్రారంభించి నెల రోజులు అయింది, కానీ ఈ వ్యక్తులు ఎంత సిగ్గులేని వారంటే, చర్యలు తీసుకోవడానికి బదులుగా, మా ఖాతాలను హ్యాక్ చేయడం, మా పోస్టులను తొలగించడం వంటి ఇతర విషయాలపై దృష్టి సారించారు. మీరు మా పోస్టులను తొలగించగలరేమో కానీ, మమ్మల్ని ఈ వేదిక నుండి చెరిపివేయలేరు' అని దీప్కే ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ పేర్కొన్నారు. ఆయన మాటలకు ప్రజలు ఉత్సాహంగా మద్దతు తెలిపారు. శనివారం ఉదయం ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న క్షణాలను గుర్తుచేసుకుంటూ, తన విమానం దిగడానికి కొద్ది క్షణాల ముందు, తాను తన స్వేచ్ఛకు చివరి క్షణాలను గడుపుతున్నట్లుగా భావించానని దీప్కే అన్నారు. ఈ ఆశయం కోసం స్వేచ్ఛను త్యాగం చేయడానికి తాను పూర్తిగా సిద్ధమయ్యానన్నారు. జైలు శిక్ష భయంతో చాలా మంది తమను తాము రాజీపడి అమ్ముకున్నారని సిజెపి వ్యవస్థాపకుడు ఆరోపించారు. కానీ ఈ దేశపు యువత అమ్ముడుపోలేదని ఉద్ఘాటించారు. దీంతో జనసమూహం నుండి పెద్ద ఎత్తున హర్షధ్వానాల వ్యక్తమయ్యాయి. ఉదయాన్నే ఢిల్లీకి చేరుకున్న దీప్కే, తన మద్దతుదారులను క్రమశిక్షణ పాటించాలని, నిరసన శాంతియుతంగా కొనసాగేలా చూడాలని కోరారు. ఈ నిరసనకు మద్దతు తెలిపిన కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, ఒకవేళ దీప్కేను అరెస్టు చేస్తే తాను ఆరు వారాల పాటు నిరాహార దీక్ష చేపడతానని పేర్కొన్నారు. కాగా, 'జంతర్ మంతర్ వద్ద మద్దతుదారులను కలవడం పట్ల దీప్కే ఉత్సాహం వ్యక్తం చేశారు. ఒక పుస్తకం, జాతీయ జెండాను తీసుకురావాలని ఆయన వారిని ప్రోత్సహించారు. ఈ ఉద్యమాన్ని ప్రేమ, శాంతితో నడిపించాలని నొక్కి చెబుతూ, కరుణ, కృతజ్ఞతకు చిహ్నంగా పోలీసు సిబ్బందికి పూలు సమర్పించాలని ఆయన పాల్గొనేవారిని ఎక్స్ వేదికగా కోరారు. యువత, వారి శాంతియుత నిరసన తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని వాంగ్‌చుక్ అన్నారు. నిరసన జరపడానికి ప్రభుత్వం అనుమతించడాన్ని కూడా ఆయన అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సృజనాత్మక వ్యక్తీకరణలకు ప్రభుత్వం అనుమతిస్తుందని నేను ఆశిస్తున్నాను' అని ఆయన అన్నారు. వాంగ్‌చుక్, దీప్కేను 'బొద్దింకల అధిపతి' అని పిలుస్తూ అతనికి ధన్యవాదాలు తెలిపారు. నిరసనకారులతో, మీరు ఇంట్లో కూర్చొని ఏడవలేదు, అలాగే రోడ్డుపై ఎలాంటి గందరగోళం సృష్టించడం లేదు అని అన్నారు. నిరసనకారులు రాజ్యాంగ ప్రతులు, భారత జెండాను పట్టుకోగా, కొందరు పువ్వులు తెచ్చారు. దీప్కే అస్వస్థతకు గురవడంతో మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో నిరసన ముగిసింది.

### కట్టుదిట్టమైన భద్రత

జంతర్ మంతర్ వద్ద బొద్దింక జనతా పార్టీ (సిజెపి) సభ్యులు తమ నిరసనను ప్రారంభించడంతో దేశ రాజధానిలోని కీలక ప్రదేశాలలో ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. అంతకుముందు, జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టడానికి తమకు అనుమతి లభించిందని సిజెపి ప్రకటించింది.కాగా, సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నేతృత్వంలో జరుగుతున్న ఈ నిరసన కారణంగా, సెంట్రల్ ఢిల్లీ, ఇందిరా గాంధీ అంతర్జాతీయ (ఐజిఐ) విమానాశ్రయం, ప్రధాన రైల్వే స్టేషన్లు, అంతరాష్ట్ర బస్ టెర్మినల్లు, నగరాన్ని పొరుగు రాష్ట్రాలతో కలిపే సరిహద్దు ప్రవేశ మార్గాల వద్ద భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఢిల్లీ పోలీసులకు సహాయపడటానికి సుమారు 40 కంపెనీల పారామిలిటరీ బలగాలను మోహరించినట్లు వర్గాలు తెలిపాయి. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడానికి వివిధ జిల్లాలకు చెందిన జాయింట్ కమిషనర్లు ఆఫ్ పోలీస్, డిప్యూటీ కమిషనర్లు ఆఫ్ పోలీస్, అదనపు డిసిపిలు, ఎసిపిలతో సహా సీనియర్ అధికారులను క్షేత్రస్థాయి విధులకు నియమించారు. సున్నితమైన ప్రదేశాలలో పలు దఫాలుగా బారికేడ్లు ఏర్పాటు చేయగా, సెంట్రల్ ఢిల్లీ, నగరంలోని ఇతర వ్యూహాత్మక ప్రదేశాలకు దారితీసే మార్గాలలో వాహనాల తనిఖీలను చేశారు.

# డ్రోన్లు కూల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

డ్రోన్ దాడులు చేసింది. ఇరాన్ ఏడు క్షిపణులు ప్రయోగించిందని, వీటిల్లో ఆరు క్షిపణులను కూల్చివేశామని అమెరికా సైనిక విభాగం సెంట్‌కామ్ ప్రకటించింది. ఇరాన్ డ్రోన్లు బీభత్సం సృష్టించకుండా అడ్డుకున్నామని తెలిపింది. శనివారం బహ్రైన్ ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తూ, కువైట్ సహా తమ రెండు దేశాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు,డ్రోన్లు ప్రయోగించిందని పేర్కొంది. తాము తక్షణం స్పందించి గల్ఫ్ మిత్రదేశాలను అప్రమత్తం చేశామని, దాడులను అడ్డుకున్నామని పేర్కొంది. హోర్ముజ్ జలసంధి దిశగా ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను, డ్రోన్లను కూల్చివేశామని, ఇరాన్ కోస్తా రాడార్ కేంద్రాలపై ఎదురు దాడులు చేశామని అమెరికా సైన్యం ప్రకటించిన కొద్దిసేపటికే బహ్రైన్ ప్రభుత్వం కూడా ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను అడ్డుకున్నట్లు ప్రకటించింది. యుద్ధం ముగించేందుకు ఒక ఒప్పందం చేసుకోవాలని ఇరాన్‌పై మరింత ఒత్తిడి అమెరికా నుండి పెరిగిన పూర్వరంగంలో ఐఆర్‌జిసి ఈ దాడులు చేసింది. ఆరు ఇరాన్ క్షిపణులను తాము కూల్చివేయగా ఏడో క్షిపణి మాత్రం తన లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమైందని అమెరికా ప్రకటించింది. కువైట్‌లో అమెరికా దళాలకు కేంద్రంగా ఉన్న అలీ అల్–సలీం వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ పేర్కొంది. మరోవైపు హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతోంది. ఇరాన్ ఓడరేవుల్లోకి నౌకలను రాకుండా సెంట్‌కామ్ అడ్డుకుంటున్నది. ప్రపంచవ్యాప్తంగా చమురు ఎగుమతులకు ఈ ఓడరేవులు కీలకమైన కారిడార్‌గా నిలిచింది. ఈ దిగ్బంధనం చివరకు డోనాల్డ్ ట్రంప్‌కు, ఆయన రిపబ్లికన్ పార్టీకి ఈ ఏడాది నవంబరులో మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో అంతర్గతంగా అతిపెద్ద రాజకీయ సమస్యగా మారింది.

### యుద్ధం త్వరగా ముగిస్తాం ఎరువుల ధరలు తగ్గుతాయ్:ట్రంప్

అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం త్వరగా ముగిస్తామని డోనాల్డ్ ట్రంప్ శనివారం చెప్పారు. రోజు రోజుకూ ట్రంప్ మరిన్ని చిక్కుల్లో పడుతూ, కాల్పుల విరమణ ఒప్పందం గాలికి కొట్టుకుపోయే పరిస్థితి వచ్చినాగానీ, విస్కాన్సిన్‌లో రైతులతో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్‌తో పరిస్థితులన్నీ సజావుగానే సాగుతున్నట్టు కనిపిస్తోందన్నారు. నాలుగు నెలల క్రితం మాదిరిగానే దేశంలో ఎరువుల ధరలు గణనీయంగా తగ్గిపోతాయన్నారు. చాలా కఠినమైన మార్గమైనా, సంక్లిష్టమైనాగానీ, తాము చాలా సులభమైన పద్ధతిలో ఇరాన్ సమస్య నుండి బయటకు వస్తామని, మంచి ఒప్పందం చేసుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. వారు ఎన్నడూ చేయకూడదనుకున్న పనులు చేయాల్సి వస్తోందని, అందుకు వారికి సమయం పడుతుందని అన్నారు. ఇరాన్ వద్ద ఇప్పటికీ 22 శాతం మేరకు క్షిపణులు ఉన్నాయని చెప్పారు. ఇరాన్‌లో శిథిలాల్లో కూరుకున్న శుద్ధిచేసిన యురేనియంను తాము ఇప్పుడంటే ఇప్పుడు లేదా ఎప్పుడు కావాలంటే అప్పుడే వెలికితీసుకుంటామని, తమను ఎవరూ అడ్డుకోలేరని, అందువల్ల యురేనియం ప్రాధాన్యతాంశం కాదని అన్నారు. ఇరాన్‌తో మరో 60 రోజులు కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించడానికి,ఇరాన్ అణు కార్యక్రమంపై కొత్త విడతల చర్చలు ప్రారంభించడానికి వారం రోజుల క్రితం ఒక తాత్కాలిక ముసాయిదాపై ఒప్పందానికి చేరువైన తర్వాత ఈ ఎంఓయులో మార్పులు చేయాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. అదేవిధంగా నాలుగో విడత చర్చల్లో లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని హెజ్బొల్లా తిరస్కరించింది. లెబనాన్ నుండి ఇజ్రాయెల్ వైదొలగితే తాము దక్షిణ లెబనాన్ నుండి వైదొలగుతామని పేర్కొంది.

గడచిన మూడు,నాలుగు రోజులుగా అమెరికా–ఇరాన్ పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఆత్మరక్షణ దాడులు పేరుతో అమెరికా మొదట కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులు చేయగా, గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలపై ఇరాన్ కూడా మళ్ళీ దాడులు ప్రారంభించి ఆత్మరక్షణకోసమే దాడి చేశామని ప్రకటించింది. ఇక తర్వాత ఈ దాడులు శనివారం కూడా కొనసాగాయి. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా కుప్పకూలిపోతుందని ప్రపంచదేశాల్లో ఆందోళన ప్రారంభమైంది. ఈ వారారంభంలో కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల భవంతిపై ఇరాన్ క్షిపణి దాడి జరగడంతో ఒక భారతీయుడు మరణించాడు.

# తొలి రోజు భారత్‌దే ఆధిపత్యం!

## కెఎల్ రాహుల్, గిల్ శతకం..

అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో భారత బ్యాటర్లు దుమ్మురేపారు. శనివారం ముల్లాన్‌పూర్ వేదికగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఓపెనర్ కేఎల్ రాహుల్(165 బంతుల్లో 11 ఫోర్లతో 100), కెప్టెన్ శుభ్‌మన్ గిల్(143 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 103 నాటౌట్)శతకాలతో కదం తొక్కారు. దాంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 85 ఓవర్లలో 3 వికెట్లకు 368 పరుగుల భారీ స్కోర్ చేసింది. క్రీజులో శుభ్‌మన్ గిల్‌తో పాటు రిషభ్ పంత్(70 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 50 నాటౌట్)



ఉన్నాడు. సాయి సుదర్శన్(104 బంతుల్లో 13 ఫోర్లతో 81) సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. యశస్వి జైస్వాల్(24) విఫలమయ్యాడు. అఫ్గాన్ బౌలర్లలో మోహమ్మద్ సలీమ్(2/67) రెండు వికెట్లు తీయగా.. జియావుర్ రెహ్మాన్ ఒక వికెట్ పడగొట్టాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో భారత్ బ్యాటర్లు అలవోకగా పరుగులు రాబట్టారు. రెండో రోజు కూడా భారత్ పూర్తిగా బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఆచితూచి ఆరంభించారు. కొత్త బంతితో బౌలర్లకు సహకారం లభించడంతో ఓపికగా ఆడారు. అయితే అఫ్గానిస్థాన్ ఫీల్డింగ్ తప్పిదం కేఎల్ రాహుల్‌కు కలిసొచ్చింది. 16 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద రాహుల్ కీపర్ క్యాచ్ ఇవ్వగా.. అంపైర్లు ఔటివ్వలేదు. అఫ్గాన్ రివ్యూ తీసుకోలేదు. కానీ రిప్లేలో బంతి బ్యాట్‌ను తాకినట్లు స్పష్టంగా తేలింది. ఈ అవకాశంతో రాహుల్ చెలరేగాడు. ఆ కాసేపటికే యశస్వి జైస్వాల్ ఔట్ అవ్వగా.. సాయి సుదర్శన్‌తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. సాయి సుదర్శన్ దూకుడుగా ఆడగా.. రాహుల్ తన క్లాస్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. దాంతో భారత్ 96/1 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లోనూ ఈ జోడీ చెలరేగింది. అయితే ఈ ఇద్దర్నీ ఔట్ చేసే అవకాశాలు వచ్చినా అఫ్గాన్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. దాంతో ఈ జోడీ చెలరేగింది. రాహుల్ 86 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. సాయి సుదర్శన్ 67 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. సెంచరీ దిశగా సాగిన సాయి సుదర్శన్‌ను సలీమ్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 139 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి శుభ్‌మన్ గిల్ రాగా.. టీమిండియా 209/2 స్కోర్ వద్ద టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లోనూ గిల్, రాహుల్ సాధికారికంగా బ్యాటింగ్ చేశారు. రాహుల్ 164 బంతుల్లో 12వ సెంచరీ పూర్తి చేసుకోగా.. గిల్ 68 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. రాహుల్‌ను జియావుర్ రెహ్మాన్ ఔట్ చేసి మూడో వికెట్‌కు నమోదైన 167 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. రిషభ్ పంత్‌తో కలిసి గిల్ చెలరేగాడు. ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టడంతో భారత స్కోర్ బోర్డు పరుగెత్తింది. 138 బంతుల్లో శుభ్‌మన్ గిల్ సెంచరీ చేసుకోగా.. రిషభ్ పంత్ 70 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఆ వెంటనే అంపైర్లు తొలి రోజు ఆటకు ముగింపు పలికారు.

## ఆఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్..

### కోహ్లీ స్థానంలో జట్టులోకి యశస్వి జైస్వాల్



ఆఫ్గానిస్థాన్‌తో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టులోకి యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. గాయపడిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్థానంలో అతడిని జట్టులోకి తీసుకుంటున్నట్లు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రకటించారు. జైస్వాల్ తన చివరి వన్డేలో సౌతాఫ్రికాపై అజేయ సెంచరీ (116 పరుగులు, నాటౌట్)తో అదరగొట్టడం విశేషం. ఇదే సిరీస్‌లో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ , హార్దిక్ పాండ్యా ఆడటం వారి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టంచేశారు. వెన్నునొప్పితో బాధపడుతున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఇప్పటికే బెంగళూరులోని బిసిసిఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో రిహాబిలిటేషన్‌లో ఉండగా.. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న రోహిత్ కూడా త్వరలో అక్కడికి చేరుకుని ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నాడు. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడుతున్నప్పుడు కోహ్లీకి తొడ కండరానికి గాయమైంది. ఆ మ్యాచ్‌లో 75 పరుగులతో జట్టును గెలిపించినప్పటికీ ఆ తర్వాత గాయం తీవ్రత ఎక్కువవడంతో అతడు ఈ సిరీస్‌కు దూరమవాల్సి వచ్చింది. జూలైలో జరిగే ఇంగ్లండ వన్డే సిరీస్ నాటికి కోలుకునే అవకాశం ఉందని అగార్కర్ చెప్పారు. భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య వన్డే పోరు జూన్ 13న ధర్మశాల వేదికగా ప్రారంభం కానుంది. ఆ తర్వాత మిగిలిన రెండు వన్డే మ్యాచ్‌లు జూన్ 17న లక్నోలో, జూన్ 20న చెన్నైలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్ ముగిసిన తర్వాతే ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే పూర్తిస్థాయి భారత వన్డే జట్టును సెలెక్టర్లు ప్రకటించనున్నారు. రోహిత్, హార్దిక్‌లు ఫిట్‌నెస్ సాధిస్తేనే ఈ సిరీస్‌లో ఆడతారని, లేదంటే జట్టులో మరికొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని బిసిసిఐ వర్గాలు చెబుతున్నాయి.

## అండర్18 హాకీ.. భారత మహిళల జట్టుకు కాంస్య పతకం

**కాకామిగహర:** జపాన్‌లో జరుగుతున్న మహిళల అండర్ 18 ఆసియాకప్ హాకీ లో భారత జట్టుకు కాంస్య పతకం దక్కింది. మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత్ 30 గోల్స్ తేడాతో కొరియాపై విజయాన్ని నమోదు చేసింది. సందీప్ కుమారి, స్వీటీ కుజుర్, నౌషీన్ నాజ్‌లు భారత్ తరపున గోల్స్ చేశారు. సెమీఫైనల్స్ మ్యాచ్‌లో చైనా చేతిలో షూటౌట్ ఓడిన భారత జట్టు బ్రాంజ్ మెడల్ ఫైట్‌లో గట్టిగా పోరాడింది. ఆరంభంలోనే డ్రీమ్ స్టార్ట్ అందింది. తొలి రెండు నిమిషాల్లోనే సందీప్ కుమారి గోల్స్ చేసింది. దీంతో ఇండియా ఈ మ్యాచ్‌లో దూకుడు ప్రదర్శించింది. మ్యాచ్ మొత్తం ఇండియా జట్టు అటాక్ చేసింది. ఇక ఆట 16వ నిమిషంలో స్వీటీ కుజుర్ ఫీల్డ్ గోల్‌తో ఆధిక్యాన్ని పెంచింది. రెండు గోల్స్‌తో భారత మహిళల జట్టు మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఆ తర్వాత మళ్లీ 33వ నిమిషంలో భారత్‌కు మరో గోల్ దక్కింది. నౌషీన్ ఆ గోల్ స్కోరు చేసింది. ఈ టోర్నీలో నౌషీన్ తన ఖాతాలో మొత్తం 12 గోల్స్ వేసుకున్నది. సందీప్ కుమారి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నది




## ఓలా, ఉబర్‌కు పోటీగా 'గ్రీన్ ఎస్ఎం'!

**న్యూఢిల్లీ :** భారత రైడ్ హెయిలింగ్ మార్కెట్లోకి వియత్నాం ఇవి దిగ్గజం విన్‌ఫాస్ట్ బ్యాకింగ్‌తో 'గ్రీన్ ఎస్ఎం' ఎంట్రీ ఇచ్చింది. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో సరికొత్త 7సీటర్ ఎలక్ట్రిక్ ఎంపివి 'విన్‌ఫాస్ట్ లిమో గ్రీన్' వాహనాలతో తన తొలి ఎలక్ట్రిక్ ట్యాక్సీ సర్వీసును ప్రారంభించింది. ఓలా, ఉబర్ వంటి దిగ్గజాలకు సవాల్ విసురుతూ రంగంలోకి దిగిన ఈ సంస్థ క్రమంగా ఈ సేవలను దేశంలోని ఇతర నగరాలకూ విస్తరించనుంది. విశేషం ఏంటంటే కంపెనీ ఈ ఫ్లీట్ మోడల్‌ను సియాన్ కలర్‌లో తీసుకొచ్చింది. కార్లపై గ్రన్ ఎస్ఎం లోగో ఉంటుంది. వీటికి వీల్ కవర్లతో కూడిన స్టీల్ వీల్స్ ఇచ్చారు. లిమో గ్రీన్ కారులో ముందు చక్రాలకు శక్తినిచ్చే సింగిల్ ఎలక్ట్రిక్ మోటార్ ఉంటుంది. ఇందులో 60.13 కిలోవాట్స్ బ్యాటరీ ప్యాక్ ఉంది. ఇది 201 బిహెచ్‌పి పవర్, 280 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. ఈ ఎంపివి ఫుల్ ఛార్జ్‌తో 517 కిలోమీటర్ల ఆరాయ్ సర్టిఫైడ్ రేంజ్ ఇస్తుంది.విన్‌ఫాస్ట్ లిమో గ్రీన్ భద్రతా ఫీచర్లు: గ్రీన్ ఎస్ఎం సంస్థ తమ వాహనాలలో ఆన్‌బోర్డ్ సేఫ్టీ సిస్టమ్స్ ముందే అమర్చినట్లు చెబుతోంది. ఈ సేఫ్టీ ఫీచర్లలో అంతర్గత, బాహ్య కెమెరాలు, Aఐ అసిస్టెడ మానిటరింగ్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ అసిస్టెన్స్ బటన్ వంటివి ఉన్నాయి. బుకింగ్, లాంఛ్ ఆఫర్లు: ఈ క్యాబ్‌లను కంపెనీకి చెందిన స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఈ యాప్ యాప్‌స్టోర్, గూగల్ ప్లేలో అందుబాటులో ఉంది. అంతేకాకుండా కంపెనీ హాట్‌లైన్ నంబర్ల ద్వారా కూడా టాక్సీ సర్వీస్ పొందవచ్చు: 9228853333 కస్టమర్ హాట్‌లైన్, 9228832929 డ్రైవర్ హాట్‌లైన్. అలాగే కస్టమర్లు గ్రీన్ ఎస్ఎం ఆపరేటింగ్ జోన్లలో నేరుగా వెహికల్‌ని ఆపి కూడా బుక్ చేసుకోవచ్చు. లాంఛ్ ఆఫర్‌లో భాగంగా, కంపెనీ జూన్ 5 నుంచి జూన్ 11, 2026 వరకు యాప్ బుకింగ్‌లపై గరిష్ఠంగా రూ. 250 వరకు 50 శాతం డిస్కౌంట్‌ను అందిస్తోంది.



## గూగుల్-స్పేస్ఎక్స్ భారీ డీల్

### ఎఐ పవర్ కోసం బిలియన్ డాలర్ల ఒప్పందం!

**న్యూఢిల్లీ :** ఆంత్రోపిక్‌తో డేటా సెంటర్ కంప్యూట్ డీల్ తర్వాత, ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్ గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్‌తో మరో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్లౌడ సర్వీసెస్ కాంట్రాక్ట్ ప్రకారం, స్పేస్ఎక్స్ సంస్థ ఈ సెర్చ్ దిగ్గజానికి (గూగుల్‌కు) కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అందిస్తుంది. ఈ ఒప్పందం అక్టోబర్ 2026 నుంచి జూన్ 2029 వరకు అమలులో ఉంటుంది. అమెరికా ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం, 1,10,000 ఎన్విడియా గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జిపియులు), సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్లు (సిపియులు), మెమరీ, ఇతర భాగాల వినియోగానికి గాను గూగుల్ సంస్థ స్పేస్ఎక్స్‌కు నెలకు 920 మిలియన్ డాలర్లు చెల్లించేందుకు అంగీకరించింది. ఈ ఒప్పంద కాలపరిమితి 33 నెలలు కాగా, మొత్తం కాంట్రాక్ట్ విలువ సుమారు 30 బిలియన్లు ఉంటుంది. ఎన్విడియా హెచ్200 చిప్‌ల సామర్థ్యంతో ఈ సెటప్ 100 మెగావాట్ల కంటే ఎక్కువ కంప్యూటింగ్ పవర్‌ను అందించగలదు. ఇది ఒకేసారి దాదాపు 75,000 ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు సరిపోతుంది. ఫైలింగ్ ప్రకారం, ఒకవేళ స్పేస్ఎక్స్ సంస్థ సెప్టెంబర్ 30 నాటికి ఎన్విడియా చిప్స్‌ను అందుబాటులోకి తీసుకురావ




డంలో విఫలమైతే, ఒక నెల గ్రేస్ పీరియడ (గడువు) తర్వాత గూగుల్ చట్టబద్ధంగా ఈ కాంట్రాక్ట్‌ను రద్దు చేసుకోవచ్చు. అంతేకాకుండా, ఇరు పక్షాలలో ఏ సంస్థ అయినా 90 రోజుల ముందస్తు నోటీసుతో డీల్ నుంచి తప్పుకోవచ్చు. గూగుల్ క్లౌడ ప్రతినిధి మాట్లాడుతూ తమ ఎఐ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకోవడానికి ఈ డీల్ ఉపయోగపడుతుందని తెలిపారు. మా ఏజెంట్ ప్లాట్‌ఫామ్ 'జెమిని ఎంటర్‌ప్రైజ్‌కు కస్టమర్ల నుంచి ఊహించిన దానికంటే ఎక్కువ డిమాండ్ వస్తోంది. ఈ విపరీతమైన డిమాండ్‌ను తట్టుకోవడానికి అవసరమైన తాత్కాలిక సామర్థ్యాన్ని వెంటనే పొందడం కోసం కుదుర్చుకున్న స్వల్పకాలిక, సమయోచిత ఒప్పందం ఇది అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, స్పేస్ఎక్స్ ఈ ఏడాది ప్రారంభంలో ఇచ్చిన సమాచారం ప్రకారం, 2025 చివరి నాటికి గూగుల్‌కు కంపెనీలో 6.11% వాటా ఉంది. అయితే మస్క్ ఎక్స్ఎఐతో స్పేస్ఎక్స్ విలీనం అయిన తర్వాత, గూగుల్ యాజమాన్యం సుమారు 5 శాతానికి పడిపోయింది. గత నెలలో, స్పేస్ఎక్స్ సంస్థ యాంత్రోపిక్‌తో కూడా ఇలాంటి ఒప్పందాన్నే కుదుర్చుకుంది.

## డైమెన్సిటీ 8500 అల్ట్రా చిప్‌సెట్‌తో 'రెడ్‌మీ టర్బో 5'

**న్యూఢిల్లీ :** షావోమీ సబ్‌బ్రాండ్ రెడ్‌మీ ఇండియాలో తన ఫస్ట్ టర్బో సిరీస్ ఫోన్‌ను లాంఛ్ చేసేందుకు రెడీ అవుతోంది. 'రెడ్‌మీ టర్బో 5' పేరుతో వస్తున్న ఈ ఫోన్ లాంఛ్ తేదీని కంపెనీ అధికారికంగా ప్రకటించింది. లాంఛ్ డేట్‌తో పాటు, హ్యాండ్‌సెట్ ప్రాసెసర్ వివరాలను కూడా కంపెనీ కన్ఫర్మ్ చేసింది. ఇది ఇప్పటివరకు వచ్చిన రెడ్‌మీ స్మార్ట్‌ఫోన్‌లలోకెల్లా అత్యంత వేగవంతమైనదని, అలాగే ఇప్పటి వరకు ఏ రెడ్‌మీ ఫోన్‌లోనూ లేనంత పెద్ద బ్యాటరీని కలిగి ఉంటుందని పేర్కొంది. ఈ 'రెడ్‌మీ టర్బో 5' జూన్ 16న భారతదేశంలో విడుదల కానుందని కంపెనీ తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా వెల్లడించింది. ఈ హ్యాండ్‌సెట్ అమెజాన్‌లో అందుబాటులో ఉంటుందని ధృవీకరించింది. ఇందుకోసం అమెజాన్‌లో ప్రత్యేక మైక్రోసైట్‌ను కూడా ఏర్పాటు చేసింది. టర్బో 5 కనీసం రెండు కలర్‌వేస్ (బ్లాక్, వైట్)లో రానుందని కంపెనీ టీజ్ చేసింది. అయితే ఆ ఫినిష్‌ల కచ్చితమైన పేర్లను మాత్రం ఇంకా వెల్లడించలేదు. లాంఛ్ డేట్‌తో పాటు, ఈ హ్యాండ్‌సెట్ ప్రాసెసర్ వివరాలను కూడా కంపెనీ ప్రకటించింది. మీడియాటెక్ డైమెన్సిటీ 8500 అల్ట్రా చిప్‌సెట్‌తో ఇది పనిచేస్తుందని కన్ఫర్మ్ అయింది.

# పెరిగిన ధరలను నిరసిస్తూ 10న కలెక్టరేట్ ముట్టడి

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ సహా ధరల పెరుగుదలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 10న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. సిపిఐ కార్యాలయంలో ఖమ్మం, వైరా, పాలేరు నియోజక వర్గాల సమావేశం శనివారం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ సంపన్నులు, కార్పొరేట్ల సేవలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజలను పట్టించుకునే స్థితిలో లేదన్నారు. పదేళ్ల నాడు మోడీ అధికారాన్ని చేపట్టే ముందు రూ. 72 ఉన్న పెట్రోల్ ఇప్పుడు రూ. 115కు చేరుకుందని డీజిల్ సైతం రూ.55 నుంచి రూ. 108లకు చేరుకుందని ఆయన తెలిపారు. గ్యాస్ ధర రెండు రేట్లు పెరిగిందని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రాబడి పెరగలేదని హేమంతరావు తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజలను ముఖ్యంగా సామాన్యులను విస్మరించి పాలన సాగిస్తుందని యావత్ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచి పెడుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2023 ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక హామీలను ఇచ్చిందని ఆ హామీలు నెరవేర్చడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. రెండున్నర ఏళ్లలో హామీల అమలులో వైఫల్యం చెందిన ప్రభుత్వం ఇకనైనా హామీల అమలుపై దృష్టిసారించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మహిళలకు రూ. 2,500 నెల వారి జమ, కళ్యాణ లక్ష్మి క్రింద తులం బంగారం, కొత్త పింఛన్లు, పింఛన్ల పెంపు వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 24 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేశారని జూన్ రెండు నాటికి రెండు లక్షల పింఛన్లు ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం అది కూడా అమలు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అరకొరగా ఇస్తున్న ప్రభుత్వం నివాస స్థలాల పంపిణీ గురించి మరిచిపోయిందన్నారు. స్థలాలు ఇస్తాం, ఇండ్లు ఇస్తామని చెప్పిన హామీని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తుందని అందుకే సిపిఐ ఆందోళన బాట పట్టిందన్నారు. రైతు భరోసా కూడా సరిగ్గా అమలు జరగడం లేదని రెండు ఎకరాల రైతులకు మాత్రమే రైతు భరోసా జమ చేశారని మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని హేమంతరావు ప్రశ్నించారు. మళ్లీ వానాకాలం సమీపిస్తుందని రైతు బంధు ఎప్పుడు జమ చేస్తారని ఆయన ప్రశ్నించారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేసినా రైతులకు నెలలు గడిచినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయలేదన్నారు. గత ప్రభుత్వం మాదిరే భూములను వేలం వేయడం ద్వారా మాత్రమే ఆదాయం సమకూర్చుకోవాలని ప్రయత్నిస్తుందని హేమంతరావు ఆరోపించారు.

ధరణిలోని లోపాలను భూభారతి సరి చేయలేదని భూ భారతి పరిస్థితి ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కుఅన్న చందంగా ఉందన్నారు. పింఛన్లను నాలుగు వేలకు పెంచాలని, అర్హులందరికీ పింఛ న్లు ఇవ్వాలని, హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు ఆయన తెలిపారు. పె ద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చే యాలని హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రా ష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచిన కేంద్రం

• కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే • పెరిగిన ఇంధన ధరలకు నిరసనగా జూన్ 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా : విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ :** దేశంలో ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌తో పాటు వంట గ్యాస్ ధరలను విడతల వారీగా పెంచుతూ సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపిందని నల్లగొండ సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్రంగా ధ్వజమెత్తారు. పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ జూన్ 10వ తేదీన సిపిఐ ఆద్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.శనివారం నల్లగొండ జిల్లా సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. ఎన్నికలు ముగియగానే ఇంధన ధరలు పెంచి ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు.ఎరువుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.పేద ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ శక్తులకు వేల కోట్ల రూపాయల రాయితీలు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి పేదలు, రైతులు, కార్మికుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పాలమూరు— రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంలో కేంద్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, తెలంగాణ పట్ల బిజెపికి చిత్తశుద్ధి లేదని



అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఒకటి రెండు పథకాలు మినహా మిగిలినవి పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఎమ్మెల్సీ సత్యం ఎత్తిచూపారు. రైతు రుణమాఫీ ఇంకా పూర్తికాలేదని, రైతు భరోసా పథకం అరకొరగా అమలవుతోందని తెలిపారు. ఆసరా పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల మంజూరు,ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ప నులు ముందుకు సాగడం లేదని,సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల,ఉదయసముద్రం ప్రాజెక్టులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని నిర్ణీత కాలం వ్యవధిని పెట్టుకుని ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నుంచి కృష్ణాపురం వరకు కాల్వల ద్వారా చెరువులను నింపాలని కోరారు. రైతు డిస్కమ్‌ను సిపిఐ పూర్తిగా వ్యతిరేకిస్తోందని, రైతులపై అదనపు భారం మోపే ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.జూన్ 10న చేపట్టే కలెక్టరేట్ ధర్నాలో ప్రజలు, రైతులు,కార్మికులు, మహిళలు, యువత, పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు,సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు,తూము బుచ్చిరెడ్డి,పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక కొరత నివారించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇసుక కొరత నివారించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. శనివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ పాల్వంచ మండల విస్తృత కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత వల్ల అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సమస్య ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం స్థానిక ప్రజల అవసరాలకు ఇసుకను సరఫరా చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున అటవీ అధికారులు జిల్లా వ్యాప్తంగా పోడు సాగుదారులపై దాడులు చేసి ఇబ్బందులకు గురిచేయరాదని, పోడు భూ ముల సాగు చేసుకునే విధంగా వీలు కల్పించాలన్నారు.రైతులు పండించిన పంటలను షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా కాడాలు, గన్నీ బ్యాగులు, హామలీలు, లారీలను ఏర్పాటు చేయాలన్నారు. నిత్యం గ్రామాల్లో ప్రజలతో మమేకవుతూ ప్రజులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన తెచ్చుకుని వాటి పరిష్కారానికి ప్రతీ కార్యకర్త కృషి




చేయాలని, తద్వారా పార్టీ మరింత బలోపేతం అవడానికి దోహదపడుతుందన్నారు. పాలకులు నిర్లక్ష్య వైఖరి అనాలోచిత చర్యల వల్ల నిత్యవసరాలు ధరలు నానాటికీ పెరిగిపోతున్నాయని, ఈ ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని, నష్ట నివారణ చర్యలు చేపట్టి సామాన్య ప్రజలకు నిత్యవసరాలు అందుబాటులో ఉండేలా నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు. అధిక ధరల పై ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వేలాదిమంది ప్రజలతో ధర్నా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీశంశెట్టి పద్మ, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతుల్లేకుండా అడ్మిషన్లు చేపడుతున్న ఇంటర్ కాలేజీలను సీజ్ చేయాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రవేశాలు చేపడుతున్న ర్యాంక్ ఫోర్డ్,గ్రావిటీ,బన్సల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిఐఇఒ కార్యాలయంలోని ఎఒ సుధాకర్‌కు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ర్యాంక్‌ఫోర్డ్, గ్రావిటీ, బన్సల్ కళాశాలలు విద్యాశాఖ నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లావ్యాప్తంగా తప్పుడు ఫలితాలను ప్రచారం చేస్తూ బోర్డులు పెట్టి విద్యార్థులు వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవలసిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మిన్నకుండిపోవడం ఆశ్చర్యానికి గురి



చేస్తుందన్నారు. అదే విధంగా జిల్లాలోని ఫాలో ఇంటర్మీడియట్ కళాశాలలకు ఎలాంటి అనుమతు లు లేకుండానే రిటైర్డ్ ఐపిఎస్ అధికారి జె.డి. లక్ష్మీనారాయణ రెసోనెన్స్, ఐఐటి, జెఇఇ, నీట్ వంటి గుర్తింపు లేని కళాశాలను ప్రారంభించడం సరైంది కాదని, ఆ కళాశాల ప్రారంభించడంలో ఉన్న మతలబేంటో ఆ ఐపిఎస్ అధికారి విజ్ఞతకే వదిలేస్తామన్నారు. జిల్లాలో కోకొల్లులుగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తూ ఉంటే జిల్లాలోని విద్యాశాఖ అధికారులు యజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి అనుమతులు లేకుండానే కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు కళాశాల నడుస్తున్నప్పటికీ సంబంధిత విద్య శాఖ మంత్రి స్థానిక మంత్రులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇకనైనా ఎటువంటి అనుమతులు లేని కళాశాలలు పాఠశాలను సీజ్ చేసి సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని యుగంధర్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి చెంచాల మురళి పిన్న మల్ల భాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు

# సింగరేణిలో 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు

### మెడికల్ బోర్డుపై ఫిర్యాదుల నేపథ్యంలో కొనసాగుతున్న ఎసిబి విచారణ... ఇప్పటికే ఇద్దరి అరెస్టు

### సింగరేణి యాజమాన్యం వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మైనింగ్ రంగంలో 137 ఏళ్లుగా కొనసాగుతున్న సింగరేణి కాలరీస్‌లో ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ 4వ తేదీ నాటికి 26.51 లక్షల టన్నుల బొగ్గు వివిధ ఏరియాల్లోని గనులు, సిహెచ్‌పిలలో నిలువగా ఉంది. ఇది గత పదేళ్ల స్టాక్ చరిత్రలో అత్యల్పం. నిల్వ ఉన్న బొగ్గును ఎప్పటికప్పుడు రైలు, రోడ్డు మార్గం ద్వారా అవసరమైన వినియోగదారులకు రవాణా చేస్తున్నారు. 2014 నుంచి కూడా ఇదే విధంగా బొగ్గు నిల్వలు ఉంటున్న విషయం గమనార్హం. 2015 16లో 70 లక్షల టన్నులు, 2016 17 లో 74 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు రికార్డు అయింది. 2014 నుంచి 2024 వరకు సగటును 50 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు గనులు, సిహెచ్‌పిల వద్ద ఉన్న విషయం గమనార్హమని సింగరేణి సంస్థ ఒక ప్రకటనలో వివరించింది. సింగరేణి కాలరీస్ దశాబ్ధాలుగా దక్షిణాదిలో పలు రాష్ట్రాలకు నిరాటంకంగా బొగ్గు రవాణా చేస్తోంది. ఇందుకోసం సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును రైలు మార్గం, రోడ్డు మార్గం ద్వారా ప్రతి నిత్యం రవాణా చేయడం జరుగుతోంది. మొత్తం 39 గనులు ఉన్న సింగరేణిలో నిత్యం బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుగుతున్న నేపథ్యంలో కొంత మొత్తంలో బొగ్గు స్టాక్‌గా ఉండటం అత్యంత సహజం. ముఖ్యంగా బొగ్గు ఉత్పత్తి ఎక్కువగా జరిగే నవంబరు నుంచి మే మాసాల మధ్య బొగ్గు నిల్వలు పేరుకుపోతూ ఉంటాయి. ఇలా ఉన్న బొగ్గు నిల్వలను పలు కారణాల వల్ల ఉత్పత్తి తగ్గిన సమయంలో వీటిని రోడ్డు, రైలు మార్గాల ద్వారా థర్మల్ కేంద్రాలకు సరఫరా చేస్తూ రావడం ఏళ్ల తరబడి కొనసాగుతున్నది.

**వర్షాకాలం థర్మల్ విద్యుత్ అవసరాల కోసం స్టాక్ అత్యవసరం**

వర్షాకాలం కోసం కూడా బొగ్గు నిల్వలు ఉండటం అత్యవసరం. లేనిపక్షంలో థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గును రవాణా చేయలేని పరిస్థితులు ఉంటాయి. థర్మల్ పవర్ స్టేషన్ల అవసరాలకు 15 రోజులపాటు సరిపడేలా కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలను సిద్ధంగా ఉంచడం జరుగుతుంది. తద్వారా వర్షాకాలంలో విద్యుత్ కేంద్రాలకు నిరాటంకంగా బొగ్గు సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. దేశంలో ప్రతీ బొగ్గు కంపెనీ వద్ద కూడా ఇలాంటి నిల్వలు ఉండటం అత్యంత సహజం.

**సైట్ విజిట్ సర్టిఫికెట్ ఎందుకు ప్రవేశపెట్టామంటే**

సింగరేణి కాలరీస్‌లో ఓవర్ బర్డెన్ తొలగింపు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అతి కీలకమైనది. సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే బొగ్గు పొరలపై ఉండే పై మట్టి (ఓవర్ బర్డెన్) ని సకాలంలో తొలగించాల్సి ఉంటుంది. ఈ ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను కాంట్రాక్టర్ల ద్వారా చేపడతారు. సింగరేణి కాంట్రాక్టులను బహిరంగ టెండర్ల ద్వారానే కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. ఈ నేపథ్యంలో ఎక్కువ శాతం ఓవర్ బర్డెన్ టెండర్లలో, కాంట్రాక్టర్లు స్థానిక భౌగోళిక గనుల పరిస్థితులు, సామాజికరాజకీయ పరిస్థితులు, మౌలిక వసతులు మొదలైన వాటిని సమగ్రంగా అంచనా వేయకుండా టెండర్లలో పాల్గొంటున్నారు. స్థానిక పరిస్థితులపై అవగాహన, అంచనా లేక కొందరు కాంట్రాక్టర్లు ఓవర్ బర్డెన్ పనులను ఆపివేయడం లేదా మందకొడిగా నిర్వహించడం వంటివి చేశారు. దీని ఫలితంగా పనితీరు దెబ్బతిని, సింగరేణికి బొగ్గు ఉత్పత్తిలో నష్టం, కాంట్రాక్టర్లకు ఆర్థిక నష్టం జరుగుతూ, న్యాయ సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. శ్రీరాంపూర్ ఒసి2 ప్రాజెక్టులో, శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకె ఒసిలో సైట్‌ను సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను మధ్యలో వదిలేయడం జరిగింది. ఫలితంగా కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యాలకు విఘాతం కలిగింది.

**సైట్ విజిట్ ముఖ్య ఉద్దేశం ఇదే..**

టెండర్లలో పాల్గొనే వారు పని ప్రదేశ పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, పనుల పరిధి తదితర అంశాలను పూర్తిగా అవగాహన చేసుకోవడమే సైట్ విజిట్ ముఖ్య ఉద్దేశం. అన్ని పరిస్థితులు, మార్పులను పరిగణలోకి తీసుకొని రేట్లు కోట్ చేస్తాడని నిర్ధారించడమే దీని లక్ష్యం. ఇది పోటీని పరిమితం చేయడానికి మాత్రం కాదు. ఆరోగ్యకరమైన పోటీతో పాటు పనుల సమర్థవంతమైన అమలుకు దోహదపడేందుకు తీసుకున్న చర్య. సంపూర్ణ అవగాహనతో పకడ్బందీ ప్రణాళికతో ఓబి తొలగింపు జరుగుతుందని భావిస్తూ తీసుకున్న చర్య. సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన కేవలం సింగరేణిలోనే కాదు అనేక ప్రభుత్వ సంస్థలలో, ప్రైవేటు సంస్థల్లో కూడా ఇప్పటికే అమలులో ఉంది. సింగరేణిలో మే 2025 నుండి ఓవర్ బర్డెన్ టెండర్లకు సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను ప్రవేశపెట్టారు. ఈ విధానం ఇప్పటికే గుజరాత్, కొన్ని సౌర విద్యుత్ ప్రాజెక్టులు, ఇపిసి కాంట్రాక్టుల్లో అమల్లో ఉంది. సింగరేణిలోనే 2018, 2021, 2023 సంవత్సరాల్లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లకు సిఎంపిడిఐ (కోల్ ఇండియా అనుబంధ సంస్థ) సలహా మేరకు సైట్ విజిట్ సర్టిఫికేట్లు తప్పనిసరిగా చేశారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత మంజూరైన టెండర్లు ఎలాంటి సమస్యలు లేకుండా మంచి పనితీరుతో కొనసాగుతున్నాయి. సదరు కాంట్రాక్టు పనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు పనులు నిరాటంకంగా జరుగుతున్నాయి. ఇతర సంస్థలలో కూడా సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం అమల్లో ఉండటం, కాంట్రాక్టర్ల నుండి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. సైట్ విజిట్ కోసం వచ్చే అన్ని కాంట్రాక్టర్లకు సింగరేణి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, సైట్‌ను సందర్శించిన ప్రతి కాంట్రాక్టర్‌కు సైట్ విజిట్ సర్టిఫికెట్లను సింగరేణి జారీ చేస్తోంది.

**గత మెడికల్ బోర్డుల పై ఎసిబి విచారణ**

సింగరేణిలో డిపెండెంట్, కారుణ్య ఉద్యోగాల నియామకాల కోసం మెడికల్ బోర్డును కొనసాగిస్తున్నారు. అయితే ఈ ఉద్యోగ నియామకాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, పలువురు దళారులుగా మారి అమాయకులైన కార్మికులను మోసం చేస్తూ పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు ప్రక్షాళనలో భాగంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఎసిబి విచారణ సందర్భంగా ఇద్దరు ఉద్యోగులను అరెస్టు చేసి వారిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఎసిబి విచారణ కొనసాగుతోంది. మరోవైపు సింగరేణి విజిలెన్స్ విభాగం కూడా ఈ ఆరోపణలపై శాఖాపరమైన విచారణను కొనసాగిస్తోంది.

## 'రేపు' సైబరాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) శాశ్వత కార్యాలయ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈనెల 8న శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 5 గంటలకు కొత్తగూడలోని ఇజ్జత్‌నగర్ సమీపంలోని ముండికుంట చెరువు పక్కన నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా కార్పొరేషన్కు ఆధునిక సౌకర్యాలతో కూడిన శాశ్వత కార్యాలయ భవనం అందుబాటులోకి రానుంది. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు హాజరుకానున్నారు. సాయంత్రం 5.30 గంటలకు మియాపూర్ ఎక్స్ రోడ్ వద్ద మరో రెండు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో మియాపూర్ ఎక్స్ రోడ్ నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్ వరకు ఆరు లేన్‌ల ద్విమార్గ ఫ్లైఓవర్, హఫీజ్‌పేట్ మియాపూర్, బాచుపల్లి ఆల్విన్ ఎక్స్ రోడ్ మార్గాల్లో మూడు లేన్‌ల ఏకమార్గ అండర్‌పాస్‌ల నిర్మాణం ఉన్నాయి. అలాగే లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని బ్రిడ్జి నెంబర్202 వద్ద నాలుగు లేన్‌ల రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి), గుల్మోహార్ జంక్షన్ నుంచి రెండు లేన్‌ల అప్ ర్యాంప్ నిర్మాణ పనులకు కూడా సిఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పశ్చిమ హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని అధికారులు అంటున్నారు.

## 9న మైనారిటీ యువత మెగా జాబ్ మేళా

### మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టిజిఎంఎఫ్‌సి) ఆధ్వర్యంలో నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 9న నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ జాబ్ మేళాను మైనారిటీస్ వెల్ఫేర్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, గవర్నమెంట్ రిలేషన్స్ శాఖ మంత్రి జనాబ్ మహమ్మద్ అజారుద్దీన్ ప్రారంభించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామక కార్యక్రమంలో ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, కస్టమర్ సర్వీసెస్ తదితర రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొననున్నట్లు వెల్లడించారు. మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ సంకల్పానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. అర్హత కలిగిన మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిజిఎంఎఫ్‌సి చైర్మన్ మొహమ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళా ఉద్యోగార్థులను ప్రముఖ కంపెనీలతో అనుసంధానం చేసే ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు.

## దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం : ఖాద్రి

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** విద్యార్థి, యువజన ఉద్యమాలపై దాడులు ప్రజాస్వామ్య హక్కులపై దాడులేనని ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి అన్నారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్, నెట్ పరీక్షలలో జరిగిన అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షా వ్యవస్థలోని అవకతవకలకు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ కార్యకర్తలపై ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు జరిపిన దాడిని ఖండిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన పరీక్షల కుంభకోణాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షా నిర్వహణలో వైఫల్యాలపై విద్యార్థుల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని హింసాత్మక దాడులతో అణచివేయలేరని, విద్యార్థులు, యువత లేవనెత్తుతున్న న్యాయమైన డిమాండ్లకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వాలు, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమైమన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారిని భౌతిక దాడులు, గూండాయిజం ద్వారా బెదిరించడం ఫాసిస్టు ధోరణికి నిదర్శనమని, నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని అన్నారు. ఆ హక్కును హింస ద్వారా అణచివేయాలనే ప్రతి ప్రయత్నాన్ని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ప్రతిఘటించాలని ఖాద్రి పిలుపునిచ్చారు.

## కాలం మనది కానప్పుడు వానపాములూ బుస కొడుతాయ్ : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ జాతిలో ప్రతి తరం ఏదో ఒక యుద్ధాన్ని, రణాన్ని నడిపించిందని, తెలంగాణ సాయుధ పోరాటం,ప్రజా ఉద్యమాలు, త్యాగాలతో కూడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఇలా ప్రతిసారి తెలంగాణ జాతి తోటి ప్రజల కోసం కొట్లాడిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు గుర్తు చేశారు. కాలం మనది కానప్పుడు వానపాములు కూడా నాగుపాములై బుసకొడతాయని, అలాంటి విషనాగులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మలేషియా దేశంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. మలేషియా తెలుగు అసోసియేషన్, బిఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ మలేషియా శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ సంబరాలకు కెటి.రామారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మలేషియా అధ్యక్షుడు మారుతి, ఎన్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల,బిజెపి మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ జి.జగదీశ్ రెడ్డి, ఎంఎల్‌సి ఎల్.రమణ, ఎంఎల్‌ఎలు కె.పి.వివేకానందగౌడ్, మాధవరం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా భవన నిర్మాణాలను ప్రతిరోజూ పరిశీలిస్తా : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్ శాఖ అధికారులకు మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. భవనాల నిర్మాణ పురోగతిని ప్రతిరోజూ తానే స్వయంగా పర్యవేక్షిస్తానని, అవసరమైతే రోజువారీ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క శనివారం అక్కడి నుంచే శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్‌తో పాటు వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 8 వేల గ్రామ మహిళా సమాఖ్య భవనాలకు



శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ భవనాలు కేవలం నిర్మాణాలు మాత్రమే కాకుండా మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచే ఆత్మగౌరవ భవనాలన్నారు. నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య అంశమని స్పష్టం చేశారు. ప్రతి ఎంపిడిఓ తమ మండలంలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ గ్రామాల్లో భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పనుల నాణ్యత, పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సీతక్క సూచించారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలు ద్వారా లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

## అక్రమాలకు, అవినీతికి కాంగ్రెస్ తలుపులు తెరిచింది : కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గతంలో అక్రమాలకు, అవినీతికి బిఆర్‌ఎస్ ప్రభుత్వం కిటికీలు తెరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులు తెరిచి దోపిడీకి పాల్పడుతోందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో ఫినిక్స్ సంస్థకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం 50 ఎకరాల భూమిని ధారాదత్తం చేస్తే, ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారని, కానీ ఆయన అధికారంలోనికి రాగానే అదే ఫినిక్స్ సంస్థకు మరో వంద ఎకరాలను కలిపి ఇచ్చేందుకు ప్రయత్నించడం ద్వంద్వ విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. పంజాబ్‌లో పండిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, తెలంగాణలో మాత్రం ఎందుకు ఆంక్షలు విధిస్తోందని బిజెపి ఎంపిలను ఆమె ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులకు కచ్చితంగా భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెలలో ఉప్పల్ భగాయత్ పరిధిలో పెద్ద ఎత్తున భూపోరాటం చేయబోతున్నామన్నారు. నాదర్‌గుల్‌లో ఉన్న 200 ఎకరాల భూమిని కూడా వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు..

## దుష్ప్రచారం చేయడమే ప్రవీణ్ కుమార్ ఉద్దేశం : అద్దంకి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఇంగితం మరిచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిరాధార విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. దుష్ప్రచారం చేయడమే ప్రవీణ్ కుమార్ ప్రధాన ఉద్దేశమన్నారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి హెలికాప్టర్ వినియోగంపై ప్రశ్నిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సిఎం కెసిఆర్‌తో పాటు సిఎంఓ అధికారులు కూడా హెలికాప్టర్లు ఉపయోగించిన విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన సర్వేలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని, జూరాలను సోర్స్ పాయింట్‌గా తీసుకుని ప్రణాళికలు రూపొందించిందీ కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని కూడా బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిచేయలేకపోయిందని విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డితో బహిరంగ చర్చ కావాలంటే ముందుగా కెసిఆర్‌ను తీసుకురావాలని అద్దంకి దయాకర్ సవాల్ విసిరారు. నలుగురు దళితులకు మంత్రి పదవులు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డిపై దళిత వ్యతిరేక ముద్ర వేయాలని ప్రయత్నించడం హాస్యాస్పదమని అన్నారు. సింగరేణి బొగ్గు నిల్వల అంశంపై హరీష్ రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, బిఆర్‌ఎస్ పాలనలోనే సింగరేణి కార్మికులను అణచివేశారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని ఆర్‌టిసి, సింగరేణి, కాళేశ్వరం అంశాలు పదవి కోల్పోయిన తర్వాత మాత్రమే బిఆర్‌ఎస్ నేతలకు గుర్తుకు వస్తున్నాయని అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు.

## పోచంపల్లి చేనేత కళకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు

### మంతి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పోచంపల్లి చేనేత కళకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్ర భారీ నీటి పారుదల మంతి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైటెక్స్ లో ఏర్పాటు చేసిన థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ కు మంత్రి విచ్చేసి ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్ ను మంత్రి సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేసే లక్ష్యంతో హైదరాబాద్ లోని హైటెక్స్ లో జూన్ 7 వరకు నిర్వహిస్తున్నారని మంత్రి అన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మాదాపూర్ హైటెక్స్ లో "పోచంపల్లి థ్రెడ్ " ఎగ్జిబిషన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాల్ లోని స్టాల్స్ అన్నింటిని ఆయన సందర్శించి ,వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పోచంపల్లి వస్త్రలకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి ఉందన్నారు.తాను ఎంపీగా ఉన్న కాలంలో పోచంపల్లి శాలువలను ఢిల్లీలో సహచర ఎంపి లు , కేంద్ర మంత్రులకు కప్పి భూదాన్ పోచంపల్లి వస్త్రల గొప్పతనాన్ని వివరించే వాడినని ఆయన తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశానని ఈ సందర్భంగా వివరించారు.చేనేత వస్త్రలను ధరించి , మన సాంకృతి , సంప్రదాయన్నీ కాపాడుకోవాలని ఆయన తెలిపారు. హైటెక్స్ లో జరిగే వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని సందర్శిచి, నాణ్యత కలిగిన వస్త్రలను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం,జిల్లా చేనేత అధికారి శ్రీనివాస్, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

## మహిళా ప్రయాణికులకు 'స్త్రీ బైక్ రైడర్లు'

### డిజిపి సివి ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళల భద్రత, సాధికారత, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా తెలంగాణ పోలీసుల మహిళా భద్రత విభాగం చేపట్టిన 'స్త్రీ రైడ్ –ఉమెన్ డ్రైవర్స్' కార్యక్రమం మహిళలకు కొత్త ఉపాధి మార్గాలను తెరచింది. రవాణా రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచుతూ, గౌరవప్రదమైన ఉపాధి అవకాశాల ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని డిజిపి సివి ఆనంద్ శనివారం ప్రారంభించారు. మొదటి దశలో భాగంగా 50 మంది మహిళా బైక్ రైడర్లు, నలుగురు మహిళా ఆటో డ్రైవర్లు, ఒక మహిళా క్యాబ్ డ్రైవర్‌కు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా డిజిపి సివి ఆనంద్ మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా డ్రైవింగ్‌ను వృత్తిగా ఎంచుకుని ముందుకు రావడం సంతోషకరమన్నారు. మహిళల సాధికారత, భద్రత, నైపుణ్యాభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ మహిళల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తోందని, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ప్రారంభించిన షీ టీమ్స్, షీ క్యాబ్స్ వంటి కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహిళల కోసం మరిన్ని భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్లపై విధులు నిర్వహించే సమయంలో సవాళ్లు, వేధింపులు ఎదురైనా వెనుకడుగు వేయవద్దని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మహిళలకు భరోసా ఇచ్చారు. ఎంఎడబ్ల్యూఒ సిఇఒ జై భారతి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, జిప్పి సంస్థ సిఇఒ ప్రసన్న నారాయణ, మహీంద్రా ఆటో శిక్షణ కోసం వాహనాలను అందించాయి. ఈ కార్యక్రమంలో మహిళా భద్రత విభాగం డిజి చారు సిన్హా, రవాణా కమిషనర్ ఇలంబర్తి, డిజిలు మహేష్ భగవత్, స్వాతి లక్రా, మల్టీజోన్1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఐజీ రోడ్డు భద్రత రమేష్ నాయుడు, ఇతర సీనియర్ పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



## సెమీ కండక్టర్ పరిశ్రమలకు తెలంగాణ అనుకూలం

### పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించండి : మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని... ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రపంచస్థాయి సదుపాయాలతో కూడిన సెమీ కండక్టర్ 'ఎకో సిస్టం'ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మలేషియా – పెనాంగ్ డిప్యూటీ సిఎం వైబి జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధుల బృందం శనివారం తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. 'తెలంగాణ మలేషియా(పెనాంగ్)' మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏఐ, ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్ మెంట్ తదితర రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అడ్వాన్స్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లో తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. 'గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ డెస్టినేషన్'గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణ ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ రంగాల్లో పెనాంగ్‌కు ఉన్న అనుభవం... గ్లోబల్ సెమీకండక్టర్ హబ్‌గా తెలంగాణ ఎదిగేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం. ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం' అని వైబీ జగదీప్ సింగ్ దియో పేర్కొన్నారు.



### జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో

## మొగుళ్ళ రాజిరెడ్డి ఘన విజయం

### 717 ఓట్ల మెజారిటీ తో భారీ గెలుపు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** జలమండలిలో గుర్తింపు కార్మిక సంఘం హోదా కోసం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఐఎన్‌టియుసి అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి ఘన విజయం సాధించారు. ఐఎన్‌టియుసి అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్, బిఆర్‌టియు అనుబంధ హెచ్‌ఎండబ్ల్యూడబ్ల్యూ కామ్ యూనియన్‌లు ఈ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో పోటీ చేసాయి. జలమండలిలో మొత్తం 2900 మంది ఓటర్లు ఉండగా 95% పోలింగ్ నమోదు అయింది. 2761 ఓట్లు పోల్ అయ్యాయి. రాంబాబు యాదవ్‌కు 983 ఓట్లు రాగా, మొగుళ్ళు రాజిరెడ్డి 2739 ఓటు సాధించి 717 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. శనివారం జలమండలి వివిధ సెక్షన్లు, కార్యాలయాలలో జరిగిన పోలింగ్ అనంతరం హైదరాబాద్, ఖైరతాబాద్, జలమండలి కేంద్ర కార్యాలయంలో ఓట్ల లెక్కింపు రాత్రి 8 గంటలకు ప్రారంభమైంది. ఓట్ల లెక్కింపు అనంతరం తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజి రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.



## హోటల్ భవనం పైకప్పు కూలిన ఘటనలో బాధితులను పరామర్శించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/మర్పల్లి:** మండల కేంద్రంలోని ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాల్లో నిర్వహిస్తున్న కేహెచ్‌ఎన్ హోటల్ అకస్మాత్తుగా స్లాబు కూలిపోయింది. స్లాబ్ కింద నలుగురు చిక్కుకున్నారు, స్థానికులు, పోలీసుల సహాయంతో జెసిబి హిటాచి సహాయంతో శిథిలాలను తొలగించి క్షతగాత్రులను వెలికి తీశారు. గాయపడిన వ్యక్తులు నజీర్, రమేష్, చందన,శివకుమార్, మండల కేంద్రంలోని ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యంకోసం సంగారెడ్డి జిల్లా అసుపత్రికి తరలించారు. నజీర్ కూడికాలు విరిగింది. రమేష్‌కు తలకు గాయాలైనాయి. విషయం తెలియడంతో వికారాబాద్ డిఎస్‌పి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న స్పీకర్ హైదరాబాద్ నుండి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్వయంగా పరామర్శించి అవసరమైన వైద్య సహాయం అందించాలని వైద్యులకు సూచించారు. బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని జిల్లా అసుపత్రి సూపరింటెండెంట్ ను, డిఎంహెచ్‌ఓ లలితాదేవిని స్పీకర్ ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగత్రులను పరామర్శించి మెరుగైనవైద్యం అందించాలని కోరారు.



## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కాప్రా సర్కిల్ శానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇసీఐఎల్, ఏఎస్ రావు నగర్, అణుపురం కాలనీలలో గల షాపింగ్ మాల్స్, హోటల్స్, ఫంక్షన్ హాల్స్, గోడౌన్స్ వంటి వ్యాపార భవనాల్లో డిసి రవీంద్ర సాగర్ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, అందుబాటులో ఉంచవలసిన అగ్ని మాపక సామాగ్రి, ఫైర్ సెఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, టిపిఎస్ తుల్జాసింగ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## మహిళ దారుణ హత్య

**ప్రజాపక్షం/దుండిగల్ :** భార్య అక్రమ సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో భార్యను భర్త కడతేర్చిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే సంతోష 38,సంతోష్ కుమార్ చారి 44 భార్యాభర్తలు, 21 సంవత్సరాల క్రితం వారికి వివాహం అయ్యింది వారికి ఇద్దరు ఆడ పిల్లలు. గత కొంతకాలంగా మేడ్చల్ జిల్లా, దుండిగల్ సర్కిల్, చర్చి గాగిల్లాపూర్‌లో నివాసం ఉంటున్నారు. భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఈ నెల 5న ఇంట్లో నిద్రిస్తున్న భార్య తలపై గొడ్డలితో మోదీ హత్య చేసినట్లు పోలీస్‌లు తెలిపారు. స్థానికు ల సమాచారంతో కేసు నమోదు చేసుకున్న పోలీసు లు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన తప్పు ఒప్పుకున్నట్లు పోలీస్‌లు తెలిపారు. విచారణ అనంతరం నిందితున్ని రిమాండ్ కు పంపినట్లు దుండిగల్ సిఐ పి.సతీష్ తెలిపారు.



## ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి : దోసకాయల వెంకటేష్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ జిల్లా ఉప్పల్ భగాయత్‌లో మున్సిపల్ కార్పోరేషన్ భవనానికి శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రెండున్నరేళ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. పరిపాలన సౌలభ్యం కొరకు జిహెచ్‌ఎంసి పరిధిని మూడు భాగాలుగా విభజించారని అన్నారు. గ్రేటర్ హైద్రాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మూడు కార్పోరేషన్‌లను ఏర్పాటు చేసుకుని ప్రజలకు అందుబాటులో పరిపాలన అందిస్తున్నారని చెప్పారు.

ఇందులో బాగంగా రూ. 99 కోట్లతో ఉప్పల్‌లో మున్సిపల్ కార్పోరేషన్ భవనానంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచుటకు సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగుతున్నారని చెప్పారు. ప్రజలకు ఆరు గ్యారంటీలు ప్రకటించి అమలుపరుస్తున్నారని అన్నారు. ఉచిత విద్యుత్, సబ్సిడి గ్యాస్ సిలీండర్‌లు, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, ఇలా అనేక పథకాలను అమలుపరుస్తు ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని పేర్కొన్నారు. నేడు ఉప్పల్‌లో నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమానికి మున్సిపల్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున తరలివచ్చి సిఎం సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బండి జగన్నాధం, కౌన్సిలర్ పాపిరెడ్డి, నాయకులు బస్వారెడ్డి, వీరేషంగుప్త, రాజేంద్రప్రసాద్‌గౌడ్, జెర్రిపోతుల నర్సింలు, వేణు గోపాల్‌రావు, గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

### నేడు మల్కాజిగిరిలో ముఖ్యమంత్రి

# రూ.1,501కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**'క్యూర్-1' అప్లికేషన్‌ను ఆవిష్కరించనున్న సిఎం**

**సన్నాహాల్లో తలమునకలైన ఎంఎంసి యంత్రాంగం**



**ప్రజాపక్షం/హైదరాబాద్/మేడ్చల్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో భారీ మౌలిక వసతుల కల్పన, ల్యాండ్ మార్క్ ప్రాజెక్టులకు ఆదివారం శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేటి సాయంత్రం 5:00 గంటలకు ఉప్పల్ జోన్, ఉప్పల్ భగాయత్ లేఅవుట్ ఫేజ్III వేదికగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన చేయడంతో పాటు, పట్టణ పరిపాలనను మరింత బలోపేతం చేసేందుకు రూపొందించిన 'క్యూర్1' మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించనున్నారు.

**రూ.1,474 కోట్లతో మూడు భారీ ప్రాజెక్టులు**

* నగర రవాణా రంగాన్ని, మున్సిప ల్ పరిపాలనను ఆధునీకరించేందుకు మొత్తం రూ. 1,474 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు ప్రధాన ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.
* ఏఓసి సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణాన్ని రూ. 960 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్నారు. ఇందులో సివిల్ పనుల ఖర్చు రూ. 490 కోట్లు కాగా, భూసేకరణ వ్యయం రూ. 470 కోట్లుగా ఉంది.
* టికెఆర్ కాలేజి జంక్షన్, గాయత్రీనగర్ జంక్ష న్, మందా మల్లమ్మ జంక్షన్‌లను కలుపుతూ రూ. 416 కోట్లతో నిర్మించనున్న 6 లేన్ ల ద్విదిశాత్మక ఫ్లైఓవర్కు శంకుస్థాపన చేయనున్నారు.
* ఉప్పల్ భగాయత్ లేఅవుట్ ఫేజ్III లోని వివిధ సర్వే నెంబర్‌లలో రూ. 98 కోట్ల వ్యయంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవనాన్ని నిర్మించనున్నారు.

**ప్రజల ముందుకు 'క్యూర్ -1' యాప్.. డిజిటల్ విప్లవం !**

పౌర సేవలను మరింత పారదర్శకంగా, వేగంగా అందించేందుకు వీలుగా రూపొందించిన సమగ్ర పట్టణ పరిపాలన ప్లాట్‌ఫామ్ 'క్యూర్1' అప్లికేషన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. ప్రజలు ఆస్తిపన్ను, విద్యుత్, తాగునీటి బిల్లులు, ట్రాఫిక్ చలాన్లు వంటి అన్ని రకాల ప్రభుత్వ బకాయిలను వేర్వేరు పోర్టళ్లు తిరగాల్సిన అవసరం లేకుండా ఈ ఒక్క యాప్ ద్వారానే చెల్లించవచ్చు. ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా ప్రభుత్వ ఆదాయ వసూళ్లలో మరింత పారదర్శకత, సామర్థ్యం పెరగడంతో పాటు ప్రజలకు సమయం ఆదా అవుతుంది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం నోటిఫై చేసే మరిన్ని పౌర సేవలను సైతం ఈ యాప్‌లో అనుసంధానం చేసేలా దీని ని 'వన్‌స్టాప్ డిజిటల్ గవర్నెన్స్' ఎకోసిస్టమ్‌గా తీర్చిదిద్దారు.

**ఉప్పల్‌లో 100 పడకల ఏరియా ఆసుపత్రి**

మల్కాజిగిరి జిల్లా ప్రజల ఆరోగ్య అవసరాల కోసం ఉప్పల్‌లో నూతనంగా నిర్మించ తలపెట్టిన 100 పడకల ఏరియా ఆసుపత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. 0.97 ఎకరాల విస్తీర్ణంలో, రూ. 27.17 కోట్ల వ్యయంతో ఈ అత్యాధునిక ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఉప్పల్ భగాయత్ పరిసర ప్రాంతాల్లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## భారత్ – జపాన్ మధ్య విద్యా సంబంధాలు అభినందనీయం

### ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్ డైరెక్టర్ ఫునైషి హిరోయోషి



**ప్రజాపక్షం/నిజాంపేట్:** భారత దేశం–జపాన్‌ల మధ్య విద్యా, సాంస్కృతిక, సాంకేతిక సంబంధాలను బలోపేతం చేయడంలో సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని జపాన్ ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్ డైరెక్టర్ ఫునైషి హిరోయోషి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లిలోని బివిఆర్ ఐటి హైదరాబాద్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో హిరోషిమా ప్రిఫెక్చర్ ప్రభుత్వ ప్రతినిధి బృందం పర్యటించారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బివిఆర్ ఐటి హైదరాబాద్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విష్ణు జపాన్ అవుట్‌రీచ్ సెంటర్ జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్ ప్రభుత్వానికి చెందిన అడ్వాన్స్ ప్రతినిధి బృందానికి ఘనస్వాగతం పలికి ఆతిథ్యం కల్పించారు. ఈ ప్రతినిధి బృందంలో ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్ డైరెక్టర్ ఫునైషి హిరోయోషి, కోగా యుయా, లోకల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ డివిజన్ సూపర్ వైజర్ హరాజోనో యోషిహిరో, టోయి మారియాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణు జపాన్ అవుట్ రీచ్ సెంటర్ ద్వారా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చేపడుతున్న ఇండో జపాన్ విద్యా, పరిశోధన, సాంస్కృతిక, పారిశ్రామిక సహకార కార్యక్రమాల గురించి బృందానికి సమగ్ర అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఫునైషి హిరోయోషి మాట్లాడుతూ జపనీస్ భాషను నేర్చుకోవడంలో విద్యార్థులు చూపుతున్న ఆసక్తి, క్రమశిక్షణ, చురుకుదనాన్ని అభినందించారు. జపాన్‌లోని నైపుణ్యం కలిగిన భారతీయ యువతకు పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలను ప్రస్తావిస్తూ జపాన్‌లో ఉన్నత విద్య, ఇంటర్న్ షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి విద్యార్థులు భాషా నైపుణ్యాలతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, బివిఆర్ ఐటి నర్సాపూర్ ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే, నారా జపాన్ హబ్ డాక్టర్ రామ భద్ర, పరిశోధన మరియు అభివృద్ధి డీన్ డాక్టర్ రాజు ఎడ్ల, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్, జపనీస్ భాషా ఉపాధ్యాయులు టగూచి, అధ్యాపకులు పాల్గొన్నారు.



## పుట్టినరోజు వేడుక కాదు.. సేవా యజ్ఞం... సేవే జన్మదిన సందేశం

### ఏనుగు సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఆర్భాటాలకు దూరంగా సేవకు దగ్గరగా అంటూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు స్వగృహంలో విశిష్టంగా నిర్వహించారు. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి వేలాది కార్మికులకు లేబర్ కార్డులు అందజేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, ఒక్క యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని సమాజంలో ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు అండగా నిలవాలి అని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు కాపాడేందుకు భారతీయ జనతా పార్టీ సదా కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. దేశ నిర్మాణం లో కార్మికుల పాత్ర అత్యంత గొప్పది. వారి చెమట చుక్కలతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. లేబర్ కార్డులు కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పతకాలు, బీమా సౌకర్యాలు, విద్య, వైద్య ప్రయోజనాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. జన్మదిన వేడుకను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించిన ఏనుగు సుదర్శన్ రెడ్డిని ఈటల రాజేందర్ ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు కామారెడ్డి ఇంచార్జ్ పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అమర మోహన్ రెడ్డి, గోనె శ్రీనివాస్,ఉపాధ్యక్షులు గొంగళ్ళ బాలేష్,మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చందర్ రెడ్డి,చలువాది ప్రవీణ్ రావు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏనుగు సుదర్శన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలుతెలిపారు.



## దినేష్ కుమార్‌ను అభినందించిన కొలను శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** వాయిద్య కారుల పోటీల్లో గిన్నీస్ రికార్డు స్థాయికి ఎదిగిన దినేష్ కుమార్‌ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లోని గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సంబంధిత ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 22 దేశాల నుండి రెండు వేల మంది కీబోర్డు వాయిద్య కారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కవిగారి దినేష్ కుమార్ పాల్గొని గంటపాటు రెండువేల మంది ఆపకుండా కీబోర్డు వాయించిన ప్రతిభను గుర్తించిన అధికారులు 777 మంది వాయిద్య కారులను ఎంపిక చేశారు. వారిలో దినేష్ కుమార్ ఒకరు కావడం గర్వ కారణమని అభినందిస్తూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గిన్నీస్ రికార్డు స్థాయిలో వాయిద్య కారుల ఎంపికలో ఎదగడం సంతోషకరమని అన్నారు. దినేష్ కుమార్ ఎదుగుదలకు తనవంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తామని పేర్కొన్నారు.

## సిసి రోడ్డుకు వినతి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** వెంకటాపురం డివిజన్‌లోని బోర ని కాలనీ మజీద్ నుండి గ్రేవ్ యార్డు వరకు సిసి రోడ్డుతో పాటు రాంచంద్రయ్య కాలనీ పార్కులో పిల్లలకు అవసరమైన ఆట పరికరాలు, బోర్ పంపును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు బిఆర్ఎస్ శ్రేణులు అనిల్ కిషోర్ గౌడ్, విజయశేఖర్, మోసిన్, ప్రభాకర్‌లు శనివారం ఎంఎంసి జోనల్ కమిషనర్‌ను కల్సి వినతిపత్రం అందచేసారు.

## డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు

### కలెక్టర్ దీపక్‌తివారి




**ప్రజాపక్షం /వికారాబాద్ :** డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారుల ఎంపిక పాదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటం అని జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో తాండూర్ నియోజకరవ్గంలోని డబుల్ బెడ్ రూమ్‌ల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, అదనపు కలెక్టర్ వెంకటచారి , తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రాథోడ్ దశరథ్‌సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ సమక్షంతో రాండమైజేషన్ ద్వారా ఇండ్ల కేటాయింపుపై కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు అవగాహ న కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాండూ ర్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్‌రూమ్ నిమిత్తం 8333 దరఖాస్తులు వచ్చాయని, 1001 డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మాణాలు వివిధ శాదలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 581 ఇండ్లు లబ్దిదారులకు కేటాయిచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత ఉన్నట్లు అయితే ఇండ్లు కేటాయింపు జరిగిందని తలిపారు.

**జూన్ 21న నీట్ పున పరీక్షకు ఏర్పాట్లు :** జూన్ 21 న నిర్వహించే నీట్ పున పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారుల ను ఆదేశించారు. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు రావడం వల్ల వరిధాన్యం తడిసే ప్రమాదం ఉందని దానికి తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకొని వరి ధాన్యాన్ని త్వరితగతిని మిల్లులకు,గోదాములకు చేరవేయాలని అయన పౌరసరఫరాల అధికారులను అదేశించారు. జిల్లాలోని మొత్తం 19మండల మహిళా సమాఖ్యల ద్వారా19 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం జరిగింది అని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉమశాంకర్ ప్రసాద్, వెంకటచారి, శ్రీనివాస్, సుదర్శన్, తదితరులు పాల్గోన్నారు.



## ధరల పెరుగుదలను నియంత్రించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ డిమాండ్ చేసారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈ నెల 10న ఛలో కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆయన శనివారం ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించాచు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ఉత్పత్తుల ధరలను ఇటీవల కేంద్రం పెంచటం సామాన్య జనంపై తీవ్ర ప్రభావం కనపరుస్తోందని ఆవేదన వ్యక్తం చేసారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతుంటే పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు తగ్గించటం లేదని ప్రశ్నించారు. పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ ధరలను తగ్గించటం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, డిజి సాయిలు గౌడ్, ఎస్ శంకర్‌రావు, ధర్మేంద్ర, స్వామి, రచ్చ కిషన్, సత్యప్రసాద్, యాదయ్య, నిమ్మల నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డు ఎత్తి వేయాల్సిందే

### పోరాట కమిటీ ప్రతినిధులు షేక్ షావలి, ఉమామహేష్

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** ప్రజల అనారోగ్యాలకు దారి తీస్తున్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డును ఎత్తి వేయాలన్న డిమాండ్‌తో ఇక ఆందోళనలను ఉధృతం చేసేందుకు గాను నూతన పోరాట కమిటి ఏర్పాటైంది. ఈ కమిటి చైర్మన్‌గా ఇఫ్టూకు చెందిన షేక్ షావలి చైర్మన్‌గా, సిపిఐకి చెందిన కన్వీనర్‌గా ఉమా మహేష్, కోశాధికారిగా శివబాబు, గౌరవ సలహాదారులుగా కారింగుల శంకర్ గౌడ్, రావల్‌కోల్ నర్సింహగౌడ్, కల్లెపల్లి సదానందం, కోకన్వీనర్లుగా మేకల కావ్య, కొండల్ ముదిరాజ్, ఆలూరి రాజశేఖర్, శివన్నారాయణ, లలిత యాదవ్, ఆంజనేయులు, అనురాధ, సదానందం, మల్లేష్, ప్రఫుల్ రాంరెడ్డి, పాషామియా, సింగరాయ గౌడ్, యాకస్వామిలు ఎన్నికయ్యారు. కాలుష్యానికి కారణమవుతున్న డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని, జవహర్‌నగర్ పరిధిలోని బస్తీల్లో రోడ్లు, డ్రైనేజి, మంచినీరులాంటి మౌలిక వసతులు కల్పించాలని, జవహర్‌నగర్‌లో పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాన్న డిమాండ్లతో తమ ఆందోళన కొనసాగిస్తామని ఈ సందర్భంగా కమిటి ప్రతినిధులు షేక్ షావలి, ఉమామహేష్‌లు తెలిపారు.



## సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ

### నవాబుపేట్ ఎస్ఐ గిరి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నవాబుపేట ఎస్సై గిరి ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని ఎక్మామిడి, పులుమామిడి, వట్టిమీనపల్లి, చిట్టిగిద్ద తదితర గ్రామాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లల భద్రతకు సంబంధించిన సురక్షా మిత్ర కార్యక్రమం, అలాగే గ్రామాల్లో సిసి కెమెరాల ప్రాముఖ్యతను వివరించే రక్షణ నేత్ర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను నివారించడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, అనుమానాస్పద సంఘటనలను వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో సిసి కెమెరా ల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, ఆస్తుల రక్షణ మరింత బలోపేతం అవుతుందని వివరించారు. గ్రామాలను సురక్షితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు,ఉపసర్పంచ్‌లు గ్రామ పాలకవర్గం, మాజీ ప్రజా ప్రతినిధులు, యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ఆయాలు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలకు దరఖాస్తులు

### శామీర్‌పేట మండల విద్యాధికారి కమలాకర్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రీ ప్రైమరీ పాఠశాలలకు ఆయాలు, ఇన్‌స్ట్రక్టర్లు నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శామీర్‌పేట మండల విద్యాధికారి కమలాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శామీర్‌పేట మండల పరిధిలో నూతనంగా మంజూరైన ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఆయాలు, ఇన్‌స్ట్రక్టర్ల నియమాకానికి స్థానిక మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి పేర్కొన్నారు. తూంకుంట, పోతాయిపల్లి, దేవరయాంజాల్, మందాయిపల్లి, ఉప్పర్‌పల్లి, సింగాయిపల్లి ప్రాథమిక పాఠశాలలకు ఆసక్తి గల వారు 2026 జూన్ 8 లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. విద్యార్హతలు ఆయా 7వ తరగతి పాసై ఉండాలని ఇన్‌స్ట్రక్టర్ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఆయాకు నెలకు రూ.6 వేలు, ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ.8 వేలు వేతనం ఉంటుందన్నారు. ఇతర పూర్తి వివరాలకు మండల విద్యావనరుల కార్యాలయంలో లేదా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

## నూతన డిసికి అభినందనలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** మల్కాజ్‌గిరిమున్సిపల్ కార్పోరేషన్ కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామలింగంను దమ్మాయిగూడ మున్సిపాలిటీ ఆహ్మాద్ గూడ 4వ వార్డు మాజీ కౌన్సిలర్ మంగళపురి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులుపాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
ఆదివారం
07-06-2026
www.prajapaksham.in

“ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్‌డ్రామా ‘స్లమ్ డాగ్’ ఈ చిత్రం ప్రొడక్షన్ విజయవంతంగా పూర్తయింది. ’33 టెంపుల్ రోడ్ అనే ఆసక్తికరమైన ట్యాగ్ లైన్ తో ఈ ప్రాజెక్ట్ దాని టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్‌లుక్ విడుదల నుండి హ్యాజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ”

రీల్



# ‘ఎల్లమ్మ’ నన్ను నిలబెడుతుంది

## ‘సింగ్ గీతం’ నాకు కొత్త ప్రయోగం

## ‘ప్రజాపక్షం’తో సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్

తెలుగు సినిమా తెరపై తరచుగా వినిపించే పేరు దేవిశ్రీ ప్రసాద్. రాక్ స్టార్ గా పేరుగాంచిన యువ సంగీత కెరటం దేవిశ్రీ ప్రసాద్. కథలోని సన్నివే శం చెబితే ఆ సన్నివేశానికి తగ్గట్టుగా అప్పటికప్పుడే టూ్యన్ కట్టగల సమర్థుడు. తెలుగు, తమిళ భాషల్లోనూ తన దైన సత్తా చాటుతున్నారు దేవి. సంగీతాభిమానులను వినసొంపుగా, శ్రోతలను సంగీతంలో ఓలలాడించే ప్రయోగశాల దేవిశ్రీ. ప్రతీ సినిమాకు ఏదో కొత్తగా చెయ్యాలని తపించే మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ. కొత్త కొత్త గాయని, గాయకులను సైతం చిత్రసీమకు పరిచయం చేస్తూ న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేసే దేవిశ్రీ ప్రసాద్ ప్రస్తుతం ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాస్ రావు రూపొందించిన ’సింగ్ గీతం’అనే సినిమాకు మ్యూజిక్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం ప్రతినిధిని కలసిన దేవిశ్రీ ప్రసాద్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

**ప్రశ్న : సింగీతం శ్రీనివాసరావుతో సినిమా అనగానే మీ ఫీలింగ్ ఏంటి?**

**దేవిశ్రీ :** నేను సింగీతం శ్రీనివాసరావు గారికి వీరాభిమానిని. ఆయన లెజెండ నాన్నని కలవడానికి వచ్చేటప్పుడు వాళ్లు మాట్లాడుకుంటుంటే నేను ఆరాధనగా చూసేవాడిని. చాలా ఏళ్ల క్రితం పవన్ కళ్యాణ్ తో జీసస్‌పై ఒక సినిమా అనుకున్నాం. అది వినగానే నాకు చాలా థ్రిల్‌గా అనిపించింది. ఎప్పుడైనా ఆ సినిమా చేయాలని అనిపించింది. ‘సింగ్ గీతం’ జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

**ప్రశ్న : సింగీతం శ్రీనివాస్ రావు ఒక్కో సినిమాను ఒక్కో ప్రయోగంగా చేస్తారు ? మ్యూజిక్ పరంగా ఈ సినిమా వరకు మీకేమనిపించింది?**

**దేవిశ్రీ :** సింగీతం గారు చేసిన ప్రయోగాలు మరెవ్వరూ చేసి ఉండరు. పుష్పక విమానం, భైరవద్వీపం, ఆదిత్య 369 వంటి చిత్రాలు నాకు చాలా ఇష్టం. మూడేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ చేస్తున్నామని ఆయన నుంచి ఫోన్ వచ్చింది. అప్పుడు నాకు చాలా ఆనందంగా అనిపించింది. తర్వాత ఏడాది క్రితం నాగ్ అశ్విన్ , స్వప్న , వైజయంతి మూవీస్‌తో కలిసి ఈ సినిమా రూపొందుతుండటం మరింత ఆనందాన్ని ఇచ్చింది. అయితే సింగీతం శ్రీనివాస్ రావు కు సంగీతంపై కూడా అద్భుతమైన పట్టు ఉంది. అందుకే ఈ సినిమాలో నేను కూడా కొన్ని ప్రయోగాలు చేశాననే అనుకుంటున్నాను. నిజం చెప్పాలంటే ఈ సినిమాను నేను చాలా అదృష్టంగా భావిస్తున్నాను. సింగీతం గారికి ఒక ట్రిబ్యూట్‌లా, ఆయనతో కలిసి పని చేయడం ఒక బ్లెస్సింగ్‌లా అనిపించింది. ఈ ఆనందాన్ని మాటల్లో చెప్ప లేను.

**ప్రశ్న : సింగీతం శ్రీనివాస్ రావు చాలా ఏళ్ల క్రితమే ఈ కథ అనుకున్నారు కదా.? నేటి పరిస్థితులకు ఈ కథ ఎంత రిలెవెంట్‌గా ఉంటుంది?**

**దేవిశ్రీ :** సింగీతం గారు ఎప్పుడూ ట్రెండ్‌కి తగ్గట్టు కథలు ఆలోచించ లేదు. ఆయనకు ఒక ఆలోచన వచ్చిందంటే అది ఇంతకుముందు రానిది, తర్వాత కూడా రానిదిగా ఉంటుంది. ఆయన చేసిన సినిమాలన్నీ గమనిస్తే అలాంటివే. పుష్పక విమానం ఇప్పటికీ చాలా అడ్వాన్స్‌డ సినిమా. ‘సింగ్ గీతం’ ఐడియా కూడా అంతే కొత్తగా ఉంటుంది. కళ, సంగీతానికి సంబంధించిన అంశాలు ఎప్పటికీ పాతబడవు. 50 ఏళ్ల తర్వాత చూసినా కొత్తగానే అనిపిస్తుంది.ఒక గ్రామం మొత్తం మాట్లాడలేక, కేవలం పాటల రూపంలోనే సంభాషించే కథ ఇప్పటివరకు రాలేదు.ఇది కేవలం కామెడీ సినిమా కాదు. ఇందులో అద్భుతమైన భావోద్వేగాలు కూడా ఉన్నాయి. ఈ సినిమా చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

**ప్రశ్న :మాటలను పాటలుగా చేశారు అన్నారు అదెలా ?**

**దేవిశ్రీ:** నిజంగా ఇది నా కెరీర్‌లో అత్యంత ఛాలెంజింగ్ సినిమా. నాకు స్క్రిప్ట్ ఇచ్చారు. ఆ స్క్రిప్ట్ మొత్తం చదివి ప్రతి డైలాగ్‌ను సంగీతంగా మార్చాల్సి వచ్చి ంది. ట్యూన్స్ కట్టడం వచ్చేది. కానీ లిరిక్స్ ఉండేవి కావు. అప్పుడు న్యూస్‌పేపర్ తీసుకుని అందులో ఉన్న వార్తలనే ట్యూన్స్‌గా మార్చుకునేవాడిని. మా నాన్న చూసి నవ్వేవారు.చిన్నప్పటి నుంచి ప్రతి అక్షరాన్ని సంగీతంగా మార్చే అలవాటు నాకు ఉండేది. తెలిసో తెలియకో అదే ఈ సినిమాకు ఉపయోగపడిం ది. ఒక సీన్ తీసుకుని మ్యూజికల్‌గా చేసి వినిపి ంచాను. అది విని సింగీతం గారు చాలా సంతోషించారు. ‘మనకు కావాల్సిన మ్యూజిక్ ఇదే‘ అన్నారు. అది నాకు పెద్ద కాంప్లిమెంట్‌గా అనిపించింది.

**ప్రశ్న : కథలో కీలమైన అంశం ఏంటి ?**

**దేవిశ్రీ :** ఒక గ్రామం మొత్తం మాటలను పాటల రూపంలో చెప్తారు. కథ మొత్తం ఇలాగే ఉంటుంది. మేమంతా సినిమా చూస్తున్నప్పుడు మళ్లీ సింగీతం శ్రీనివాస్ రావు గారి విజన్‌కి ముగ్ధులమైపోయాం. ఆయన ఆలోచనల గొప్పతనం మరోసారి అర్థమైంది.వర్క్ పరంగా పూర్తిగా సంతృప్తినిచ్చిన ప్రాజెక్ట్. స్క్రిప్ట్ స్థాయిలోనే అవి కుదిరాయి. ఈ విషయంలో సింగీతం గారికి నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాలి.సినిమా చూసి ఇంటికి వెళ్తూ సరదాగా మాటల్ని కూడా పాటల్లా పాడుకుంటూ వెళ్తారని నమ్ముతున్నాను. అన్నిటికంటే ముఖ్యంగా 94 ఏళ్ల వయసులో కూడా ఇంత కొత్త ఆలోచనతో, ఇంత ఉత్సాహంగా సినిమా చేసిన సింగీతం గారి నుంచి ప్రేక్షకులు స్ఫూర్తి పొందుతారు.

**ప్రశ్న: ‘ఎల్లమ్మ’ సినిమాలో హీరోగా చేస్తున్నారు ? మీ కెరీర్ కు వర్క్ అవుట్ అవుతుందంటారా?**

**దేవిశ్రీ :** ఒక మంచి సినిమాతో స్క్రీన్ మీదకు రావాలని ఎప్పటి నుంచో అనుకున్న. కానీ దిల్ రాజు సినిమాలో ఎల్లమ్మతో కుదిరింది. ఈ సినిమాకు సంబధించి చాలా పని పూర్తయింది. కొన్ని పాటలు చేశాను. ఒక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌కు బ్యాక్‌గ్రౌండ స్కోర్ కూడా కంపోజ్ చేశాను. మ్యూజిక్, నటన విషయంలో మంచి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. దిల్ రాజు నెలకు పది రోజుల సమయం ఇవ్వమని చెప్పారు. ఆ విధానం నాకు చాలా నచ్చింది. ప్రస్తుతం కథ గురించి ఎక్కువ చెప్పలేను. ఇది రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ. ఎల్లమ్మ గ్యారంటీగా నన్ను నిలబెడుతుందనే విశ్వాసం నాకుంది.



# 26న వస్తున్న ‘లెనిన్’

మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ‘లెనిన్’. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలలో నటించిన ఈ మూవీకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది.ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు ప్రేక్షకుల్లో అంచనాలు మరింతగా పెంచేశాయి. ఇటీవల మేకర్స్ ‘సోల్ ఆఫ్ లెనిన్’ అంటూ ఆడియెన్స్‌ని సర్ ప్రైజ్ చేశారు. ‘పెద్ది’ సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. ‘పెద్ది’ ప్రదర్శనలకు ఈ ‘సోల్ ఆఫ్ లెనిన్’ను జోడించారు. ఈ ఉద్వేగభరితమైన, పవర్ ఫుల్ పాటకు బ్లాక్‌బస్టర్ స్పందన లభించింది. సినీ లవర్స్ ఈ పాట, అందులోని క్లిప్స్‌ను ఆన్‌లైన్‌లో షేర్ చేస్తూ అద్భుతంగా ఉందని కామెంట్లు పెడుతున్నారు. ఈ పాటలో అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే మధ్య ఉండే ప్రేమ, వారి బాండింగ్‌ను చక్కగా చూపించారు. ‘ప్రేమ కంటే గొప్ప యుద్ధం లేదు’ అనే క్యాప్షన్‌తో ఈ పాట సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రేమ కోసం అఖిల్ చేసే పోరాటం, భాగ్యశ్రీ ఆకట్టుకునే నటన ఈ పాటకు మరింత అదనపు ఆకర్షణను జోడించాయి. థమన్ స్వరపరిచిన ఈ పాట ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. కళ్యాణ్ చక్రవర్తి సాహిత్యం, వాగ్దేవి గాత్రం ఈ పాటను మరింత అందంగా మలిచాయి. ఈ పాటలోని ప్రతి ఫ్రేమ్, ప్రతి విజువల్ భావోద్వేగాలతో కూడిన ఒక కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుందని హామీ ఇస్తున్నాయి. అఖిల్ మాస్ అప్పీల్, యాక్టింగ్, ఎమోషన్స్ అన్నీ కూడా ఈ పాటలో కనిపిస్తున్నాయి. పాటలు, గ్లింప్స్, పోస్టర్లతోనే సినిమాపై అంచనాలను గణనీయంగా పెరిగాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని థమన్ ఎస్ అందించారు. పాటలు, నేపథ్య సంగీతం ఈ సినిమా స్థాయిని మరింత పెంచుతాయని భావిస్తున్నారు. లియోన్ బ్రిట్టో సినిమాటోగ్రఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.ఈ చిత్రం జూన్ 26, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: థమన్ ఎస్, ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: లియోన్ బ్రిట్టో, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా.



# ‘సుధీర్స్ జోకర్‘ హీరోయిన్ అయేషా స్పెషల్ పోస్టర్ రిలీజ్

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ‘సుధీర్స్ జోకర్’. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్ అయేషా పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ‘సుధీర్స్ జోకర్‘ చిత్రంలో ఆమె షాలినీ అనే క్యారెక్టర్ లో తన అందంతో పాటు పర్ ఫార్మెన్స్ తో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. రీసెంట్ గా హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ‘సుధీర్స్ జోకర్‘ మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి. సుడిగాలి సుధీర్, అయేషా, అభిరామి,మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అహ్మద్ షెరీఫ్, మ్యూజిక్ లియోన్ జేమ్స్, ప్రొడ్యూసర్స్ విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ, స్క్రిప్ట్, డైరెక్షన్ పీఎస్ సునీల్ పుప్పాల.

# ‘రణబాలి‘ షూటింగ్ 90 శాతం పూర్తి



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ ‘రణబాలి‘. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై ‘రణబాలి‘ సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవి శంకర్ నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా ‘రణబాలి‘ సినిమా రూపొందుతోంది.తాజాగా ‘రణబాలి‘ సినిమా సక్సెస్ ఫుల్ గా వంద రోజుల షూటింగ్ పూర్తి చేసుకుంది. ఇటీవలే గండికోటలో షెడ్యూల్ చిత్రీకరణ జరిపారు. వారం రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్ లో విజయ్ దేవరకొండ, రశ్మిక మధ్య వచ్చే ఎమోషనల్ సీన్స్ రూపొందించారు. ఇప్పటిదాకా ఈ చిత్రానికి సంబంధించిన 90 శాతం షూటింగ్ కంప్లీట్ అయ్యింది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న ‘రణబాలి‘ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్ కు అన్ని సన్నాహాలు చేస్తున్నారు.

# మరో ఐదు ఉద్యోగ సంఘాలకు ఓడి అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని 17 ఉద్యోగ సంఘాల నాయకులకు ఉన్న అదర్ డ్యూటీ(ఒడి) అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఐదు ఉద్యోగ సంఘాలకు కూడా ఒడి సౌకర్యాన్ని కల్పించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హూర్ మహేష్ దత్ ఎక్కా ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ తహసిల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఎ), తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టిపియుఎస్), స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌టిఎఫ్),గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సంఘాలకు ఒడి అవకాశాన్ని కల్పించారు.



చండ్ర రాజేశ్వర్‌రావు 112వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని సిపిఐ కార్యాలయం అజయ్ భవన్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించిన సిపిఐ ప్రధాన కార్యదరి డి. రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ, ప్రకాష్ బాబు, దినేష్.

# అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలలో విశ్వవిజేతగా తెలంగాణ సింగరేణి

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాంబియా దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలలో సింగరేణి రెస్క్యూ జట్టు అద్భుత ప్రదర్శనతో విశ్వవిజేతగా నిలివడం సంతోషకరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. చైనా, కెనడా, ఆస్ట్రేలియా, పోలాండ్, కొలంబియా వంటి గనులు అధికంగా ఉండే దిగ్గజ దేశాల జట్లతో పోటీపడి, భూగర్భ రెస్క్యూ విభాగంలో ప్రథమ బహుమతి కైవసం చేసుకోవడం గర్వకారణమన్నారు. హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కను సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్‌తో కలిసి రెస్క్యూ జట్టు మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వారు సాధించిన ప్రతిష్ఠాత్మక ట్రోఫీలను, మెడల్స్‌ను డిప్యూటీ సిఎంకి అందించారు. ఈ సందర్భంగా రెస్క్యూ టీం సభ్యులను డిప్యూటీ సిఎం ప్రత్యేకంగా అభినందించారు. భూగర్భ గనుల రక్షణలో తామెప్పుడూ అగ్రగామినే అని సింగరేణి సంస్థ ప్రపంచ వేదికపై మరోసారి నిరూపించిందన్నారు. గనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు రెస్క్యూ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి అందించే సేవలు అసమానమైనవని భట్టి విక్రమార్క కొనియాడారు. సింగరేణిని కేవలం ఒక బొగ్గు ఉత్పత్తి సంస్థగానే కాకుండా, అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలిపేందుకు మా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని డిప్యూటీ సిఎం అన్నారు. గనుల్లో అత్యంత కఠినమైన పరిస్థితుల్లో పనిచేసే మన రెస్క్యూ సిబ్బంది నైపుణ్యం, అంతర్జాతీయ పోటీల ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పి అండ్ పి) కె. వెంకటేశ్వర్లు, జిఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, రెస్క్యూ జిఎం శ్రీనివాసరెడ్డి, రెస్క్యూ జట్టు సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్‌ఎస్‌ఎస్ దాడి

(మొదటి పేజీ తరువాయి)





బయటపెడుతోందని విమర్శించింది. ధరేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించకుండా, తన పనితీరును సమర్థించుకోలేక, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ కూటమి మరోసారి బెదిరింపులకు, హింసకు పాల్పడిందని, శాంతియుతంగా నిరసన తెలిపే తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుంటున్న పౌరులపై దాడి చేస్తున్న, కుదిపేసిన ఆర్‌ఎస్‌ఎస్‌బీజేపీ కూటమి అసలు స్వరూపాన్ని అన్నీ రాజా, నిషా సిధులపై జరిగిన దాడి బయటపెట్టిందని తెలిపింది.నిరసనలకు పిలుపు : ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ, మహిళా, విద్యార్థి, యువజన సమాఖ్యల కార్యకర్తలపై ఆర్‌ఎస్‌ఎస్ జరిపిన సిగ్గుమాలిన దాడిని ఖండిస్తూ బలమైన నిరసనలు చేపట్టాలని అన్ని శాఖలకు సిపిఐ పిలుపునిచ్చింది.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

## ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజన్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులంతా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్ననేపథ్యంలో ఆయనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే బర్తరఫ్ చేయాల్సిందేనన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు దేశ వ్యాప్తంగా తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. నీట్, సిబిఎస్‌ఈ ప్రశ్నాప్రతాల లీకెజికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్రసమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ నేతలు, విద్యార్థులు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవి రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి దినేష్ శ్రీరంగ రాజన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థుల తరపున కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో నిరసనలు కొనసాగుతున్నాయని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ప్రజల సమస్యలపై పోరాడే వారిని విభజించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. అయితే ఈసారి దేశ యువత, ముఖ్యంగా విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ విధానాలను గట్టిగా ప్రశ్నిస్తున్నారని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడడం, మరోవైపు విద్యా వ్యవస్థలో నెలకొన్న లోపాల కారణంగా విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిబిఎస్‌ఈ పరీక్షల నిర్వహణలో తీవ్ర అక్రమాలు, పోర్టల్ లోపాలు చోటుచేసుకున్నాయనిఆరోపించారు. టెండర్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, గతంలో బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఒక సంస్థ పేరు మార్చుకుని మళ్లీ టెండర్ పొందిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని పెద్ద రాజకీయ నాయకులు కాకుండా 12వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులే బయటపెట్టారని, వారి ధైర్యాన్ని అభినందిస్తున్నన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపి), పరీక్షల కేంద్రీకరణ విధానాల వల్లే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, నీట్‌తో పాటు కేంద్ర విద్యా విధానాలను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అవలభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎఐఎస్‌ఎఫ్‌తదితర విద్యార్థి, యువజన సంఘాలు దేశవ్యాప్తంగా క్యాంపస్‌లలో ఆందోళన లు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్యకర్తలపై ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు దాడి చేయడం దుర్మార్గమన్నారు. దేశవ్యాప్తంగా ఇలా ంటి దాడులు జరుగుతున్నప్పటికీ తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు వల్లి ఉల్లాఖాద్రీ, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.బి.స్టాలిన్, రా ష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటికీ సాగునీరు లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1.27 కోట్ల ఎకరాలకు సాగునీరు అందిస్తామని గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రకటించినప్పటికీ, 50 లక్షల ఎకరాలకు పైగా భూమికి ఇప్పటికీ సాగునీటి సదుపాయం లేదన్నారు. ఎన్నికల సమయంలో కమ్యూనిస్టు పార్టీల మధ్య వ్యూహాత్మక అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, మతోన్మాదం, కార్పొరేట్ విధానాలు, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత మరింత బలపడాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ ఒకే పార్టీగా విలీనం తక్షణం సాధ్యం కాకపోయినా, ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి నిర్మాణం దిశగా కృషి కొనసాగుతుందని ఆయన చెప్పారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జాన్‌వెస్లీతో ‘మీట్ ది ప్రెస్’ కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ సందర్భఃగా జాన్ వెస్లీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి రాష్ట్ర సాధన వరకు కమ్యూనిస్టుల పోరాటాలను విస్మరించలేమన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలలోని ఆదివాసీ ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రజలు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని, అనేక గ్రామాల్లో రోడ్లు, విద్యుత్, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేస్తోందని ఆయన ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటిఐఆర్ వంటి హామీలను అమలు చేయలేదన్నారు. బిసిలకు 50 శాతానికి పైగా రిజర్వేషన్ల కోసం రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసినా కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో గతంలోని బిఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. దళితబంధు, గిరిజనులు, మైనారిటీలకు రిజర్వేషన్ల పెంపు, పోడు భూములకు పట్టాలు, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, వ్యవసాయ కూలీలకు భృతి వంటి హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని తెలిపారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా క్షేత్రస్థాయిలో అమలు జరగడంలేదన్నారు. నిరుద్యోగ సమస్య రాష్ట్రంలో మరింత తీవ్రమవుతున్నప్పటకీ రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రైవేట్ సంస్థల ఆదిపత్యం పెరిగిపోవడంతో ప్రభుత్వాలనే శాసించే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 60 శాతానికి పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలలో చదువుతున్నారని, జిహెచ్‌ఎంసి పరిధిలో ఈ సంఖ్య 80 శాతానికి మించిందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యాన్ని పూర్తిగా ప్రభుత్వ రంగంలో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్ల స్థలాలు, గృహవసతి సమస్యలపై మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 30 లక్షల కుటుంబాలు సరైన నివాసం లేక ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీ పూర్తిగా అమలు కాలేదని, పేదలకు 120 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. వామపక్షాల ఐక్యతపై స్పందిస్తూ, ప్రస్తుతం రాష్ట్రంలో తొమ్మిది వామపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, రైతుకార్మిక సమస్యలు, ధరల పెరుగుదలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, శ్రామికవర్గాల ఐక్యతతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని జాన్ వెస్లీ చెప్పారు. ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడుతూ మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, బస్తీల్లో విస్తృత ప్రచార ఉద్యమాలు చేపట్టి, అనంతరం హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు హాష్మీ సమన్వయకర్తగా వ్యవహరించగా, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎస్.విజయ్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్ వరికుప్పల వేదికపై ఆశీనులయ్యారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com